


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 176

శుక్రవారం 15-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

తెలంగాణలో వైద్యవిద్య విప్లవం

ఒకే రోజు 9 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభం

దేశంలోనే అత్యధిక మెడికల్ సీట్లు ప్రతి లక్ష మంది ప్రజలకు 22

4 రెట్లు పెరిగిన వైద్య సీట్లు | 8 కొత్త కళాశాలలు 2024 | 10,000 ప్రతి ఏడాది కొత్త డాక్టర్స్



ఒకే రోజు 9 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభం

తెలంగాణలో వైద్యవిద్య విప్లవం





రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యభాగ్యాన్ని అందించే లక్ష్యంతో వైద్యవిద్యలో తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక ప్రగతిని సాధించింది. రాష్ట్రంలో భారీగా పెరిగిన మెడికల్ సీట్లలో 85శాతం సీట్లను స్థానిక విద్యార్థులకే కేటాయించడంతో నిన్నటివరకు అందని ద్రాక్షగా భావించిన వైద్యవిద్య నేడు తెలంగాణ విద్యార్థులకు అతి చేరువలోకి వచ్చింది. ఇవాళ దేశంలోకెల్లా అత్యధికంగా మెడికల్ సీట్లు కలిగిన రాష్ట్రం తెలంగాణ. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి సారథ్యంలో జిల్లాకో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజి ఏర్పాటు లక్ష్యంగా పురోగమిస్తున్నది. ఇందులో భాగంగా నేడు ఏకకాలంలో 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో బోధనా తరగతులను ప్రారంభించుకునే అపురూప ఘట్టాన్ని ఆవిష్కరిస్తున్నది.

దేశంలోనే అత్యధిక మెడికల్ సీట్లు ప్రతి లక్ష మంది ప్రజలకు 22

4 రెట్లు పెరిగిన వైద్య సీట్లు

8 కొత్త కళాశాలలు 2024

10,000 ప్రతి ఏడాది కొత్త డాక్టర్స్

దశాబ్ద కాలంలో నూతనంగా 21 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వం



గౌరవనీయులైన
శ్రీ టి.హరీష్ రావు గారు
వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు ఆర్థికశాఖా మంత్రి, తెలంగాణ ప్రభుత్వం

తెలంగాణ వైద్య విద్యలో గణనీయమైన పురోగతి

2014	2850 సీట్లు
2023	8515 సీట్లు

ప్రారంభోత్సవం

గౌరవనీయ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు 15 సెప్టెంబరు 2023న 9 ప్రభుత్వ వైద్య కళాశాలలను జాతికి అంకితం చేస్తారు.

వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ, తెలంగాణ ప్రభుత్వం.

జారీ చేయువారు స్పెషల్ కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.



HYDERABAD-SECUNDERABAD DISTRIBUTOR: Rathi Trading Company, R Anil: 9513442689, Pavan: 7981499804, Manoj: 7416039747, T Anil: 9513442691
MEDAK DISTRIBUTOR: Rathi Trading Company, Shekhar: 9849723361
SANGA REDDY AND RANGA REDDY DISTRIBUTOR: Rathi Trading Company, Nagarjuna: 960367686
SIDDIPET DISTRIBUTOR: Rathi Trading Company, Tirupati: 9849501018
TANDUR & VIKARABAD DISTRIBUTOR: Rathi Trading Company, Vignesh: 9291414414


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా,
ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 176

శుక్రవారం 15-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫైనల్లో శ్రీలంక

ఆసియా కప్ 'సూపర్-4' మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై గెలుపు -15లో



సరికొత్త శిఖరంపై నిఫ్టీ

ట్రేడింగ్‌లో 98 పాయింట్లు ఎగసి 20,167 స్థాయికి.. -15లో



సనాతన ధర్మంపై కుట్ర

ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని దురహంకార కూటమిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.

వివరాలు 6లో ▸



నిఫాపై నిరంతర నిఘా

ప్రాణాంతక నిఫా వైరస్ మళ్లీ వెలుగు చూడటంతో కేరళ అప్రమత్తమైంది. బాధితులకు మందులు సిద్ధం చేసింది.

వివరాలు 6లో ▸



డేటా గ్రిడ్‌లో సుప్రీం కేసులు

జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్‌తో సుప్రీం కేసుల వివరాలను అనుసంధానించినట్లు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు.

వివరాలు 6లో ▸



రాక్షస మూక

జమ్మూకశ్మీర్‌లో లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్'పై ప్రత్యేక కథనం

వివరాలు 6లో ▸

లిక్కర్ స్కాం.. మళ్లీ తెరపైకి!

ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసులు • నేడు లేదా రేపు ఢిల్లీలో విచారణకు రావాలని ఆదేశం

- ఇప్పటికే కవితను మూడు సార్లు విచారించిన అధికారులు
- పలువురు నిందితులు అప్రూవర్లు కావడంతో దర్యాప్తులో మలుపు
- ఇదంతా ఎన్నికల స్టంట్.. బీజేపీ రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపణ
- నేడు ఢిల్లీలో ఈడీ విచారణకు దూరం!
- పార్టీ లీగల్ టీమ్ సలహాలతో ముందుకెళ్తామని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. శుక్రవారం లేదా శనివారం విచారణ కోసం ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశించింది. ఎమ్మెల్సీ కవితకు దర్యాప్తు సంస్థలు నోటీసులు జారీ చేయడం ఇది నాలుగోసారి. ఇంతకుముందు ఈ ఏడాది మార్చిలో ఆమెకు ఈడీ వరుసగా నోటీసులు జారీ చేసింది. ఆ నెలలో 16, 20, 21వ తేదీల్లో మూడు సార్లు ఆమెను వివిధ అంశాలపై ప్రశ్నించింది. మరోవైపు గతేడాది చివర్లో లిక్కర్ కుంభకోణం అంశంలోనే సీబీఐ కూడా కవితను హైదరాబాద్‌లోని నివాసంలో విచారించింది. ఇప్పుడు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే శుక్రవారం జరిగే ఈడీ విచారణకు దూరంగా ఉండాలని నిర్ణయించామని.. ఏం చేయాలన్నదానిపై తమ న్యాయ బృందం స్పందిస్తుందని ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు.

సుమారు ఆరు నెలల తర్వాత

వరుస నోటీసులు, విచారణలతో సంచలనం సృష్టించిన ఈడీ సుమారు ఆరు నెలలుగా స్తబ్దుగా ఉండిపోయింది. ఇటీవలి పలు పరిణామాల నేపథ్యంలో తిరిగి చర్యలు ప్రారంభించింది. గత కొన్ని నెలల్లో ఈ కేసులో నిందితులైన కవిత మాజీ ఆడిటర్ బుచ్చిబాబు, దినేశ్ అరోరా, శరత్‌చంద్రారెడ్డి, మాగుంట రాఘవ తదితరులు అప్రూవర్లుగా మారారు. ఈ క్రమంలో కవితకు ఈడీ నోటీసులు రావడం కలకలం రేపుతోంది. గతంలో మూడు సార్లు ఈడీ విచారించినప్పుడు ప్రతిసారి కవితను అరెస్టు చేయవచ్చంటూ ప్రచారం జరిగింది. ఇప్పుడు కూడా అలాంటి

మిగతా 8వ పేజీలో ▶

ఈడీ నోటీసు కాదు.. మోదీ నోటీసు

టీవీ సీరియల్‌లా ఏడాది నుంచి సాగదీస్తున్నారు: కవిత



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తనకు పంపినవి ఈడీ నోటీసులు కాదని.. అవి మోదీ నోటీసులు అని, రాజకీయ కక్షతోనే పంపారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ నోటీసుల విషయమై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదన్నారు. ఈడీ నోటీసులను తమ పార్టీ లీగల్ సెల్‌కు పంపించామని.. లీగల్ బృందం

మిగతా 8వ పేజీలో ▶

చంద్రబాబు పాత్ర సుస్పష్టం

'స్కిల్' ప్రాజెక్టులో సీమెన్స్ ప్రమేయమే లేదు

- ఆ సంస్థ పేరుతో బురిడీ కొట్టించారు
- సీఎం హోదాలో బాబు డిజిటల్ సంతకాలే సాక్ష్యం.. అగ్రిమెంట్‌లో తేదీ, లెటర్ నంబర్ కూడా లేదు
- థర్డ్ పార్టీకి ప్రభుత్వ సొమ్ము ఇవ్వొద్దన్న నిబంధనలు బేఖాతరు
- నాలుగు లేయర్లలో డబ్బుల పంపిణీ జరిగినట్టు ఆధారాలు.. ఏపీ సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్ వెల్లడి
- ఈ కుట్ర పుణేలో వెలుగులోకి: ఏపీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్, ఏఏజీ పొన్నవోలు

- రూ.కోటి విలువను రూ.250 కోట్లకు పెంచారు.. ఈ స్కామ్ ఫైళ్లను సెక్రటేరియట్‌లో తగులబెట్టారు

2లో

మదింపు బూటకం.. నివేదిక నాటకం

'స్కిల్' ప్రాజెక్ట్‌ను తాము పరిశీలించనే లేదన్న 'సీఐటీడీ'

- రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ అని మేం నిర్ధారించలేదు
- రూ.371 కోట్లు విడుదలకు అనుమతించ లేదు
- సీఐడీ దర్యాప్తులో వెల్లడించిన సీఐటీడీ
- కేవలం పత్రాలు సమర్పించి పరిశీలించమన్నారు
- అప్పటికే నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల



- వివరాలు 3లో

న్యూస్‌రీల్

పగోళ్లు కావాలా.. పనోళ్లా?



''పాలమూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయి. మనకు పనోళ్లు కావాలా, పగోళ్లు కావాలా? ప్రజలు ఆలోచించాలి. వచ్చే ఎన్నికల్లో నోబెల్స్..గోబెల్స్‌కు మధ్యే పోటీ'' అని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

- వివరాలు 8లో▶

ఆర్టీసీ ఉద్యోగులు.. ఇక ప్రభుత్వ ఉద్యోగులే



ఎట్టకేలకు ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోద ముద్ర వేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఓకే చెప్పడంతో చట్టబద్ధత పొందింది.

- వివరాలు 5లో▶

కన్నుమూస్తే.. ఆ కౌంట్‌లోకి

చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జైలుపాలైన నేపథ్యంలో అనారోగ్యం, ఇతర కారణాలతో మరణించిన వారిని చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకే చనిపోతున్నారంటూ టీడీపీ తమ ఖాతాలో వేసుకుంటోంది.

- వివరాలు 2లో▶



ముసుగు తీసిన చంద్రసేనాని



- ఇన్నేళ్లూ చంద్రబాబు చాటున ఒదిగిన పవన్‌కళ్యాణ్
- చంద్రబాబు అరెస్టుతో పాత బంధానికి కొత్త రంగు
- 2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తంటూ కొత్తపాట
- బీజేపీ కూడా తమ వెంట వస్తుందని ఆశిస్తున్నామంటూ సన్నాయి నొక్కులు
- తాము అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదలమని హెచ్చరిక
- రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబుతో ములాఖత్

3లో



టాలీవుడ్ తెరపై మరో డ్రగ్ మరక

- 8 మందిని అరెస్ట్ చేసిన నార్కోటిక్స్ బ్యూరో
- వీరిలో 'డియర్ మేఘ' సినీ దర్శకుడు, నైజీరియన్లు
- రూ. 10 లక్షల డ్రగ్స్ స్వాధీనం
- పరారీలో హీరో నవదీప్, నిర్మాత రవి: సీపీ సీవీ ఆనంద్

- వివరాలు 12లో▶

కరువు నేలకు కృష్ణమ్మ

- రేపు 'పాలమూరు-రంగారెడ్డి' ప్రారంభోత్సవం
- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రాజెక్ట్ జాతికి అంకితం
- 'నార్లాపూర్'లో మొదటి మోటార్ స్విచాన్ చేసి ప్రారంభించనున్న కేసీఆర్
- 6 జిల్లాలు.. 19 నియోజక వర్గాలు సస్యశ్యామలం

- వివరాలు 5లో▶

నేడు టెట్..

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,139 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ పేపర్-1, పేపర్-2 నిర్వహించనున్నారు.

- వివరాలు 5లో▶





చంద్రబాబు పాత్ర సుస్పష్టం

'స్కిల్' ప్రాజెక్టులో సీమెన్స్ ప్రమేయమే లేదు

ఆ సంస్థ పేరుతో బురిడీ కొట్టించారు ● సీఎం హోదాలో బాబు డిజిటల్ సంతకాలే సాక్ష్యం

- అగ్రిమెంట్‌లో కనీసం తేదీ, లెటర్ నంబర్ కూడా లేదు
- థర్డ్ పార్టీకి ప్రభుత్వ సొమ్ము ఇవ్వొద్దన్న నిబంధనలు బేఖాతరు
- నాలుగు లేయర్లలో డబ్బుల పంపిణీ జరిగినట్టు ఆధారాలు
- ఏపీ సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్ వెల్లడి
- ఈ కుట్ర పుణేలో వెలుగులోకి : ఏపీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- రూ.కోటి విలువను రూ.250 కోట్లకు పెంచారు
- ఈ స్కామ్‌కు సంబంధించిన ఫైళ్లను సెక్రెటేరియట్‌లో తగులబెట్టారు

ఈ ప్రాజెక్టు గురించి తమకు ఏమీ తెలీదని సీమెన్స్ సంస్థ స్వయంగా చెబుతోంది. అంటే ఆ సంస్థను అడ్డం పెట్టుకుని నిధులు దోచేశారు. 'స్కిల్' స్కామ్‌లో చంద్రబాబు సంతకాలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మీడియాలో ప్రశ్నించినట్టు చూశాను. ఇదిగో బాబు సంతకాలు. ఈ స్కామ్‌లో చంద్రబాబునాయుడు పాత్రను స్పష్టం చేసేలా పలు ఫైళ్లపై 13 చోట్ల ఆయన డిజిటల్ సంతకాలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఈడీ దర్యాప్తు ముగియలేదు. ఇంకా కొనసాగుతోంది. సీఐడీ దర్యాప్తులోనూ ఇంకా చాలా విషయాలు వెలుగు చూడనున్నాయి.
- ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్

సాక్షి, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రజాధనాన్ని పప్పు బెల్లాలుగా పంచుకున్నారని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్, ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈ అడ్డగోలు అవినీతికి పూర్తి ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు సీఎం హోదాలో ఈ స్కామ్ తాలూకు ఫైళ్లపై 13 డిజిటల్ సంతకాలు చేశారని వెల్లడించారు. ఆ సంతకాల కాపీలను మీడియా ఎదుట ప్రదర్శించారు. అగ్రిమెంట్లలో కనీసం తేదీ వేయకపోవడం, లెటర్ నంబర్ ప్రాంతాల్లో ఖాళీలను వదిలిన విషయాన్ని బయటపెట్టారు. థర్డ్ పార్టీకి డబ్బులు ఇవ్వకూడదన్న నిబంధనలు పాటించలేదన్నారు. అన్ని వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో వివరించారు. ఈ కుంభకోణానికి తెరతీసేందుకు రూపొందించిన అగ్రిమెంట్‌లో లోపాలు మొదలు.. నిధుల మళ్లింపు, షెల్ కంపెనీల్లోకి వాటిని తరలించిన విధానం.. తద్వారా ఎలా లబ్ధిపొందారన్న పూర్తి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐడీ అదనపు డీజీ సంజయ్ మాట్లాడిన వివరాలు ఇలా ఉన్నాయి.

సీమెన్స్ కంపెనీకి ప్రాజెక్టు గురించే తెలీదు

- జీఓ నంబర్ 4 ఆధారంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డిజైన్‌టెక్ కంపెనీ, సీమెన్స్ ఇండియా సాఫ్ట్‌వేర్‌ల మధ్య త్రైపాక్షిక అగ్రిమెంట్ జరిగినట్టు చూపారు. వాస్తవంగా జీవోలో ఉన్న అంశాలు, అగ్రిమెంట్‌లోని అంశాలు వేరుగా ఉన్నాయి. అసలు ఈ ప్రాజెక్ట్ గురించి సీమెన్స్ కంపెనీకి తెలియదు. ఆ కంపెనీ పేరుతో కుట్రపూరితంగా ప్రాజెక్ట్‌ను రూపొందించారు.
- ఈ అగ్రిమెంట్ పరిశీలిస్తే..అందులో జీఓ నంబర్, లెటర్ నంబర్, తేదీలు సైతం సరిగా లేవు. కేవలం డ్రాఫ్ట్‌గా తయారు చేసి, భవిష్యత్తులో నంబర్ వేసుకోవడానికి అనుకూలంగా ఉంచినట్టు నిర్ధారణ అవుతోంది. ఒరిజినల్ పత్రాలు పరిశీలించాం. అవి నకిలీ అని నిర్ధారణ అయ్యింది. థర్డ్ పార్టీకి డబ్బులు ఇవ్వకూడదని అగ్రిమెంట్‌లో రాసుకున్నట్టు స్పష్టంగా ఉంది. అయినా థర్డ్ పార్టీకి రూ.330 కోట్లు వెళ్లినట్టు ఆధారాలు ఉన్నాయి.
- డిజైన్‌టెక్ నుంచి ఈ మొత్తాన్ని పీవీఎస్‌పీ అనే షెల్ కంపెనీకి మళ్లించారు. అక్కడి నుంచి వివిధ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబు రూ.241 కోట్లు దక్కించుకున్నారు. 2014లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాక ఆడిటర్‌గా జి వెంకటేశ్వర్లు అనే ప్రైవేటు వ్యక్తిని నియమించారు. గంటా సుబ్బారావును స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా, ఎక్స్ అఫీషియో సెక్రెటరీ టు సీఎంగా నియమించారు.
- ఇలా ఉన్నత విద్యా శాఖ పర్యవేక్షణ లేకుండా ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి సీఎం కార్యాలయం నుంచే నేరుగా పనిచేసేలా 'కావాల్సిన' విధంగా పని పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. డిప్యూటీ సీఈఓగా యూపీ కేడర్‌కు చెందిన అపర్ణ అనే ఐఏఎస్ అధికారిని నియమించారు. ఆమె భర్త సీమెన్స్ తరఫున అగ్రిమెంట్ల తయారీలో పని చేశారు.

తమ ప్రమేయమే లేదని 'సీమెన్స్' చెప్పింది

- గుజరాత్ తరహాలో యువతకు నైపుణ్యాభివృద్ధి అంటూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి తెరతీశారు. కనీసం పైలెట్ ప్రాజెక్టు అమలు చేసి ఫలితాలను చూసి నిర్ణయం తీసుకుందామన్న అధికారుల ప్రతిపాదనను పట్టించుకోలేదు. రూ.371 కోట్లు కొల్లగొట్టడానికే ఈ ప్రాజెక్ట్‌ను తెరపైకి తెచ్చారు.
- ఏపీఎస్ఎస్‌డీసీ చెబుతున్న రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌తో తమకు సంబంధం లేదని, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని సీమెన్స్ సంస్థ స్పష్టం చేసింది. తాము 90 శాతం నిధులను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని ఎవరికీ చెప్పలేదని.. అసలు ఆ వ్యవహారంతో సీమెన్స్ కంపెనీకి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా వివరించడంతోపాటు న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం కూడా ఇచ్చింది.
- జర్మనీలోని సీమెన్స్ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించగా అసలు ఆ జీవో గురించి, ఆ ఒప్పందం గురించి తమకు ఏమాత్రం తెలియదని వెల్లడించింది. భారత్‌లో సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న సుమన్ బోస్ మరికొందరు నిందితులతో కలసి జర్మనీలోని ప్రధాన కార్యాలయానికి తెలియకుండా ఈ కుట్రలో భాగస్వాములయ్యారని నిర్ధారణ అయ్యింది.
- గుజరాత్‌లో కంపెనీ కుదుర్చుకున్న ఒప్పందంలో సామ్యాద్రి బోస్‌గా సంతకాలు చేయగా, ఏపీలో ఉన్న ఒప్పందంలో మాత్రం సుమన్ బోస్ పేరిట సంతకాలు చేసినట్టు సదరు కంపెనీ వెల్లడించింది. సదరు కంపెనీ లీగల్ కౌన్సిల్ సైతం ఈ విషయాలను సీఐడీకి నిర్ధారించింది.

సాఫ్ట్‌వేర్ కోసం డిజైన్‌టెక్ నుంచి రూ.58.80 కోట్లు

- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలోని రూ.371 కోట్లలో రూ.58.80 కోట్లు జర్మనీలోని తమ సీమెన్స్ కంపెనీకి వచ్చాయని, అయితే ఆ సొమ్ము తమ కంపెనీకి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి కానీ, ఏపీ ఆర్థిక శాఖ నుంచి కానీ రాలేదని ఆ కంపెనీ స్పష్టం చేసింది. డిజైన్ టెక్ సంస్థ కోరితే తాము రూ.58.80 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే ఆ కంపెనీకి విక్రయించామని తెలిపింది.
- ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే రూ.58.80 కోట్లు ప్రభుత్వం నుంచి డిజైన్ టెక్ అనే సంస్థకు తొలుత చేరినట్టు రూఢీ అవుతోంది. వాస్తవానికి అగ్రిమెంట్ ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఈ నగదు బదిలీ జరిగినట్టు స్పష్టం అవుతోంది. సీఐటీడీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) ప్రభుత్వానికి ఏ ప్రతిపాదనలు ఇవ్వాలో కూడా సుమన్ బోస్ తయారు చేశారు. ఇంకా లోతుగా పరిశీలిస్తే.. సీఐటీడీ రిపోర్ట్ ఇవ్వక ముందే రూ.200 కోట్లకు పైగా నగదు మళ్లించారు. ఈడీ దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.

నోట్ ఫైళ్లు మాయం చేశారు

- ఈ కుంభకోణం బయట పడకూడదనే ఉద్దేశంతో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లను ఉద్దేశ పూర్వకంగా గల్లంతు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి జీవో 4, సీమెన్స్‌తో ఒప్పందం గురించి జీవో 5 జారీ చేశారు. కానీ ఆ రెండు జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను మాయం చేశారు. కానీ జీవో 8 ద్వారా అంతకు ముందు ఇచ్చిన జీవోలు 4, 5 లోని అంశాలను సీఐడీ గుర్తించి వెలికి తీయడంతో ఈ కుంభకోణం బయటపడింది.

వెలుగులోకి విస్తుపోయే నిజాలు

ఈ కుంభకోణం బయట పడకూడదని నోట్ ఫైల్స్‌ను సెక్రెటేరియట్‌లో తగలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను ఎంతో స్కిల్‌ఫుల్‌గా టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచేశారు. జర్మనీకి చెందిన సీమెన్స్ ఏజీ అనే కంపెనీ ఏపీలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.3300 కోట్ల ప్రాజెక్టులో గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా అంటే ఉచితంగా ఇస్తామంటూ ముందుకు వచ్చినట్టు ఒప్పందంలో పేర్కొన్నారు. కేవలం 10 శాతం ఏపీ ప్రభుత్వం కంట్రిబ్యూషన్ కింద ఇస్తే చాలన్నట్టుగా ఒప్పందాల్లో ఉంది. చివరకు ఈ పది శాతం సొమ్ము రూ.371 కోట్లను నాలుగు లేయర్లుగా సృష్టించి పప్పు బెల్లాలుగా ఏపీ ఖజానా నుంచి కొల్లగొట్టారు. ఇది నిబంధనలకు విరుద్ధం అని అధికారులు అభ్యంతరం పెట్టినా, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు స్పష్టమవుతోంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు సరిగా లేనందున ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా.. తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేయాలని అధికారులు సూచించినా పట్టించుకోలేదు. ఈ విషయాలన్నీ నోట్‌ఫైల్‌లో ఉన్నాయి. జీఎస్టీ మినహాయింపుల కోసం డిజైన్‌టెక్ చేసిన ప్రయత్నంతో ఈ మొత్తం వ్యవహారం బయటపడింది. పుణేలో జీఎస్టీ అధికారులు వెలుగులోకి తెచ్చారు. ఈ కుంభకోణంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం రూ.కోటి అయ్యే సాఫ్ట్‌వేర్‌ను రూ.250 కోట్లుగా చూపారు. ఇది ఎంతో అన్యాయం.
- పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఏఏజీ

'స్కిల్' స్కామ్‌లో 'దశా'ంశాల ఆధారంగా దర్యాప్తు

- నకిలీ, కల్పిత ట్రై ప్యాట్రియేట్ అగ్రిమెంట్
- ఎలాంటి నిబంధనలు పాటించకుండానే రూ.371 కోట్లు విడుదల
- నోట్‌ఫైల్‌లో రిమార్క్‌లు పూర్తిగా విస్మరించడమే కాక అధికారులపై తీవ్ర ఒత్తిడి
- ఈ కుంభకోణంలో తమ కంపెనీ పేరును వాడారని, అసలు ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ ఈ మెయిల్ ద్వారా స్పష్టం చేసింది
- గుజరాత్‌లో అమలు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, అమలు తీరుతెన్నులతో పోలిస్తే ఏపీలో జరిగింది వేరు. ఇక్కడ ప్రాజెక్టు అంతా అక్రమాలే.
- రూ.371 కోట్ల కుంభకోణంలో షెల్ కంపెనీల పాత్ర
- ఈ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల దర్యాప్తు, అరెస్టుల వివరాలు, ఈ కేసులో అటాచ్‌మెంట్లు
- ప్రాథమిక ఆధారాలు, కోర్టులో సమర్పించిన వివరాలు
- ఈ మొత్తం కుంభకోణానికి సంబంధించిన కీలక ఆధారాలు
- సీఐటీడీ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్) థర్డ్ పార్టీ అభిప్రాయం

యోగేష్ గుప్తాతో చంద్రబాబు పీఎస్‌కు సంబంధాలు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కొట్టేసిన సొమ్మును షెల్ కంపెనీల ద్వారా దారి మళ్లించి చివరకు నగదు రూపంలో మార్చడంలో షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించినట్టు అడిషనల్ డీజీ సంజయ్ తెలిపారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తాలకు ఆర్థిక అంశాల్లో సంబంధాలున్నట్టు గతంలో ఐటీ దాడుల్లో వెల్లడైందన్నారు. పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, యోగేశ్‌గుప్తాలు కలిసి ఈ మొత్తం వ్యవహారం నడిపారన్నారు. డబ్బులు ఎలా చేర్చారన్న పూర్తి వివరాలు మరింత స్పష్టంగా వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ సొమ్మును మళ్లించడం, తిరిగి షెల్ కంపెనీల ద్వారా వాటిని ఒకే వ్యక్తి పొందారనడానికి పూర్తి ఆధారాలున్నాయని చెప్పారు. ఇందులో హవాలా జరిగినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కమ్ ట్యాక్స్, జీఎస్టీ, సీఐడీ దర్యాప్తుతోపాటు సీమెన్స్ గ్లోబల్ కంపెనీ ఇచ్చిన వివరణలు సైతం వెల్లడించాయని తెలిపారు. ఈ కుంభకోణంలో ఈడీ దర్యాప్తు ఇంకా కొనసాగుతోందన్నారు. సీఐడి దర్యాప్తు కూడా కొనసాగుతోందని, అవసరం మేరకు ఇంకా అరెస్టులు ఉంటాయన్నారు. ఇందులో అనేక కోణాలు దాగి ఉన్నాయని, చార్జిషీట్‌కు ఇంకా సమయం పడుతుందని వివరించారు.

'నోట్' దిస్ పాయింట్

'స్కిల్' కుంభకోణం మాస్టర్ మైండ్ బాబే
- 13 చోట్ల ఏ–1 చంద్రబాబు సంతకాలు
- ఏ–2 అచ్చెన్న సంతకాలు ఐదు చోట్ల
- నోట్ ఫైళ్ల సాక్షిగా కుంభకోణం బట్టబయలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కోసం చంద్రబాబు చేత చంద్రబాబు కొరకు.. ఇదీ టీడీపీ ప్రభుత్వంలో రూ.371 కోట్లు కొల్లగొట్టిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం. తనకేం సంబంధం లేదని చంద్రబాబు ఎంతగా బుకాయించినా, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నోట్ ఫైళ్లు ఆయన బండారాన్నిబట్టబయలు చేస్తున్నాయి. కేవలం నిధులు కొల్లగొట్టేందుకే చంద్రబాబు ఆద్యంతం తానై వ్యవహరించారన్నది ఆధారాలతోసహా వెల్లడైంది. కేబినెట్ ఆమోదం లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం నుంచి జీవోకు విరుద్ధంగా ఒప్పందం.. ఒప్పందానికి విరుద్ధంగా నిధులు అక్రమంగా విడుదల చేసే వరకు ఆయనే సర్వం తానై వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని స్వయంగా ఆదేశించారు. కుంభకోణానికి మార్గం సుగమం చేస్తూ.. నిధులు కొల్లగొట్టేందుకు నోట్ ఫైళ్లలో 13 చోట్ల చంద్రబాబు సంతకాలు చేయగా, ఏ–2గా ఉన్న అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఐదు చోట్ల సంతకాలు చేశారు. ఈ కుంభకోణానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్‌మెంట్–ట్రైనింగ్, సాధారణ పరిపాలన శాఖకు చెందిన మొత్తం 13 నోట్ ఫైళ్లలో చంద్రబాబు చేసిన సంతకాలు ఆయన ప్రత్యక్ష ప్రమేయాన్ని వెల్లడిస్తున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ఏ1 చంద్రబాబు సంతకాలు

ప్రభుత్వ శాఖ	సంతకం చేసిన నోట్ ఫైల్ పేజీ	తద్వారా ఆదేశించిన విషయం
ఆర్థిక	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 42	రూ.370 కోట్లు విడుదల చేయాలి
	(దాంతో నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారు)	
ఆర్థిక	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 58	ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు గురించి
	(దాంతోనే కేబినెట్ ఆమోదం లేకుండా ఏపీఎస్ఎస్‌డీసీ ఏర్పాటు)	
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1, పేజ నంబర్లు 252, 253, 254	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్ ఏర్పాటుకు ఆదేశం
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 258	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్‌కు ఆమోదం
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 262	ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారుల నియామకం
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1 పేజ నంబర్ 119	చార్టెడ్ అకౌంటెంట్ జె.వెంకటేశ్వరరావు నియామకం
	(టీడీపీకి చెందిన ఈయన్ను సీఈవోకు సహాయకుడిగా నియమించారు)	
సాధారణ పరిపాలన	ఎనెగ్జర్-2, పేజ నంబర్ 21	ఏపీఎస్ఎస్‌డీసీ బడ్జెట్‌కు ఆమోదం
సాధారణ పరిపాలన	ఎనెగ్జర్-4, పేజ నంబర్ 15	గంటా సుబ్బారావును స్కిల్ డెవలప్‌మెంట్-ఇన్నోవేషన్ శాఖ
	కార్యదర్శి, సీఎం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా నియామకానికి ప్రతిపాదన	
సాధారణ పరిపాలన	ఎనెగ్జర్-8, పేజ నంబర్ 5	సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లస్టర్లు ఏర్పాటు,
	90 శాతం సీమెన్స్ వాటా, 10 శాతం ప్రభుత్వ వాటాపై చర్చ	
సాధారణ పరిపాలన	ఎనెగ్జర్ -1, పేజ 11	డిప్యూటీ సీఈవోగా అపర్ణ, ఉపాధ్యాయుల నియామకం
	(ఈమె సీమెన్స్ కంపెనీ ప్రతినిధిగా చెప్పుకున్న జీవీఎస్ భాస్కర్ భార్య)	
స్కిల్ డెవలప్‌మెంట్-ఇన్నోవేషన్	ఎనెగ్జర్-8, పేజ నంబర్ 40	సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లస్టర్ల కింద కాలేజీల ఎంపిక
స్కిల్ డెవలప్‌మెంట్-ఇన్నోవేషన్	ఎనెగ్జర్-8, పేజ నంబర్ 41	క్లస్టర్లుగా తిరుపతిలోని ఎస్వీయూ, మదనపల్లిలోని ఎంఐటీల ఎంపిక
సాధారణ పరిపాలన	ఎనెగ్జర్-1, పేజ్ నంబర్ 2	మీటింగ్ మినిట్స్‌కు ఆమోదం

ఏ-2 అచ్చెన్న సంతకాలు

ప్రభుత్వ శాఖ	సంతకం చేసిన నోట్ ఫైల్ పేజీ	తద్వారా ఆదేశించిన విషయం
ఆర్థిక శాఖ	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 42	రూ.370 కోట్ల మంజూరు కోసం
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 258	ఏపీఎస్ఎస్‌డీసీ బోర్డ్ ఏర్పాటు
ఉన్నత విద్య	ఎనెగ్జర్-1, పేజ నంబర్ 262	ఏపీఎస్ఎస్‌డీసీ సలహాదారుల నియామకం
స్కిల్ డెవలప్‌మెంట్-ట్రైనింగ్	ఎనెగ్జర్-8, పేజ నంబర్ 40	స్కిల్ డెవలప్‌మెంట్ క్లస్టర్ల ఎంపిక
స్కిల్ డెవలప్‌మెంట్-ట్రైనింగ్	ఎనెగ్జర్-8, పేజ నంబర్ 41	క్లస్టర్లుగా తిరుపతిలోని ఎస్వీయూ, మదనపల్లిలోని ఎంఐటీల ఎంపిక

చట్టప్రకారమే చంద్రబాబు అరెస్టు: కృష్ణయ్య



జడ్చర్ల: చట్ట ప్రకారమే మాజీ సీఎం చంద్రబాబునాయుడిని అరెస్టు చేశారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాతే చంద్రబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. తప్పు చేసిన ఎవరికైనా శిక్ష పడాల్సిందేనని కృష్ణయ్య చెప్పారు.



కన్నుమూస్తే.. ఆ కౌంట్‌లోకే..

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శవరాజకీయం

అస్వస్థతతో చనిపోతే పచ్చ పత్రికల అబద్ధాల ప్రచారం

సాక్షి, నంద్యాల/తాళ్లపూడి/కొవ్వూరు/వెంకటగిరి రూరల్ / పోరుమామిళ్ల: తెలుగుదేశం పార్టీ శవ రాజకీయాలను వీడడం లేదు. ఆ పార్టీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి, జైలుకు వెళ్లిన నేపథ్యంలో ప్రజల్లో సానుభూతి కోసం వెంపర్లాడుతున్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో రాష్ట్రంలోని చనిపోయిన వారిని చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకే చనిపోతున్నారంటూ టీడీపీ తమ ఖాతాలో వేసుకుంటోంది. ఈ మరణాలను పచ్చపత్రికల్లో ప్రచురిస్తూ బాబు అరెస్టును తట్టుకోలేక చనిపోయారంటూ కలరింగ్ ఇస్తున్నారు. ఇది చూసి మృతుల కుటుంబసభ్యులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ మరణాలకు, చంద్రబాబు అరెస్టుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.

టీడీపీ ఖాతాలో వేసుకున్న మరణాలు.. వాటి వెనుక నిజాలు..



- నంద్యాల జిల్లా పాణ్యం మండలం, గోరుమానుకొండ గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వర్లు కుటుంబ సమస్యలతో చాలాకాలం క్రితం మద్యానికి బానిసయ్యాడు. గత నెల రోజులుగా మరింత ఎక్కువగా మద్యం సేవిస్తున్నాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం ఎక్కువగా తాగి.. ఆ మత్తులో పురుగుల మందు తాగాడు. దీంతో అపస్మారకస్థితిలోకి వెళ్లి అదేరోజు మరణించాడు. ఈ మరణాన్ని టీడీపీ నాయకులు తమ ఖాతాలో వేసుకున్నారు.



- నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని లింగాల గ్రామానికి చెందిన నెత్తికప్పుల నాగరాజు కుటుంబమంతా గతకొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నారు. మంగళవారం నాగరాజు గుండెనొప్పితో మరణించారు. ఇతని కుటుంబ సభ్యులను బతిమిలాడి, పార్టీ నుంచి ఆర్థికసాయం అందుతుందని మభ్యపెట్టి చంద్రబాబు రిమాండ్‌ను తట్టుకోలేక గుండెపోటుతో మరణించినట్లు టీడీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు.

- తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన టీడీపీ నాయకుడు చెరుకూరి సూర్యనారాయణ (80) వృద్ధాప్య సంబంధిత బాధలతో మంగళవారం మృతి చెందారు. ఈ మరణాన్ని సానుభూతి ఖాతాలో టీడీపీ నేతలు వేసుకున్నారు.
- తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జొన్నకూటి శేఖర్ (45) కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి మూత్రవిసర్జనకు లేచి కుప్ప కూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భార్య సోదరుడు టీడీపీ సానుభూతిపరుడు. అతని మాట ప్రకారం టీడీపీ వాళ్లు సాయం చేస్తారనే ఉద్దేశంతో వారి ఖాతాలో వేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు.
- తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం రాణిపేటకు చెందిన వీర కృష్ణయ్య (63) చేనేత కార్మికుడు. మంగళవారం సాయంత్రం తమ మిద్దెపైకి ఎక్కిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కృష్ణయ్య మనుమడు మహేశ్ ఆయనను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించాడు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. కృష్ణయ్య మృతికి బాబు గృహ నిర్బంధం పిటిషన్ తిరస్కరణకు సంబంధం లేదని ఆయన మనుమడు మహేష్ స్పష్టం చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గండమాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటి షుగరు, బీపీతో బాధపడుతున్నాడు. మద్యం ఎక్కువగా సేవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు వెంకటి మృతికి ఎలాంటి సంబంధం లేదని గ్రామస్తులు తెలిపారు.

పేరు	ఊరు	మృతికి అసలు కారణం
వెంకటేష్	చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం కొడతనపల్లె	కొంత కాలంగా అనారోగ్యం
వెంకటరమణయ్య	శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తంగాళ్లపాళెం	నిర్లక్ష్యంతో బీపీ మాత్రలు వేసుకోక కళ్లు తిరిగి కిందపడి..
శంకరప్ప (50)	చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లి	అనారోగ్యం
నరిపూడి కోటేశ్వరరావు	పల్నాడు జిల్లా అమరావతి మండలం లింగాపురం	దీర్ఘకాలికంగా అనారోగ్యం
పెద్దచెన్నకేశవరావు (56)	గుంటూరు జిల్లా బేతపూడి శివారు రేగులగడ్డ	నాలుగేళ్లుగా అస్వస్థత
వేమూరి పార్థసారథి (74)	విజయవాడ ఆటోనగర్	చంద్రబాబు అరెస్ట్‌కు ముందు రోజు నుంచే గ్యాస్ సమస్య
కుంచం సుబ్బారావు	ఎన్టీఆర్ జిల్లా తిరువూరు	సుదీర్ఘ కాలంగా కిడ్నీ సమస్య
జి.అప్పారావు (73)	విజయనగరం జిల్లా తెర్లాం మండలం చీకటిపేట- మోదుగువలస	వృద్ధాప్య సమస్యలు
ఇజ్జురోతు పైడితల్లి (67)	విజయనగరం జిల్లా గజపతినగరం మండలం జిన్నాం	పదేళ్లుగా హృద్రోగ సమస్య
కుక్కల ప్రకాశరావు (60)	ఎన్టీఆర్‌జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం	ఏడాదిగా మలమూత్ర విసర్జనలో తీవ్ర ఇబ్బంది
రాజులపాటి పరశురామయ్య (83)	పమిడిముక్కల మండలం గురజాడ	కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితం
సపావత్తు వాల్యా నాయక్ (80)	కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెం	భోజనం చేస్తూ ఉన్నట్లుండి కిందపడి
ఆర్ఆర్ రహీం (80)	శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ	వృద్ధాప్య సమస్యలు
రామచంద్ర (70)	శ్రీ సత్యసాయి జిల్లా ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లి	రెండేళ్లుగా అనారోగ్యం
తలారి వండ్రప్ప (55)	అనంతపురం జిల్లా కణేకల్లు మండలం గోపులాపురం	అనారోగ్యం
బోయ శ్రీరాములు (64)	అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి	ఏడాదిగా ఆస్తమా
ఆంజనేయులు (60)	అనంతపురం జిల్లా గుత్తి మండలం ధర్మాపురం	కొద్ది రోజులుగా హై బీపీ
తోడికోడళ్లు విల్లూరి అప్పలనరసమ్మ (91), విల్లూరి మంగాయమ్మలు(86)	అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లి	ఏడాదిగా వృద్ధాప్య సమస్యలు
సుర్ల నారాయణమ్మ (58)	అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలోని జె.పి.అగ్రహారం	రెండేళ్లుగా కిడ్నీ వ్యాధి, ఉబ్బసం
సుందరరావు	నెల్లూరు జిల్లా ఉలవపాడు మండల పరిధిలోని టెంకాయచెట్లపాలెం	దంపతుల మధ్య గొడవలతో బలవన్మరణం
ఏసన్న	వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని కుమ్మరపల్లె	చాలా సేపటిగా కట్టెలు కొడుతూ గుండెపోటు
జొన్నకూటి రాజు (51)	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు	కాలేయ సంబంధిత వ్యాధి ముదిరి
వీరన్న(54)	కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం అల్వాల	కిడ్నీ సమస్య, యూరిన్ ఇన్‌ఫెక్షన్
సి. సుభాన్(32)	కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం ఎస్.ఎర్రగుడి	వారం రోజులుగా మలం, మూత్రం రాక..
సాదె లింగమయ్య(62)	నంద్యాల జిల్లా గోస్పాడు ఎస్సీ కాలనీ	రెండేళ్లుగా ఊపిరితిత్తుల సమస్య
చిన్నమాసుం(90)	నంద్యాల జిల్లా మిడుతూరు మండలం నాగలూటి	బీపీ, షుగర్, వారం రోజులుగా తీవ్ర ఆయాసం
తాడేపల్లి శేఖర్ (45)	పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి	కొద్ది రోజులుగా అనారోగ్యం
భీమడోలు వెంకయ్య (42)	జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట	కొంత కాలంగా తీవ్ర అనారోగ్యం
గుడివాడ పిచ్చి లింగం (76)	కొయ్యలగూడెం మండలం యర్రంపేట	వయోభారంతో కొంత కాలంగా అనారోగ్యం

వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్లకు చెందిన మహబూబ్‌చాంద్ (40) మంగళవారం సాయంత్రం 6 గంటలకు గుండెపోటుతో మృతి చెందింది. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక ఆమె మృతి చెందినట్లు ఈనాడులో గురువారం వార్త ఇచ్చారు. మృతురాలి కుటుంబం చాలా కాలంగా టీడీపీ సానుభూతిపరులు. అయితే మహబూబ్‌చాంద్ చాలా కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది. మంగళవారం ఆమె తోడికోడలుతో కలసి ఆస్పత్రికి వెళుతున్న సమయంలో కళ్లు తిరిగి పడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించగా.. షుగర్ బాగా తగ్గి గుండెపోటు వచ్చి మరణించిందని డాక్టర్లు తేల్చి చెప్పారు. నిజానికి చంద్రబాబు అరెస్టు అయిన మూడు రోజులకు ఆమె మృతి చెందింది. చంద్రబాబు అరెస్టుకు, ఆమె మరణానికి సంబంధం లేకపోయినా వారి ఖాతాలో వేసుకున్నారు. ఇలాగే రాష్ట్రంలో మరిన్ని మరణాలను టీడీపీ తన కౌంట్‌లో వేసుకుంది.

- కృష్ణాజిల్లాం బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చెందిన ఎదురువాడ కిరణ్, ఎదురువాడ బసవరావు టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ కావటంలో మనోవేదనతో మృతి చెందినట్లుగా ఈనాడు దినపత్రికలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవం. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కిరణ్ గత ఆరు నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఇక 85 ఏళ్ల వృద్ధుడు బసవరావు వయో భారంతో మృతి చెందారు. ఇద్దరూ కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు.
- నంద్యాలకు చెందిన మానసిక వికలాంగుడు షేక్ యూసుఫ్ ఉస్సేన్ పుట్టుక నుంచి ఎదుటి వ్యక్తులను గుర్తుపట్టలేడు. 65 ఏళ్ల యూసుఫ్ గత కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి చనిపోయాడు. చంద్రబాబు ఎవరో కూడా ఈయనకు తెలీదని స్థానికులు చెబుతున్నారు.
- నంద్యాల పట్టణం వెంకటాచలం కాలనీకి చెందిన అబ్దుల్ రహీమ్ అగరుబత్తీలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతను సోమవారం అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోలుకుంటున్న సమయంలో హార్ట్ ఎటాక్ రావడంతో మరణించాడు.
- మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల చిన్న మద్దిలేటి (62) ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఆయాసం, రక్తపోటు ఎక్కువ కావడంతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. ఆయాసం, హైబీపీతో చనిపోయిన వ్యక్తిని గుండెపోటుగా టీడీపీ నాయకులు చిత్రీకరించారు.

పొత్తులను అధినాయకత్వం నిర్ణయిస్తుంది: ఏపీ బీజేపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకోవాలనే దానిపై అధినాయక త్వం నిర్ణయిస్తుందని ఏపీ బీజేపీ మీడియా విభాగం గురువారం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్ణయం మేరకు పొత్తులు ఉంటా యన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ, జనసేన పొత్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.


ఢిల్లీకి ప్రత్యేక విమానంలో లోకేశ్

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ గురువారం ప్రత్యేక విమానంలో రాజమండ్రి నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. లోకేశ్ వెంట టీడీపీ ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడు కూడా వెళ్లారు. చంద్రబాబు అరెస్ట్‌పై జాతీయ మీడియాతో లోకేశ్ మాట్లాడనున్నారు. అలాగే చంద్రబాబుపై కేసు విషయమై సుప్రీం కోర్టు న్యాయవాదులతో ఆయన చర్చించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసేందుకు ప్రయత్నిస్తారని సమాచారం.

రాష్ట్రీయం

కలెక్టర్ మా ఆదేశాలే పాటించరా?

- చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హైకోర్టు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం సిద్దిపేట జిల్లా ముట్రాజ్‌పల్లిలో భూసేకరణపై గెజిట్ జారీ నిమిత్తం ప్రింటింగ్‌కు రాసిన లేఖను సమర్పించాలని తాము ఆదేశించినా చర్యలు చేపట్టలేదని కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ నాటికి లేఖను సమర్పించకుంటే కలెక్టర్ నేరుగా హాజరై వివరణ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాల్సి రావడమే కాకుండా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం 102 ఎకరాల సేకరణ నిమిత్తం 2021, జనవరి 31న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ బాలాజీ స్పిన్నర్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని సింగిల్ జడ్జి కొట్టివేయడంతో అప్పీల్ వేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషన్‌దారు తరపున న్యాయవాది గౌరారం రాజశేఖర్‌రెడ్డి, ప్రభు త్వం తరపున ఏజీపీ ఆకుల సునీత వాదనలు వినిపించారు. 2022, జనవరిలో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ముద్రణకు రాసిన లేఖను అందజేయాలని ఈ నెల 5న విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. ఈ రెండు పనులు ఎందుకు చేయలేదని ఏజీపీని ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా దీనికి సంబంధించి సంబంధిత కలెక్టర్‌ను అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది తల్లీబిడ్డల బంధం



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది తల్లీబిడ్డల బంధమని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నరనరానా కాంగ్రెస్ రక్తమే ప్రవహిస్తోందని, ఆయన రాజకీయ ప్రస్థానం ఆ పార్టీతోనే ప్రారంభమైందన్నారు. గురువారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో కేసీఆర్‌కు సంబంధం లేదంటే తెలంగాణ ప్రజలు నమ్మరని, ప్రత్యేక రాష్ట్రం ఇస్తే పార్టీని విలీనం చేస్తానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌లను మజ్లిస్ సమన్వయం చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో ఘట్‌బంధన్ ఏర్పాటు, యూపీలో అఖిలేశ్ యాదవ్‌కు ఆర్థికసాయంలో కేసీఆర్ పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్‌కు మరింత దగ్గరయ్యేందుకు బీఆర్‌ఎస్ యత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ఓడించేశక్తి బీజేపీకి మాత్రమే ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు కేసీఆర్ కుటుంబంలోని నలుగురి కోసమా.. నాలుగు కోట్లమంది కోసమా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. తమ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీలో తెలంగాణ అభ్యర్థులపై చర్చించి త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

18న బుడగ జంగం చైతన్య వేదిక రాష్ట్ర మహాసభ

సాక్షి, హైదరాబాద్: బేడ (బుడగ) జంగం చైతన్య వేదిక రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. మంత్రుల నివాసంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, రాజకీయ వేదిక రాష్ట్ర కన్వీనర్ చింతల యాదగిరి, మహాసభ సమన్వయకర్త కల్యాణం శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే ఈ రాష్ట్ర మహాసభలో మంత్రులు కేటీ రామారావు, హరీశ్‌రావు, వి.శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినపల్లి శ్రీనివాస్‌రావు, సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఆర్.వెంకటేష్ తదితరులు పాల్గొంటారు. చట్ట సభల్లో బేడ (బుడగ) జంగం కులస్తులకు అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర మహాసభ జరగనుందని రాష్ట్ర కన్వీనర్ చింతల యాదగిరి తెలిపారు.

అమెరికా అధికారిపై కఠినచర్యలు తీసుకోవాలి

జాహ్నవి మరణాన్ని అపహాస్యం చేసిన ఘటనను అంతా ఖండించాలి

- భారతీయుల్లో విశ్వాసం కలిగించేలా చర్యలకు సిఫార్సు చేయండి
- భారత్‌లోని అమెరికా రాయబారితో మాట్లాడి తగిన సూచనలివ్వండి
- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు సీఎం వైఎస్ జగన్ లేఖ



సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లాకు చెందిన కందుల జాహ్నవి మరణాన్ని అపహాస్యం చేసిన అమెరికా పోలీసుపై కఠినచర్యలు తీసుకునే విధంగా సిఫార్సు చేయాలని కోరుతూ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. అమెరికాలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ సియాటిల్ క్యాంపస్‌లో మాస్టర్స్ డిగ్రీ చదవడానికి వెళ్లిన జాహ్నవి.. ఈ ఏడాది జనవరి 23న రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీస్ వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే కన్నుమూసింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వం వెంటనే జాహ్నవి కుటుంబాన్ని, అమెరికాలోని తెలుగు అసోసియేషన్‌ను సంప్రదించి ఆమె మృతదేహాన్ని కర్నూలు జిల్లాలోని స్వగ్రామానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే జాహ్నవి మరణంపై దర్యాప్తు చేస్తున్న సియాటిల్ పోలీస్ అధికారి ఆమె మరణాన్ని అపహాస్యం చేస్తూ మాట్లాడిన వీడియో ఇటీవల బయటకు వచ్చింది. విద్యార్థి జీవితాన్ని తక్కువ చేసి మాట్లాడటంపై తీవ్రంగా కలత చెందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. అమెరికా పోలీసు అధికారిపై చర్యలకు సిఫార్సు చేయాల్సిందిగా కోరుతూ కేంద్రమంత్రికి లేఖ రాశారు. నాన్ అమెరికన్ల పట్ల అలాంటి అధికారుల అమానవీయ ప్రవర్తనను అందరూ ఖండించాల్సిందిగా ఆ లేఖలో పేర్కొన్నారు. భారతీయులలో విశ్వాసం, భరోసా కల్గించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. తప్పు చేసిన పోలీసు అధికారిపై కఠినచర్యలకు సిఫార్సు చేయడమే కాకుండా.. ఈ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలన్నారు. అమెరికాలోని సంబంధిత అధికారులతో తక్షణమే చర్చించి, సమగ్ర దర్యాప్తు ద్వారా వాస్తవాలు వెలికితీసి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఇందుకు భారత్‌లోని అమెరికా రాయబారితో చర్చించి తగిన సూచనలివ్వాల్సిందిగా సీఎం ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి చర్యలు తీసుకుంటారన్న ఆశాభావాన్ని లేఖలో సీఎం వ్యక్తం చేశారు.

21 నుంచి శాసనసభ, మండలి సమావేశాలు

- గవర్నర్ గెజిట్ నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: ఈ నెల 21వ తేదీ నుంచి శాసనసభ, శాసనమండలి సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. 21వ తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేరోజు శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై.. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏయే అంశాలపై చర్చించాలనే విషయాన్ని ఖరారు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను శాసనసభలో బిల్లుల రూపంలో ప్రవేశపెట్టి చట్టసవరణలు చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఈ సమావేశాల్లోనే వ్యవసాయ పరిస్థితులు తదితర అంశాలను చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మదింపు బూటకం.. నివేదిక నాటకం

- 'స్కిల్' ప్రాజెక్ట్‌ను తాము పరిశీలించనే లేదన్న 'సీఐటీడీ'
- రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ అని మేం నిర్ధారించలేదు
- రూ.371 కోట్ల విడుదలకు అనుమతించ లేదు
- సీఐడీ దర్యాప్తులో వెల్లడించిన సీఐటీడీ
- కేవలం పత్రాలు సమర్పించి పరిశీలించమన్నారు
- కానీ అప్పటికే నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన సెక్షన్లు సరైనవేనని నిర్ధారిస్తూ పది గంటలపాటు విచారించిన అనంతరం న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. ఎల్లో మీడియా మాత్రం దీనికి విరుద్ధంగా సొంత తీర్పులు ఇచ్చేస్తూ పతాక శీర్షికల్లో కథనాలను ప్రచురించడం విస్మయపరుస్తోంది. టీడీపీ హయాంలో తెరపైకి తెచ్చిన ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్ సరైందేనంటూ 'సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ) థర్డ్ పార్టీగా మదింపు జరిపి నివేదిక సమర్పించిందంటూ వక్రీకరించి ప్రజల్ని నమ్మించేందుకు రామోజీ నానా పాట్లు పడ్డారు. అయితే తాము ఇచ్చింది మూడో పార్టీ నివేదికే కాదని... అది కేవలం ఏపీఎస్‌ఎస్‌డీసీ ఇచ్చిన పత్రాల పరిశీలన మాత్రమేనని 'సీఐటీడీ' స్పష్టం చేయడం గమనార్హం. మదింపు నివేదిక ఇవ్వాలంటే ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. కానీ తాము అసలు ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌ను పరిశీలించనే లేదని సీఐటీడీ తేల్చి చెప్పింది. పోనీ ఈనాడు చెబుతున్నట్టుగా సీఐటీడీ మదింపు నివేదిక ఇచ్చిందని భావించినా సరే.. అంతకంటే కంటే ముందుగానే నిబంధనలకు విరుద్ధంగా డిజైన్ టెక్ కంపెనీకి చంద్రబాబు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఈ ప్రాజెక్ట్‌లో అవినీతిని రుజువు చేస్తోంది.

అది కేవలం పత్రాల పరిశీలనే: ఏపీఎస్‌ఎస్‌డీసీ ప్రాజెక్ట్‌పై తాము ఎలాంటి మదింపు నివేదిక ఇవ్వలేదని సీఐటీడీ స్పష్టం చేసింది. మదింపు నివేదిక ఇవ్వాలంటే తమ బృందం స్కిల్ డెవలప్‌మెంట్ క్లస్టర్లను స్వయంగా పరిశీలించి అక్కడి సాఫ్ట్‌వేర్, మౌలిక వసతులను పరిశీలించి ప్రాజెక్ట్ వ్యయాన్ని అంచనా వేయాల్సి ఉంటుందని, కానీ తమను ఆ విధంగా మదింపు నివేదిక ఇవ్వాలని అసలు ఏపీఎస్‌ఎస్‌డీసీ కోరనే లేదని సీఐటీడీ తెలిపింది. ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు, డిజైన్ టెక్ ప్రతినిధులు తమ వద్దకు వచ్చి ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పత్రాలను మాత్రమే అందించి పరిశీలించాలని కోరినట్లు పేర్కొంది. అంటే ఏపీఎస్‌ఎస్‌డీసీ జీవోలో పేర్కొన్నట్టుగా సీమెన్స్–డిజైన్ టెక్ కంపెనీలు రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్‌లో 90 శాతం నిధులను వెచ్చించాయో లేదో కూడా సీఐటీడీకి తెలియదు. ప్రభుత్వ వాటా రూ.370 కోట్లు విడుదల చేయవచ్చో లేదో కూడా ఆ సంస్థకు అవగాహనే లేదు. కేవలం ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు ఇచ్చిన పత్రాల్లో ఉన్నవాటిని చూసి తాము నివేదిక ఇచ్చామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్ట్ రూ.3,330 కోట్లు విలువ చేస్తుందని తాము నిర్ధారించినట్టు కాదని, రూ.371 కోట్లు ప్రభుత్వ వాటా విడుదల చేసేందుకు సమ్మతించినట్లూ కాదని స్పష్టం చేసింది. ప్రాజెక్ట్‌ను భౌతికంగా పరిశీలించకుండా మదింపు నివేదిక ఇవ్వడం సాధ్యం కాదని కూడా తేల్చి చెప్పింది. ఈమేరకు సీఐటీడీ ఉన్నతాధికారులు సీఐడీ విచారణలో స్పష్టమైన వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ముందే నిధుల విడుదల: పత్రాల పరిశీలనే మూడో పార్టీ నివేదిక అని బుకాయించేందుకు టీడీపీ, ఎల్లో మీడియా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. పత్రాలన్నీ పరిశీలించి సీఐటీడీ నివేదిక ఇచ్చిన తరువాతే నిధులు విడుదల చేయాలి. టీడీపీ సర్కారు దీన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఏపీఎస్‌ఎస్‌డీసీ అధికారులు, డిజైన్ టెక్ ప్రతినిధులు కొన్ని పత్రాలు సమర్పించి నివేదిక ఇవ్వాలని సీఐటీడీని 2015 డిసెంబర్ 5న కోరారు. ఆ సంస్థ తన నివేదికను 2016 మార్చి 31న ఇచ్చింది. కానీ ఆ నివేదికతో నిమిత్తం లేకుండానే, అంతకంటే ముందే డిజైన్ టెక్‌కు టీడీపీ సర్కారు నిధులు విడుదల చేసేసింది. 2015 డిసెంబర్ 5న రూ.185 కోట్లు, 2016 జనవరి 29న రూ.85 కోట్లు, మార్చి 11న రూ.67 కోట్లు విడుదల చేశారు. మూడు విడతల్లో రూ.337 కోట్లు డిజైన్ టెక్ కంపెనీకి ఇచ్చేశారు. చివరగా 2016 మార్చి 31న మిగిలిన రూ.34 కోట్లు కూడా విడుదల చేశారు. అంటే సీఐటీడీ తన మదింపు నివేదికలో ఏం చెప్పిందో పరిశీలించకుండానే, సమీక్షించకుండానే నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో చంద్రబాబు అవినీతికి అదే నిదర్శనం.

ముసుగు తీసిన చంద్రసేనాని

ఇన్నేళ్లూ చంద్రబాబు చాటున ఒదిగిన పవన్ కల్యాణ్

- చంద్రబాబు అరెస్టుతో పాత బంధానికి కొత్త రంగు
- 2024 ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తంటూ కొత్తపాట
- 2014 నుంచి గెస్ట్ రాజకీయ నేతగా చంద్రబాబు చెంతనే..
- ఏనాడూ చంద్రబాబు తప్పులను ప్రశ్నించని పవన్
- 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చేందుకు బయటకొచ్చి నాటకం
- వైఎస్సార్‌సీపీ చేతిలో చావుదెబ్బ తినడంతో మళ్లీ లోపాయికారీ బంధం
- ఇప్పుడు ఒంటరిగా పోటీ చేస్తే వైఎస్సార్‌సీపీని ఆపలేమని బెంబేలు
- బీజేపీ కూడా తమ వెంట వస్తుందని ఆశిస్తున్నామంటూ సన్నాయి నొక్కులు
- తాము అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదలమని హెచ్చరిక
- రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబుతో 40 నిమిషాలపాటు ములాఖత్



రాజమండ్రి సెంట్రల్ జైల్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న పవన్, పక్కన లోకేశ్, బాలకృష్ణ

సాక్షి, రాజమహేంద్రవరం: తెలుగుదేశం–జనసేన మధ్య బంధానికి ఉన్న ముసుగు తొలగిపోయింది. కొత్తగా పొత్తు పాడుస్తున్నట్లు పవన్‌కల్యాణ్ పాతపాటనే కొత్తగా పాడారు. చంద్రబాబు చాటుగా ఇన్నేళ్లు ఒదిగి ఉన్న జనసేన అధ్యక్షుడు తాజాగా పొత్తు ప్రకటనతో పాత పాటకు కొత్త పల్లవి అందుకున్నారు. పాత బంధాన్నే కొత్త పొత్తుల రాగంగా ఆలపించేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పొత్తుల ప్రకటన వరకు చంద్రబాబు చెంతనే పవన్ అతిథి రాజకీయ నాయకుడి పాత్ర పోషించారన్నది జగమెరిగిన సత్యం. 2014 ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేయకుండా టీడీపీ, బీజేపీ కుటమికి మద్దతిచ్చి.. చంద్రబాబు రాసిన స్క్రీన్ ప్లేను పక్కాగా రక్తి కట్టించారు. ప్రశ్నించేందుకే జనసేన అంటూ డబ్బాలు కొట్టుకుని.. చంద్రబాబు ప్రభుత్వంలో మహిళా అధికారులపై దాడులు, ప్రకృతి వనరుల దోపిడీ, ఇచ్చిన వందల హామీలను నెరవేర్చకపోయినా ఎన్నడూ ప్రశ్నించిన పాపాన పోలేదు. పైగా నాలుగేళ్లు పత్తా లేకుండా.. 2019 ఎన్నికలు సమీపిస్తుండగా చంద్రబాబుకు మేలు చేసేందుకు మళ్లీ తెరపైకి వచ్చారు. అప్పటి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చే కుయుక్తిలో భాగంగానే కూటమి నుంచి బయటకు వచ్చినట్టు నాటకమాడారు. చివరికి ప్రజా క్షేత్రంలో చావు దెబ్బతినడంతో మళ్లీ టీడీపీతో అంటకాగుతున్న విషయం తెలిసిందే. తెలుగుదేశంతో బంధాన్ని కొనసాగిస్తూనే తన పార్టీ కార్యకర్తలను, ప్రజలను మోసగించారు. గతంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ భారీ అవినీతికి పాల్పడ్డారని విమర్శించిన నోటితోనే ఇప్పుడు వారితోనే కలిసి రాజకీయ పయనం చేస్తానంటూ ప్రకటించడం పవన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని చాటి చెబుతోంది.

సమష్టిపోరు అవసరమట!

స్కిల్ స్కామ్‌లో అరెస్టై, జైలు జీవితం గడుపుతున్న చంద్రబాబును పరామర్శించిన కొద్ది క్షణాల్లోనే టీడీపీ, జనసేన పొత్తు ఉందంటూ పవన్ చెప్పడం చూస్తుంటే.. జైలు నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్టు అవగతమవుతోంది. ఈ క్రమంలోనే రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పని చేస్తాయని.. బీజేపీ కూడా మా వెంట వస్తుందని ఆశిస్తున్నామన్నారు. తమ కలయిక రాష్ట్ర భవిష్యత్తు కోసమంటూ కలరింగ్ ఇచ్చారు. చంద్రబాబుతో విభేదించి గతంలో ప్రత్యేకంగా పోటీ చేశానని, వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవాలంటే సమష్టిపోరు అవసరమంటూ తమ బంధాన్ని బయటపెట్టారు. చంద్రబాబుతో పవన్, లోకేశ్, సినీ నటుడు బాలకృష్ణ గురువారం ఉదయం ములాఖత్ అయ్యారు. ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్ అక్కడి నుంచి నేరుగా సెంట్రల్ జైల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పవన్, లోకేశ్, బాలకృష్ణ 40 నిమిషాల పాటు బాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా అరాచక పాలన సాగుతోందని, అందులో భాగంగానే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్‌కు పంపారని విమర్శించారు.

మోదీ పిలిస్తేనే వెళ్లాను..

'జనసేన ఆవిర్భావ సభలో సగటు మనిషి ఆవేదన గురించి మాట్లాడాను. మా నాన్న అస్థికలు కాశీలో కలిపేందుకు వెళ్లిన సమయంలో ముంబైలో తాజ్‌హోటల్‌పై ఉగ్రవాదుల దాడి జరిగింది. అంతకు ముందు పార్లమెంట్‌పై దాడి జరిగింది. ఈ ఘటనలను చూసి దేశానికి సమర్థుడైన నాయకుడు కావాలని మోదీకి మద్దతు తెలిపిన విషయంలో నన్ను అందరూ తిట్టారు. ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కు తగ్గనని వెల్లడించా. ఏ రోజైనా నరేంద్ర మోదీ నన్ను పిలిస్తే వెళ్లానే తప్ప.. నేనంతకు నేనే ఎప్పుడూ వెళ్లలేదు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు అనుభవం ఉన్న నాయకుడు కావాలని 2014లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేశాయి. బాబుకు నాకు మధ్య పాలన, విధానపరమైన అభిప్రాయ భేదాలు ఉన్నాయి. కానీ, ఆయన అనుభవం, సమర్థతపై పూర్తి విశ్వాసం ఉంది' అని పవన్ స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మించిన వ్యక్తికి రూ.300 కోట్ల స్కామ్‌ను అంటగడతారా? అని ప్రశ్నించారు. 'బాబును ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారించాల్సింది.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విచారిస్తోంది? అభియోగాలు అంటగట్టిన వ్యక్తి ఏమైనా మహానుభావుడా? వాజ్‌పేయా? లాల్ బహదూర్ శాస్త్రినా? కేసులు, రాజ్యాంగ ఉల్లంఘన, విదేశాలకు వెళ్లాలంటే కోర్టు పర్మిషన్ తీసుకునే వ్యక్తి మద్యపాన నిషేధం చేస్తాడా?' అని దుయ్యబట్టారు.

అడ్డగోలు హామీలిచ్చి నేటికీ అమలు చేయలేదు

రాష్ట్రంలో అడ్డగోలు హామీలిచ్చి నేటికీ అమలు చేయలేదని పవన్ మండిపడ్డారు. గుజరాత్‌లోని ముంద్రా పోర్టు వద్ద మూడు వేల కిలోల హెరాయిన్ దొరికితే దాని మూలాలు విజయవాడలో తేలాయని.. వీటిపై మీడియాలో వార్తలే రాకుండా చేశారని చెప్పారు. 'అడ్డగోలు దోపిడీ చేస్తే ఎవరూ ప్రశ్నించకూడదా? నన్ను ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఆపేస్తానంటావు, ఆ హక్కు నీకు ఉందా?' అని ప్రశ్నించారు. ఆర్థిక నేరస్తుడైన సీఎం వైఎస్ జగన్.. తాను కోనసీమ పర్యటనకు వెళ్తే 2 వేల మంది క్రిమినల్స్‌ను దాడికి దించారన్నారు. బాబు అరెస్టును సంపూర్ణంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో పట్టు విడుపులు ఉండాలని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇలా ఎన్నడూ వ్యవహరించలేదన్నారు. చంద్రబాబు అరెస్టయితే వైఎస్సార్‌సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారని చెప్పారు.

మేం అధికారంలోకి వస్తే ఎవ్వరినీ వదలం

'వైఎస్సార్‌సీపీ నేతలు మాపై రాళ్లు వేసే ముందు ఆలోచించుకోవాలి. మేం అధికారంలోకి వస్తే మాపై రాళ్లు వెసిన వారెవరినీ వదలం. పోలీసు వ్యవస్థ ఇంత బానిసత్వంగా ఉంటే ఎవరూ ఏం చేయలేరు. డీజీపీ, సీఎస్‌తో సహా ఎవరిపైనైనా పాత కేసులు తిరగతోడే అవకాశం ఉంది. చట్టాలను అధిగమించే అధికారులు ఒక్కసారి ఆలోచించుకోవాలి. సొంత చెల్లిని, తల్లిని వదిలేసిన వ్యక్తి, బాబాయిని చంపించిన వ్యక్తిని అధికారులు నమ్ముకుంటున్నారు. మీకు రేపు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో ఆలోచించుకోండి. జగన్‌ను నమ్ముకుంటే కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే' అని పవన్ అధికారులు, పోలీసులను హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పులు సరిదిద్దుకునేందుకు ఆరు నెలల సమయం మాత్రమే ఉందన్నారు. యుద్ధం కావాలంటే సిద్ధంగా ఉంటామని ఆవేశంతో ఊగిపోయారు.


విడివిడిగా ఎదుర్కోవడం కష్టం

సార్వత్రిక ఎన్నికల్లో విడివిడిగా పోటీచేస్తే వైఎస్సార్‌సీపీని ఎదుర్కోవడం కష్టమని.. జనసేన, టీడీపీ కలిసి సమష్టిగా పోటీ చేస్తామని పవన్ ప్రకటించారు. 2019లో వేర్వేరుగా పోటీ చేసి నష్టపోయామని, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూస్తామన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సీట్ల విషయం తర్వాత మాట్లాడతానని చెప్పారు. జనసేన ఒంటరిగా పోటీ చేయాలని చెప్పేందుకు మీరెవరని ప్రశ్నించారు. జైల్లో చంద్రబాబు భద్రత విషయమై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

విడిపోతేనే కదా మళ్లీ కలవడానికి?

టీడీపీ, జనసేన పొత్తుపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా

- పవన్ మనసులో ఎప్పటికీ చంద్రబాబే ఉంటారు
- సినిమాల్లో డైలాగ్‌లు బయట కూడా వేస్తే జనం నవ్వుతారు
- టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు కట్టకట్టుకుని వచ్చినా 2024లో విజయం వైఎస్సార్‌సీపీదే
- సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి, సుపరిపాలనకు 75% ప్రజల మద్దతు ఉంది
- అధికారంలో ఉన్న పార్టీకి ఈ స్థాయి సానుకూల వాతావరణం ఎన్నడూ లేదు
- దొంగను కాదని చంద్రబాబు కోర్టులో నిరూపించుకోవాలి



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రకటించడంలో ఆశ్చర్యమేముందని, చంద్రబాబు, పవన్ విడిపోతే కదా మళ్లీ కలవడానికి అంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. పవన్ మనసులో ఎప్పుడూ చంద్రబాబే ఉంటారని, వారిద్దరూ ఎప్పుడూ కలిసే ఉన్నారని తాము ఆది నుంచీ చెబుతున్నామన్నారు. ఆయన గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ జనసేనను స్థాపించారు. బాబు సూచన మేరకు 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ–బీజేపీ కూటమికి మద్దతిచ్చారు. 2019లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా బాబును మళ్లీ సీఎంగా చేయడానికి టీడీపీ–బీజేపీ నుంచి వేరుపడ్డారు. బాబు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో ఐటీ శాఖ జరిపిన సోదాల్లో రూ. 2 వేల కోట్ల ముడుపుల బాగోతం బయటపడటంతో.. దాన్నుంచి తప్పించుకోవడానికి మళ్లీ బీజేపీతో పవన్ జట్టుకట్టేలా చంద్రబాబు చక్రం తిప్పారు. ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చేసి, చంద్రబాబును సీఎం చేయాలన్నది పవన్ ఆకాంక్ష' అంటూ దెప్పిపొడిచారు. వైఎస్సార్‌సీపీ నేతలు యుద్ధం కావాలని కోరుకుంటే యుద్ధమే చేస్తామని పవన్ వ్యాఖ్యానించడంపై స్పందిస్తూ.. పవన్ రాజకీయ నాయకుడే కాదని, ఆయన మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. సినిమాల్లో డైలాగులు బయట కూడా వేస్తే జనం నవ్వుతారని చెప్పారు.

సానుకూల ఓటుతోనే ఘనవిజయం సాధిస్తాం

సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు 75 శాతం ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీకి ఇంత భారీ స్థాయిలో సానుకూల వాతావరణం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు కట్టకట్టుకుని వచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించి.. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, సేవ చేయడం ద్వారా ప్రజల ఆశీస్సులు పొంది విజయం సాధించాలన్నదే వైఎస్సార్‌సీపీ విధానమని వివరించారు.

అడ్డంగా దొరికినా బాబు సుద్దపూసంటే ఎలా?

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల ప్రజల సొమ్ము దోచేశారనడానికి బలమైన సాక్ష్యాధారాలు ఉండటం వల్లే చంద్రబాబును ఏసీబీ కోర్టు జైలుకు పంపిందని సజ్జల చెప్పారు. దొంగను కాదని చంద్రబాబు కోర్టులో నిరూపించుకోవాలని సూచించారు. స్కిల్ స్కాంలో సీఐడీ, ఈడీ అరెస్టు చేసి, బెయిల్‌పై ఉన్న డిజైన్ టెక్ ఎండీతో కుంభకోణమే జరగలేదని ఎల్లో మీడియా చెప్పించిందని, ఒక దొంగ మాటలను ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంతో సంబంధమే లేదని, డిజైన్ టెక్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఒప్పందమే కుదుర్చుకోలేదని, డిజైన్ టెక్‌కు ప్రభుత్వం చెల్లించిన రూ.371 కోట్లు తమకు చేరలేదని, ఈ కుంభకోణంలో విచారణకు సహకరిస్తామని సీమెన్స్ సంస్థ ప్రకటించిందని తెలిపారు. ఆ డబ్బంతా చంద్రబాబు జేబుల్లోకి పోయిందన్నారు. షెల్ కంపెనీల ద్వారా రూ.240 కోట్లు, మరో రూ.వంద కోట్లను సింగపూర్‌కు పంపి.. హవాలా మార్గంలో దోచేసినట్లు జీఎస్టీ ఇంటెలిజెన్స్, ఈడీలు తేల్చాయని చెప్పారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన నలుగురిని ఈడీ అరెస్టు చేసి రూ.32 కోట్ల ఆస్తులు జప్తు చేసిందన్నారు. అయినా చంద్రబాబు సుద్దపూస అని టీడీపీ నేతలు, ఎల్లో మీడియా చెబితే జనం నమ్ముతారనుకుంటే అది వారి అపోహేనని అన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయటంలో సిద్ధహస్తుడినన్న నమ్మకంతోనే 2014–19 మధ్య చంద్రబాబు అడ్డగోలుగా కుంభకోణాలు చేసి, ప్రభుత్వ ఖజానాను దోచేశారన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు







నీ ధనాన్ని వృథా ఖర్చులలో వ్యర్థం చేయకు.
నిశ్చయంగా, వ్యర్థమైన ఖర్చులు చేసేవారు షైతానుల సోదరులు.
షైతాన్ తన ప్రభువు పట్ల కృతఘ్నుడైనవాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 15 సెప్టెంబర్ 2023

అప్రమత్తత అవసరం

మరపునపడిందనుకున్న ఆ పేరు మళ్ళీ వార్తల్లోకి వచ్చింది. మనిషి మెదడును దెబ్బ తీసే ప్రాణాంతక నిపా వైరస్ (ఎన్ఐవీ) మరోసారి దేశంలో జడలు విప్పుతోంది. వస్తూనే కేరళలో ఇద్దరి ప్రాణాలు బలి తీసుకొని, పాజిటివ్ వచ్చిన మరికొందరి ఆరోగ్యాన్ని అయోమయంలోకి నెట్టి, సన్నిహితంగా మెలిగిన మరో 800 మందిపై వైద్యపర్యవేక్షణ పెట్టాల్సిన పరిస్థితి తెచ్చింది. వీరిలో 77 మంది ప్రమాదస్థితిలో ఉన్నారనీ, వైరస్ సోకినవారిలో 155 మంది ఆరోగ్య కార్యకర్తలూ ఉన్నారనీ వస్తున్న వార్త ఆందోళన పెంచుతోంది. నిపా సోకితే సహాయక చికిత్సే తప్ప, రోగాన్ని తగ్గించే మందులు కానీ, నివారించే టీకా కానీ ఇప్పటిదాకా లేకపోవడమే పెద్ద సమస్య. కోళిక్కోడ్ జిల్లాలోని 9 గ్రామ పంచాయతీలను ఇప్పటికే కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించి, స్కూళ్ళు – ఆఫీసులు – ప్రజారవాణాకు సెలవిచ్చి, సభలూ సమావేశాలపై నియంత్రణలు పెట్టాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేరళలో మొదలైన ఈ ప్రకంపనలు ఇప్పుడు దేశం మొత్తాన్నీ అప్రమత్తం చేస్తున్నాయి.

కలుషిత ఆహారం, రోగితో సాన్నిహిత్యం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించడం నిపా వైరస్ స్వభావం. 1998లో తొలిసారిగా మలేసియా, సింగపూర్లలో పందుల పెంపకందార్లలో, వాటితో సన్నిహితంగా మెలిగే ఇతరుల్లో ఈ వైరస్ తొలిసారి బయటపడింది. అప్పట్లో 300 పైచిలుకు మందికి వైరస్ సోకితే, వంద మందికి పైగా మరణించారు. ఆపై అది వేలాది మైళ్ళు ప్రయాణించి, వివిధ దేశాలకు విస్తరించడం, వైరస్ సోకినవారిలో 72 నుంచి 86 శాతం మంది మరణించడం సంచలనమైంది. వైరస్ సోకిన గబ్బిలాలు, పందుల శరీరద్రవాల ద్వారా మనుషులకిది వ్యాపిస్తుందట. నిపా సోకితే జ్వరం, శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, వాంతులతో మొదలై పరిస్థితి తీవ్రమైతే మెదడువాపు, మూర్ఛలతో రోగి కోమాలోకి వెళ్ళే ప్రమాదం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాట. 1998 – 2015 మధ్య 600కు పైగా కేసులు వచ్చాయని అది లెక్క తేల్చింది.

ఈ మాయదారి వైరస్ మన దేశంలో పంజా విసరడం ఇదేమీ తొలిసారి కాదు. గడచిన అయిదేళ్ళలో ఇది నాలుగోసారి. మెదడు మీద దాడి చేసే ఈ అనారోగ్య భూతం 2018 మేలో మొదటిసారి వచ్చినప్పుడు దానిని కట్టడి చేసేలోగా వైరస్ సోకిన 23 మందిలో 21 మంది మరణించారు. ఆ తరువాత 2019, 2021ల్లో కూడా కేరళ తీరాన్ని ఈ వైరస్ తాకింది. మలబారు సీమలో బయటపడ్డ ఈ తాజా నిపా కేసులకు బంగ్లాదేశ్ వేరియంట్ కారణమని గుర్తించారు. మిగతావాటితో పోలిస్తే ఈ వేరియంట్ వ్యాప్తి తక్కువే అయినా, సోకినవారిలో సగటున నూటికి 70 మంది మరణిస్తున్నారన్న గణాంకాలు గుబులు రేపుతున్నాయి. రోగులకు సన్నిహితంగా మెలిగినవారు ఐసొలేషన్‌లోకి వెళ్ళడం, జనమంతా మాస్కులు ధరించి జాగ్రత్తగా ఉండడం తప్పనిసరి కార్యాచరణ అయింది.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో ఈ గబ్బిలపు వైరస్ పదేపదే విరుచుకుపడే ప్రమాదం ఎక్కువని మేలో రాయిటర్స్ పరిశోధన తేల్చింది. విచ్చలవిడిగా అడవుల నరికివేత, ఇష్టారాజ్యపు పట్టణీకరణ, ఫలితంగా వన్యప్రాణులతో మానవ సంఘర్షణ – వీటన్నిటి పర్యవసానం ఇదని ఆ పరిశోధన గుర్తించింది. ఇక, మన దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక సహా 8 రాష్ట్రాల్లోని గబ్బిలాల్లో ఈ ప్రాణాంతక వైరస్ ఛాయలున్నట్టు ఈ ఏడాది జూలైలో భారతీయ వైద్య పరిశోధనా మండలి అధ్యయనం సైతం నిర్ధరించింది. అయితే, కేరళపైనే తరచూ ఈ వైరస్ దాడికి కారణం – జనసాంద్రత, భౌగోళిక పరిస్థితులు, వానలంటూ రకరకాల ప్రచారాలున్నాయి. కచ్చితమైన కారణాల్నింకా కనిపెట్టాల్సి ఉంది. ప్రస్తుతానికి కేంద్ర బృందం కేరళ వెళ్ళి సంక్షోభంలో సాయపడుతోంది.

నిపాకు ప్రధాన కారణమని భావిస్తున్న ఫ్రూట్ బ్యాట్స్ (పండ్లను కొట్టే గబ్బిలాల) సంఖ్య కేరళలో ఎక్కువైతే కావచ్చు కానీ, వాటి నిర్మూలన కుదరదు. కాబట్టి, ఒకేచోట, ఒకేలా కాకపోయినా ఏటా నిపా వైరస్ ముప్పు తప్పదని గ్రహించి, కేరళ సహా అన్ని రాష్ట్రాలూ జాగ్రత్తపడాలి. జంతువుల నుంచి మానవులకు సోకే ఇలాంటి ప్రాణాంతక ఇన్ఫెక్షన్ల ఆనుపానులు పసిగట్టేందుకు మహమ్మారులపై పరిశోధన అవసరం. కానీ, కేరళే కాదు... కేంద్రం కూడా నిపాపై తగినంత శ్రద్ధ చూపలేదనే చెప్పాలి. పుణేలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ తరహాలో తిరువనంతపురంలో అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పినా, అది ఇప్పటికీ పూర్తిగా కార్యాచరణలోకి దిగలేదు. అంతకంతకూ పెరుగుతున్న సాంక్రమిక వ్యాధుల రీత్యా తక్షణమే ఆ సంస్థ సేవలపై దృష్టి సారించాలి. 2018 నిపా తాకిడిలో, తర్వాత కరోనా కాలంలో సమర్థనీయంగా పనిచేసిన కేరళ మరోసారి కృతనిశ్చయం చూపాలి.

ఇప్పటి వరకు ఇండియా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేసియా, ఫిలిప్పీన్స్ లాంటి ఆసియా దేశాలకే ఈ వైరస్ పరిమితమైంది. ప్రపంచంలోని ఇతర దేశాలకు ఇది విస్తరించకపోవడం అదృష్టమే. కానీ, భవిష్యత్తులో విస్తరించదనే నమ్మకం ఏమీ లేదు. వైరస్‌ల విజృంభణలు, ప్రాణాంతక రోగాలు... ప్రపంచానికి కొత్త కాకపోవచ్చు. అయితే, చికిత్స లేని రోగాలు, వైరస్‌లపై శాస్త్రీయ పరిశోధనలతో ప్రపంచ దేశాలన్నీ సమష్టిగా పోరాడాల్సిన అవసరాన్ని తాజా నిపా కేసులు గుర్తుచేస్తున్నాయి. నిన్న కాక మొన్న కరోనా కట్టడిలో అలాంటి పోరే మానవాళికి మేలు చేసిందని మరచిపోరాదు. అయితే, అందుకై పరిశోధన – అభివృద్ధి విభాగానికి కావాల్సిన వనరుల్ని అందించడం తక్షణ అవసరం. ఈలోగా చేతుల శుభ్రత, మాస్కుధారణ, స్వచ్ఛమైన ఆహారాన్నే భుజించడం సదా ఆరోగ్యమనీ, అది మన చేతుల్లోని పని అనీ అందరం గుర్తించాలి. ఎందుకంటే... చికిత్స కన్నా నివారణ, భయం కన్నా అప్రమత్తతే పరమౌషధం!

కాళేశ్వరం అప్పులు ఇలా తీరతాయి!

సందర్భం



గడ్డం రంజిత్ రెడ్డి

కరవు కాటకాలకూ, వలసలకూ, రైతుల ఆత్మహత్యలకూ ఆలవాలమైన ఒకప్పటి తెలంగాణ స్వరూపం ఇప్పుడు పూర్తిగా మారిపోతోంది. ఎడారిని తలపించే పాలమూరు వంటి జిల్లాలు ఇప్పుడు పచ్చబారుతున్నాయి. ఏటా మూడు కోట్ల టన్నుల వరిధాన్యం ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని తెలంగాణ సంతరించుకొంది. దీనికి ప్రధానమైన కారణం... రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్లలో చేపట్టిన 'మిషన్ భగీరథ' లాంటి పథకాలు. మరీ ముఖ్యంగా ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా రికార్డ్ సృష్టించిన 'కాళేశ్వరం' ప్రాజెక్ట్. దాదాపు ఎనభై వేల కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ గత ఐదేళ్లుగా తెలంగాణలో సిరులను పండిస్తోంది. ఆ సిరులే రాష్ట్రానికి పెద్ద ఆదాయ వనరుగా మారిపోయాయి.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పులు మొత్తంగా తీరిపోయాయంటూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు ఇటీవల చేసిన ప్రకటన సంచలనం కలిగించింది. అదే సమయంలో ఈ ప్రకటనతో తీవ్ర దుమారం చెలరేగింది. దాదాపు 80 వేల కోట్ల రూపాయల వ్యయంతో అయిదేళ్లలో నిర్మించిన కాళేశ్వరం బృహత్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం వివిధ కార్పొరేషన్లు, బ్యాంకుల కన్సార్టియంలు ఇచ్చిన రుణాలకు తిరిగి చెల్లింపులు 2022 జూన్ నుంచి మొదలయ్యాయనీ, ఈ అప్పులు 2035 సంవత్సర వరకు వడ్డీతో సహా కట్టాల్సి ఉంటుందనీ 'కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్' ఎమ్‌డీ గత ఏడాది జూన్‌లో చెప్పారు. ఈయన మాటలకూ, సీఎం కేసీఆర్ చెప్తున్న మాటలకూ పొంతన కుదరటం లేదని తెలంగాణలో చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తప్పుదోవ పట్టిస్తూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తూ వికృతానందం పొందుతున్నాయి. కానీ అపర చాణక్యుడు కేసీఆర్ ఆలోచించకుండా అలాంటి వ్యాఖ్యలు చేస్తారనుకోవడం వారి అజ్ఞానికి తార్కాణ. ఆయన వ్యాఖ్యలు లోతుగా ఆలోచిస్తేనే అసలు విషయం అర్థమవుతుంది.

13 జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీటి అవసరాలను తీరుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగా ఇప్పుడు తెలంగాణలో ఏడాదికి మూడు కోట్ల టన్నులు వరి పండుతోందని కేసీఆర్ అన్నారు. ఈ ప్రాజెక్టు కింద వ్యవసాయం గణనీయంగా వృద్ధి చెందింది కాబట్టే ఏటా మూడు కోట్ల టన్నుల వరి ధాన్యం తెలంగాణలో ఉత్పత్తవుతోందనీ, వ్యవసాయ వృద్ధితోపాటు తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెరిగి దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉందనీ పేర్కొన్నారు. వ్యవసాయంలో ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి మళ్లీ వెనక్కి వస్తుంది కాబట్టే రూ. 80 వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకి సంబంధించి అప్పులు మొత్తం తీరిపోయాయని కేసీఆర్ వాచ్యంగా చెప్పారు. తెలంగాణ మాగాణంలో మూడు కోట్ల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తవుతోందన్న వార్తలు చూస్తుంటే తన గుండె ఉప్పొంగుతోందని భావోద్వేగం ప్రదర్శించారు. పంజాబ్, హరియాణాలను తలదన్నేలా రాష్ట్రంలో పండుతున్న వరిధాన్యాన్ని నిల్వ చేయడానికి గిడ్డంగులు సరిపోవనీ, దీంతో కొత్త గిడ్డంగులు కట్టాల్సి వస్తోందనీ ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం, సాగునీటి రంగాల్లో అద్భుతాలు జరగడం వల్ల తెలంగాణ రైతుల చేతుల్లో డబ్బులు ఆడుతున్నాయని అన్నారు. రైతు వృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అప్పుడు అప్పులు కట్టడం రాష్ట్రానికి సమస్య కాదని ఆయన మాటల్లోని నిగూఢార్థం.

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం చేసిన అప్పు మొత్తం తీరినట్టే అని సీఎం చెప్పడం అంటే ఇక తీర్చవలసిన చెల్లింపులు లేవని కాదు. రైతుల సాగునీటి, తాగునీటి కష్టాలు తీర్చేందుకు 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు'ను 'కాళేశ్వరం' పేరుతో కట్టడానికి కేంద్రం సహకరించ నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి, అతి పెద్ద ప్రాజెక్టును అతి తక్కువ కాలంలో నిర్మించింది. కిందటి ఏడాది జూన్ నుండి వాయిదాలు కట్టడం మొదలైంది. అటు వ్యవసాయం ఇటు పరిశ్రమల ద్వారా తెలంగాణలో పెరుగుతున్న ఆదాయంతో అప్పుల చెల్లింపులు తమకు పెద్ద లెక్క కాదనే ధీమాను సీఎం తన మాటల్లో వ్యక్తం చేశారు.



తెలంగాణ రాష్ట్రం గర్వించదగ్గ పరిణామం 2023 మే నెలలో చోటు చేసుకుంది. సాగునీటినీ, 50 ఏళ్లపాటు తాగునీటి అవసరాలనూ తీర్చే ప్రాజెక్టు కట్టినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. అమెరికా (నెవాడా)లో మే నెలలో జరిగిన 'ప్రపంచ పర్యావరణ, జలవనరుల కాంగ్రెస్'లో కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, మిషన్ భగీరథ తాగునీటి ప్రాజెక్ట్‌లు అభినందనలు అందుకున్నాయి. ప్రత్యేకించి కాళేశ్వరం ప్రాజెక్ట్ 'అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్' (ఏఎస్‌సీఈ) నుండి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఏఎస్‌సీఈ నిర్వహించిన 'వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ కాంగ్రెస్'లో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు ప్రసంగించారు. ప్రపంచం నలుమూలల నుండి 1,000 మంది ప్రతినిధులు హాజరైన సదస్సులో 'ప్రపంచంలోని అతిపెద్ద బహుళ–దశల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా అనేక ప్రయోజనాలు, సామాజిక సమానత్వం' అనే అంశంపై ఆయన మాట్లాడారు.

'ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ–దశల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరాన్ని తెలంగాణ విజయవంతంగా నిర్మించింది. అలాగే రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పైపుల ద్వారా తాగునీటిని అందిస్తూ ప్రతిష్ఠాత్మకంగా మిషన్ భగీరథను పూర్తి చేసింది. భారీ వ్యయంతో కూడిన ఈ అద్భుతమైన ప్రాజెక్టులను రికార్డు సమయంలో అత్యంత సమర్థతతో పూర్తి చేశాము' అని కేటీఆర్ అన్నారు. అలాగే 'లిఫ్టింగ్ ఏ రివర్' పేరిట ప్రపంచ ప్రఖ్యాత డిస్కవరీ ఛానల్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రత్యేకంగా డాక్యుమెంటరీ రూపొందించి ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేసింది.

మన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ప్రపంచంలోనే అతిపెద్ద నీటిపారుదల ప్రాజెక్ట్‌గా చరిత్రకెక్కింది. దశాబ్దాలుగా ఎండిపోయిన ప్రాంతాలతో కనిపించిన రాష్ట్రానికి నీటి సౌకర్యం కల్పించడం దీని లక్ష్యం. ఋతుపవనాల కొరత లేదా నీటిపారుదల సౌకర్యాల కొరత కారణంగా మహారాష్ట్రలోని విదర్భ తర్వాత అత్యధిక సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు నమోదవుతున్న తెలంగాణ రాష్ట్రంలో, కాళేశ్వరం ప్రాజెక్టు గతకాలపు విషాద గాథను మార్చగల సామర్థ్యం కలిగి ఉంది. కేవలం అయిదేళ్లలోనే ఇది నిరూపిత సత్యమై నిలిచింది కూడా. కాళేశ్వరం ప్రాజెక్టు ఒకటి కాదు. ఇది కొన్ని బ్యారేజీలు, పంపు హౌజులు, కాలువలు, సొరంగాల సమాహారం. కానీ, అన్నీ ఒకదానితో ఒకటి సంబంధం ఉన్నవే. గోదావరి నీటిని వీలైనంత ఎక్కువగా వినియోగించుకోవడానికి వీలుగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇది ప్రాణహిత–గోదావరి నదుల సంగమం వద్ద ఉంది. ప్రధానంగా కాళేశ్వరం వద్ద గోదావరిలో కలిసే ప్రాణహిత, దమ్మూరు వద్ద కలిసే ఇంద్రావతి నదుల జలాల వినియోగం ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని 195 టీఎంసీల నీటిని వెనుకబడిన ప్రాంతాలకు మళ్లించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు.

ఇప్పటివరకు దేశంలోని ఏ రాష్ట్రం చేపట్టని అత్యంత ఖరీదైన నీటిపారుదల ప్రాజెక్టు ఇదే. 13 జిల్లాల్లోని 18 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించడానికి, మరో ఏడు జిల్లాల్లో మరో 17 లక్షల ఎకరాలకు స్థిరీకరణతో... వాస్తవంగా ఈ ప్రాజెక్టు మొత్తం రాష్ట్రాన్ని కవర్ చేస్తుంది. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాలకు, ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్ లాంటి అతి ముఖ్యమైన నగరాలకు తాగునీటిని అందిస్తుంది. అంతేకాదు, అనేక పరిశ్రమలకు నీటిని అందిస్తుంది. 139 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బాహుబలి పంపులు ప్రతిరోజూ 2 వేల మిలియన్ క్యూబిక్ అడుగుల (టీఎంసీ) నీటిని ఎత్తిపోయడం ప్రపంచ చరిత్రలో ఎక్కడా జరగలేదు. 2 టీఎంసీల నీటిని అన్నారం, సుందిళ్ల అనే రెండు బ్యారేజీల్లోకి పంపిస్తారు. ఇక్కడి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీరు వెళ్తుంది. ఎల్లంపల్లి నుంచి గ్రావిటీ కెనాల్స్, పైప్‌లైన్ల ద్వారా నీటి పంపిణీ ప్రారంభమవుతుంది. దీనికి అవసరమైన నీరు మేడిగడ్డ బ్యారేజీ నుండి 14.09 కిలోమీటర్ల భూగర్భ సొరంగం ద్వారా వస్తుంది, ఇది ప్రపంచంలోనే పొడవైన నీటిపారుదల సొరంగం. పంప్ పనిచేసే గుహ, సర్జ్ పూల్, 2 కోట్ల లీటర్ల నీటిని పట్టుకునే సామర్థ్యంతో ప్రపంచ రికార్డును కూడా కలిగి ఉండటం విశేషం. ఇలా అనేక ప్రత్యేకతలూ, ప్రయోజనాలూ ఉన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణను అన్నపూర్ణగా కలకాలం నిలుపుతుందనడం అతిశయోక్తికాదు.

వ్యాసకర్త బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యుడు, చేవెళ్ల

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విలువ తెలుసుకో!



వేగంగా వెళ్తున్న పోలీసు కారు వల్ల జాహ్నవి కందుల మరణించారు. ఆమె జీవితానికి 'పరిమిత విలువ' ఉందని అధికారి అడరర్ అన్నారు. తన ఇరవైల్లో ఇక్కడికి వచ్చిన మా నాన్న గుర్తొచ్చారు. మిస్టర్ అడరర్, ప్రతి ప్రవాస భారతీయుడి జీవితానికి అనంతమైన విలువుంది. – రో ఖన్నా, అమెరికా నేత

భట్‌కు సెల్యూట్



తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు వదిలిన హుమాయూన్ భట్... తన దేశస్థులను కాపాడటానికి కశ్మీర్‌లో మరణించిన రెండో తరం ముస్లిం పోలీసు. ('కశ్మీర్ ఫైల్స్'లో) కశ్మీర్‌ను ఇంకోలా చూపిన వివేక్ అగ్నిహోత్రిని క్షమించకూడదు. – సీతూ మహాజన్ కోహ్లీ, ఆర్కిటెక్ట్

చీకటి చరిత్ర



నాజీ జర్మనీ దిశగా ఇండియా పయనిస్తోందని విమర్శించడం అవమానకరం. ఇజ్రాయిల్‌లో హోలోకాస్ట్ బాధితులను కలుసుకున్నవాడిగా భారత్‌ను అలా పోల్చడం బాధాకరం. అలాంటి కర్కశత్వానికి దగ్గరగా వచ్చేది కశ్మీర్‌లో హిందువుల మారణకాండ మాత్రమే! – సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

డబ్బే ముఖ్యం



కశ్మీర్‌లో భారత సైనికుడు మరణించిన ప్రతిసారీ ఇండియా–పాక్ క్రికెట్ మ్యాచ్ ఆడకూడదనడంలో అర్థం లేదు. క్రీడాకారులను నిందించడం మానండి. వాళ్లు బీసీసీఐతో ఒప్పందంలో ఉన్నారు. బీసీసీఐకి ధైర్యం ఉంటే, పాకిస్తాన్‌తో అన్ని క్రీడా సంబంధాలనూ రద్దు చేసుకోవాలి. కానీ దేశభక్తి మీద ధనమే గెలుస్తుంది. – మోహన్ సిన్హా, జర్నలిస్ట్

ఎవరూ గుర్తుండరు!



కశ్మీర్‌లో జరిగే ప్రతి త్యాగం తర్వాత, 'వాళ్లను ఎవరూ మరిచిపోరు' అంటారు. నిజంగానా? గతవారం చనిపోయిన సైనికుల పేర్లు తెలుసా? పేర్లు అటుండనీ, సంఖ్య అయినా తెలుసా? లెక్కలేనంత మంది యువకులు చనిపోవడానికి సిద్ధంగా ఉండటమే అసలు విషాదం! – హార్దిక్ రాజ్‌గోర్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

సినీ మార్గదర్శకుడు

సినిమాకు ఒక విధానం ఉందనీ, ఆ విధానానికి ఒక శాస్త్రం ఉందనీ, దాన్ని అనుసరించే సినిమాలు తీయాలని చెప్పి, చేసి చూపిన దర్శక మేధావి కేవీ రెడ్డి. సరైన స్క్రిప్టు సినిమాకు ముఖ్యమనీ, స్క్రీన్‌ప్లే సిద్ధమైతే సినిమా మూడొంతులు పూర్తయినట్టేనని నిరూపించిన దక్షిణ భారతదేశ దర్శకుల్లో అగ్రగణ్యులు. దర్శకునిగా కేవీ రెడ్డి మూడు దశాబ్దాల కాలంలో తీసిన సినిమాల సంఖ్య కేవలం 14. తమిళ, హిందీ వెర్షన్లతో కలిపితే 18. వీటిలో 5 పౌరాణికాలు, నాలుగు జానపదాలు, 3 సాంఘికాలు, రెండు చారిత్రకాలు ఉన్నాయి. ఆయన పేరు చెప్పగానే 'మాయాబజార్', 'పాతాళభైరవి', 'గుణసుందరి కథ', 'దొంగ రాముడు' గుర్తొస్తాయి. కేవీ 1937లో తన మిత్రుడు మూలా నారాయణస్వామి భాగస్వామిగా ఉన్న 'రోహిణీ పిక్చర్స్'లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ గా చేరడంతో సినీ రంగంలోకి ప్రవేశించారు. అప్పట్లో రోహిణీ పిక్చర్స్ హెచ్ఎం రెడ్డి దర్శకత్వంలో 'గృహలక్ష్మి' (1938) తీసింది. ఇక్కడే ఆయనకి బీఎన్ రెడ్డి, సముద్రాల, నాగిరెడ్డిలతో పరిచయమైంది. తర్వాత వీరంతా బయటికి వచ్చి వాహినీ పిక్చర్స్ స్థాపించారు.



కేవీ రెడ్డి

వాహినీ పతాకంపై బీఎన్ తీసిన 'వందేమాతరం' (1939), 'సుమంగళి' (1940), 'దేవత' (1941) చిత్రాలకు కేవీ సహాయ దర్శకులుగా చేశారు. దేవత తరువాత కేవీకి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. అది మూలా నారాయణస్వామి పెట్టుబడితో తీసిన 'భక్తపోతన' (1942). అది రజతోత్సవాలు జరుపుకుంది. 'గుణసుందరి కథ' (1949) విజయం ఇచ్చిన ప్రేరణతో విజయావారికి మరో అద్భుత జనరంజకం 'పాతాళభైరవి' (1951) తీశారు. 'మాయాబజార్' (1957) ఒక చరిత్రను సృష్టించింది. కేవీ దర్శకత్వ ప్రతిభకు, పకడ్బందీ స్క్రీన్‌ప్లేకు ఈ చిత్రం ఒక తిరుగులేని సిలబస్.

తెలుగు చిత్ర రంగంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కేవీ రెడ్డి (కదిరి వెంకటరెడ్డి) 1912 జులై 1న అనంతపురం జిల్లా తాడిపత్రిలో పుట్టారు. 1972 సెప్టెంబర్ 15న కన్నుమూశారు. కేవీ మనమధ్య లేకపోయినా ఆయన కళకు, వ్యాపారానికి సమన్వయం చేస్తూ తీసిన చిత్రాలు చూస్తున్నంత కాలం చిరంజీవిగా నిలిచే ఉంటారు. తెలుగు సినిమా రంగంలో ఆయనకు ప్రత్యామ్నాయం లేదు.

– హెచ్. రమేష్ బాబు, చలనచిత్ర పరిశోధకులు
(నేడు కేవీ రెడ్డి వర్ధంతి)

స్కిల్ పెంచండి బాబులూ..!

సారాంశం
సరికొండ చలపతి

స్కిల్స్ పలు రకాలు.. ఏ 'స్కిల్' ప్రమాదకరమో మొన్నీమధ్యే చూశాం కదా, అలాంటివి కాదు. మనకూ జనానికీ ఉపయోగపడేవి. ఆ స్కిల్స్ చూడండి సరదాగా...

సేల్స్.. స్కిల్

ఓ పెద్దమనిషి, అరవై ఏళ్లకు పైబడి ఉంటాడు. జోరు వర్షంలో గొడుగేసుకుని ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పుస్తకాలు అమ్ముతున్నాడు. అప్పటికే బాగా చీకటి పడింది. ఇది ఆసక్తిగా అనిపించి ఓ యువకుడు కారులోనుంచే.. 'పుస్తకం ఎంత' అని అడిగాడు.

'మూడువేల రూపాయలు. కానీ, నీకు అమ్మబోను. నీకు ఈ పుస్తకం చదివే ధైర్యం ఉన్నట్టు లేదు,' అన్నాడు

''నాకు చాలా ధైర్యం ఉంది. గంటలో లాగించేస్తాను.' – అన్నాడా యువకుడు కాస్త రోషంతో.

''..అయితే ఒక షరతు మీద ఈ పుస్తకం నీకు అమ్ముతా, అది ఓకే అయితే నీకు ఓ వంద డిస్కౌంట్ కూడా ఇస్తా..'' అన్నాడా పెద్దమనిషి

''ఏమిటా షరతు?''

''నువ్వు జన్మలో చివరి పేజీ చదవనని ఒట్టు వెయ్యాలి. ఎందుకంటే అది చదివి నువ్వు తట్టుకోలేవు. చాలా బాధపడతావు.''

''ఓకే ప్రామిస్!.. నేను ధైర్యవంతుడినే అయినా, చివరి పేజీ చదవను, ఇదిగో డిస్కౌంట్ పోను 2,900 రూపాయలు. పుస్తకం ఇవ్వు..'' అంటూ మనీ పెద్దమనిషి చేతిలో పెట్టాడు.

పెద్దమనిషి డబ్బులు తీసుకుని పుస్తకం ఇస్తూ షరతు గురించి మళ్లీ గుర్తు చేశాడు.

పుస్తకం తీసుకున్న యువకుడు ఇంటికి వెళ్లి భయం, భయంగా పుస్తకం చదివేశాడు. క్రైమ్ థ్రిల్లర్ బుక్ అది.. కొంచెం క్రైమ్, కొంచెం సస్పెన్స్ ఉన్నా... మరీ అంత భయంకరంగా లేదు.

చివరి పేజీ ఎందుకు చదవ వద్దన్నాడా పెద్దమనిషి? దానిలో అంత తట్టుకోలేని బాధ ఏముంటది? అని మనవాడికి డౌట్ వచ్చింది. చదువుదామని మనసు పీకింది. కాస్త భయం వేసింది. ప్రామిస్‌ను పక్కన పెట్టి... గుండె దిటవు చేసుకుని భయం భయంగా చివరి పేజీ చూస్తే నిజంగానే గుండె ఆగినంత పనైంది.. ఆ చివరి పేజీలో ఇలా ఉంది

'పుస్తకం ఖరీదు 50 రూపాయలు...'

ఇదీ సేల్స్ స్కిల్... అంతే కదా?

...

ఇక ఈ తరహా తెలివితేటలు చూడండి. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉంది.

మేడిన్ ఇండియా!

ఒకసారి అమెరికా కంపెనీలో సబ్బుల ఫ్యాక్టరీలో ఒక పొరపాటు జరిగింది. కొన్ని కవర్లు ప్యాక్ అయ్యాయి కానీ, అందులో సబ్బుల్లేవు. డీలర్లు, కస్టమర్ల గొడవ.. పెద్దగోల య్యింది. దానితో యాజమాన్యం కంపెనీలో ఇలాంటి సమస్యలు ఇంకెప్పుడూ రాకూడదనీ, పరువు పోకూడదనీ జాగ్రత్త కోసం ఆరు కోట్లు పెట్టి ఎక్స్‌రే మెషీన్ కొన్నదట. ప్యాకైన సబ్బులు వెళుతుంటే అందులో సబ్బు ఉన్నదీ లేనిదీ ఆ మెషీన్ ద్వారా కనుక్కుని తీసేయడానికి వీలయ్యింది. ఈ విషయం హైదరాబాద్ సబ్బుల కంపెనీలో మీటింగ్‌లో ప్రస్తావనకు వచ్చింది. ఆ అమెరికా కంపెనీలో పనిచేసి ఇక్కడికి వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఒకరు ఆ దేశ టెక్నాలజీని, వాళ్ల స్కిల్‌ను. శ్రద్ధను చిలవలు పలవలుగా వివరిస్తున్నాడు. ఆ మీటింగ్‌లో చాయ్ బిస్కట్ ఎంజాయ్ చేస్తున్న మనోడు లేచి,''ఎందుకు సర్ 6 కోట్లు తగలేశారు. ఓ 3 వేలు పెట్టి 'పెడెస్టల్ ఫ్యాన్' కొని స్పీడ్‌గా తిప్పితే ఖాళీ ప్యాకెట్లు ఎగిరిపోతాయిగా. పొరపాటున ఖాళీగా వచ్చేవి ఒకటీ రెండేగా''... అనేసి మళ్లీ చాయ్ బిస్కట్ మీద పడ్డాడు. దీనితో అమెరికా ఎగ్జిక్యూటివ్ అవాక్కయ్యాడు. చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి.. అన్న సామెత అన్నిచోట్లా వర్తించదు. ఎంత పాముకు అంత కర్ర.. అదీ సరైన సమయంలో.

– ఇదీ ఓ రకమైన జాబ్ స్కిల్లే కదా!

నో స్కిల్... 81 పర్సెంట్...

ఇంతకీ స్కిల్లు గురించి ఎందుకీ సొల్లు అంటారా? అత్యుత్తమ ఔట్‌పుట్ ఇవ్వగల నైపుణ్యాలు ఉద్యోగుల్లో ఉండటం లేదట. ఒకటో, రెండో కాదు.. ఐటీ రంగంలో ఏకంగా 81 శాతం సంస్థలు నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నాయని ఈవై, ఐమోచా సంస్థల అధ్యయనంలో వెల్లడైంది. మంచి నైపుణ్యాలు ఉన్న ఉద్యోగుల కోసం డిమాండ్ పెరుగుతోందని తేలింది.

ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల ఉద్యోగుల్లో పని నైపుణ్యాలు, కొత్త టెక్నాలజీలపై అవగాహన అంశాలపై ఈవై, ఐమోచా సంస్థలు అధ్యయనం నిర్వహించాయి. 'టెక్ స్కిల్స్‌లో మార్పులు – ఆ తర్వాత పని పరిస్థితులు' పేరిట ఇటీవల నివేదికను విడుదల చేశాయి.

– ప్రస్తుత డిజిటల్ యుగంలో పోటీలో నిలిచేందుకు వీలుగా కంపెనీలు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకుంటున్నాయనీ.. కానీ వాటికి తగినట్టుగా నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులు దొరకడం కష్టమవుతోందనీ నివేదిక వెల్లడించింది. ఒక్క ఐటీ రంగం మాత్రమే కాకుండా... బ్యాంకింగ్, ఫైనాన్స్, టెలికాం, డేటా అనాలసిస్ వంటి ఇతర రంగాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని స్పష్టం చేసింది.

– అప్లికేషన్ డెవలపర్లు, పవర్ యూజర్ స్కిల్స్ ఉన్నవారికి డిమాండ్ పెరగడం కూడా కొరత నెలకొనడానికి కారణమని నివేదిక పేర్కొంది.

స్కిల్ ఉంటేనే జాబులు...

– సర్వేలో పాల్గొన్న చాలా సంస్థలు డెవలపర్, పవర్ యూజర్ నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నట్టు తెలిపాయి. కొత్త టెక్నాలజీలు, అవసరాలకు అనుగుణంగా ఏ ఉద్యోగానికి ఏ నైపుణ్యాలు తప్పనిసరి అనే విభజనను అనుసరిస్తున్నామని 19 శాతం కంపెనీలు తెలిపాయి. 43 శాతం కంపెనీలు ఉద్యోగుల స్థాయిలో నైపుణ్యాల పరిశీలన చేపట్టామన్నాయి. ఈ విభజన /పరిశీలన క్రమంలో చాలా మంది ఉద్యోగుల్లో అవసరమైన నైపుణ్యాలు లేనట్టుగా గుర్తించామని వెల్లడించాయి. ఈ క్రమంలో ఓవైపు ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, మరోవైపు మంచి స్కిల్స్ ఉన్నవారిని చేర్చుకోవడంపై దృష్టి పెడుతున్నట్టు వివరించాయి.

స్కిల్స్ పెంచేద్దాం...

ప్రస్తుతం ఉద్యోగులు నిర్వర్తించాల్సిన విధులు, అందుకు అవసరమైన నైపుణ్యాల్లో ఎన్నడూ లేనంత వేగంగా మార్పులు వస్తున్నాయని ఈ అధ్యయనం చెబుతోంది. 2025 నాటికి తమ సంస్థల్లోని మూడో వంతు ఉద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యాలను గణనీయంగా పెంపొందించాల్సిన అవసరం ఉందని 28 శాతం సంస్థలు భావిస్తున్నాయనీ వివరిస్తోంది. మరో 62 శాతం కంపెనీలు కనీసం 15 శాతం మంది ఉద్యోగుల్లో నైపుణ్యాల పెంపు తప్పనిసరి అని భావిస్తున్నట్టు తెలిపారు.

ఇండియాలోనూ అంతే..

భారతదేశంలోని 60 శాతానికి పైగా కంపెనీలు నైపుణ్యమున్న ఉద్యోగుల కొరతను ఎదుర్కొంటున్నట్టు ఇటీవలి 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదికలో ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) కూడా పేర్కొంది. ముఖ్యంగా చదువు పూర్తిచేసుకుని కొత్తగా ఉద్యోగాల్లోకి వస్తున్నవారికి తగిన నైపుణ్యాలు ఏమాత్రం ఉండటం లేదని వెల్లడించింది. ఉద్యోగుల్లో నైపుణ్యాల కల్పనకు తోడ్పడే అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఆన్ జాబ్ ట్రెయినింగ్ వంటి వాటిని భారత్‌లో ఉపేక్షిస్తున్నారని పేర్కొంది. ముఖ్యంగా కంపెనీలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన స్కిల్స్ కల్పించేలా విద్యా రంగంలో సంస్కరణలు రావాల్సి ఉందని అభిప్రాయపడింది.



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: అమావాస్య ఉ.6.07 వరకు, తదుపరి భాద్రపద శు.పాడ్యమి, నక్షత్రం: ఉత్తర ఫల్గుణి (24గంటలు), వర్జ్యం: ప.1.03 నుండి 2.51 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.16 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.10 వరకు, అమృతఘడియలు: రా.11.35 నుండి 1.21 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.51, సూర్యాస్తమయం: 6.02.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఆర్టీసీ ఉద్యోగులు.. ఇక ప్రభుత్వ ఉద్యోగులే

- ఎట్టకేలకు గవర్నర్ తమిళిసై ఆమోదముద్ర
- బిల్లు పాసైన దాదాపు 40 రోజుల తర్వాత ఆమోదం
- 10 సూచనలు బిల్లులో పొందుపరచడంపై గవర్నర్ సంతృప్తి



సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోద ముద్ర వేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ గురువారం ఓకే చెప్పడంతో చట్ట బద్ధత లభించింది. దీంతో 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు. టీఎస్ ఆర్టీసీ (ఉద్యో గులను ప్రభుత్వంలో విలీనం) బిల్లు–2023ను శాసనసభ గతనెలలో ఆమోదించగా, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ బిల్లుపై సంతకం చేసినట్టు రాజ్‌భవన్ తాజాగా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఆర్టీసీ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉంటే.. జూలై 31న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశానికి సంబంధించి ఆమోద ముద్ర వేయడం, ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని నిర్ణయించిన విషయం విదితమే. అయితే ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడానికి ముందు గవర్నర్ అనుమతి తప్పనిసరి కావడంతో, గవర్నర్ బిల్లును పరిశీలించి పలు అనుమానాలు వ్యక్తం చేయడం, మొదట సంస్థ ఆస్తులు, కేంద్ర గ్రాంట్లు, వాటా, విభజన చట్టంలో 9వ షెడ్యూల్, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూస్తారా.? వారి సీనియారిటీ, పారిశ్రామిక వివాదాల చట్టం వర్తిస్తుందా..? ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ వర్తిస్తుందా..?అన్ని ప్రయోజనాలు కల్పిస్తారా..? ప్రభుత్వ ఉద్యోగాల్లో కండక్టర్, కంట్రోలర్ వంటి పోస్టులు లేవు మరి వారిని ఏ విధంగా సర్దుబాటు చేస్తారు.? కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నారా.? డిపోల్లో కేటగిరి వారీగా ఉన్న ఉద్యోగుల సంఖ్య ఎంత.. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికుల పరిస్థితి ఏమిటీ..? ఆర్టీసీ ప్రస్తుత స్వరూపంతోనే పనిచేస్తుందా..? ఆస్తులను ప్రభుత్వం విలీనం చేసుకుంటుందా.? బస్సుల నిర్వహణ, ఆజమాయిషీ ఎవరిది లాంటి అనేక ప్రశ్నలు గవర్నర్ లేవనెత్తడం.. వాటిన్నింటికి ప్రభుత్వం సమాధానం ఇవ్వడంతోపాటు, బిల్లులో పొందుపరిచి అసెంబ్లీలో పాస్ చేసిన సంగతి విదితమే. బిల్లు వచ్చిన తర్వాత మళ్లీ న్యాయశాఖ పరిశీలనకు పంపించిన గవర్నర్.. ఈనెల 3వ తేదీన న్యాయశాఖ నుంచి బిల్లు తిరిగి వచ్చిన తర్వాత దాదాపు పదిరోజుల పరిశీలన అనంతరం బిల్లుకు ఆమోదం తెలిపారు.

సీఎంకు ధన్యవాదాలు : బాజిరెడ్డి గోవర్ధన్



ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో ఆర్టీసీ ఉద్యోగులంతా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. తాను సంస్థ చైర్మన్‌గా ఉన్న సమయంలో వారంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారడం ఆనందంగా ఉందన్నారు.

జీవశాస్త్ర రంగంలో రాష్ట్రం దూకుడు!

- పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ సాయం: మంత్రి కేటీఆర్



క్యాంపస్‌లో విస్తరణ పనులకు భూమి పూజ చేస్తున్న కేటీఆర్, కిరణ్ మజుందార్‌షా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జీవశాస్త్ర రంగంలో దూకుడుగా ముందుకెళ్తోందని, ఈ ప్రగతి తమకెంతో గర్వకారణమని మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. సిన్‌జీన్ వంటి అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో తమ కార్యకలాపాలు చేపట్టడం రాష్ట్రంలోని అవకాశాలకు, ప్రభుత్వ సహకారానికి నిదర్శనమన్నారు. గురువారం జినోమ్ వ్యాలీలో సిన్‌జీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షాతో కలసి ఆ సంస్థ విస్తరణ కార్యకలాపాలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో జీవశాస్త్ర రంగం పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని, తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని మంత్రి చెప్పారు. సిన్‌జీన్ సంస్థ 2020లోనే జినోమ్ వ్యాలీలో సుమారు 52వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్‌ను ఏర్పాటు చేసింది. తాజాగా సుమారు 788 కోట్ల పెట్టుబడితో దీని విస్తరణ చేపట్టింది. ఇందులోభాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ప్రోటాక్ ల్యాబొరేటరీని, సెంట్రల్ కాంపౌండ్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ విస్తరణతో వచ్చే ఐదేళ్లలో వెయ్యికిపైగా ఉద్యోగాలు వస్తాయని కంపెనీ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా తెలిపారు.

ఇది సిద్దిపేట కాదు.. ఖమ్మం జిల్లా..

- హరీశ్‌రావుపై మండిపడిన భట్టి



ముదిగొండ: ఇది ఖమ్మం ప్రజల ఖిల్లా, సిద్దిపేట జిల్లా కాదు.. నీ జాగీరు, కేసీఆర్ జాగీరు అంతకన్నా కాదు... అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి ఖమ్మం వచ్చిన మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలు, రాజకీయ పార్టీల గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని, ఖమ్మం రాజకీయంగా చైతన్యం కలిగిన జిల్లా అని తెలుసుకోవాలని హరీశ్‌రావుకు సూచించారు. ఆయనకు ఇచ్చిన మంత్రి పదవిని సరిగ్గా నిర్వర్తిస్తూ... ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టుల భర్తీపై దృష్టి సారించాలని సూచించారు.

నేడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- బ్లాక్ ఇంక్ పెన్నునే వాడాలి
- గంట ముందే రావాలి
- ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,139 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం ఉదయ, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ పేపర్–1, పేపర్–2 నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసిన విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సెలవు ప్రకటించింది. వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచిన అధికారులు, వాటిలో పొరపాట్లు తలెత్తితే సరిచేసుకునే సూచనలు సైతం వెల్లడించారు.

- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పేపర్–1 పరీక్షకు 1,139 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,69,557 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పేపర్–2 పరీక్షకు 913 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,08,498 మంది అభ్యర్థులు హాజరవుతారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

టెట్ జరిగే కేంద్రాల్లో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పరీక్ష తీరును పర్యవేక్షిస్తారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రెండు బాల్ పాయింట్ బ్లాక్ పెన్నులు అభ్యర్థులు వెంట తెచ్చుకోవాలి. హాల్‌టికెట్ లేకుండా పరీక్షకేంద్రంలోని ప్రవేశం ఉండదు. అభ్యర్థులు ఓఎమ్మార్ పత్రంలో వివరాలు బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తోనే పూరించాలి. మరే రంగు పెన్నుతో నింపడానికి అనుమతించరు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, ఇతర వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష సమయం పూర్తయ్యాకే అభ్యర్థులను కేంద్రం నుంచి బయటకు పంపిస్తారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌లో పేరులో ఏమైనా స్వల్ప అక్షరదోషాలు, వివరాలు సరిగ్గా లేకుంటే పరీక్ష హాలులో నామినల్ రోల్ కమ్ ఫొటో ఐడెంటిటీలో సవరించుకోవాలి. హాల్‌టికెట్‌పైన ఫొటో, సంతకం సరిగా లేకున్నా ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకోవడంతో పాటు అభ్యర్థి ఆధార్ కార్డు, ఇతర ఫొటో ఐడీ కార్డులతో సంబంధిత డీఈఓలను సంప్రదించాలి. వారి అనుమతితోనే పరీక్షకు అనుమతిస్తారు.

19 నుంచి ఎడ్‌సెట్, పీఈసెట్ కౌన్సెలింగ్

- అక్టోబర్ 30 నుంచి తరగతులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఎడ్‌సెట్–2023, టీఎస్ పీఈసెట్–2023 ప్రవేశాల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. ఈ రెండు సెట్‌లకు సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను గురువారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. గురువారం టీఎస్‌సీహెచ్‌ఈ కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి అధ్యక్షతన ప్రవేశాల కమిటీ సమావేశం జరిగింది. ఇందులో భాగంగా టీఎస్ ఎడ్‌సెట్–2023, టీఎస్ పీఈసెట్–2023 ప్రవేశాలపై చర్చించిన అధికారులు.. ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈనెల 19వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా...

కౌన్సెలింగ్ ప్రక్రియ	టీఎస్ ఎడ్‌సెట్–2023	టీఎస్ పీఈసెట్–2023
నోటిఫికేషన్ జారీ	19.09.2023	19.09.2023
ఆన్‌లైన్ నమోదు, పరిశీలన, చెల్లింపు, సర్టిఫికెట్ల అప్‌లోడింగ్	20.09.23–30.09.23	20.09.2325.09.23
స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల పరిశీలన	25.09.23–29.09.23	24.09.2325.09.23
సవరణలు	02.10.2023	27.09.2023
వెబ్ ఆప్షన్ల నమోదు ఫేజ్–1	03.10.23–05.10.23	28.09.23–29.09.23
వెబ్ ఆప్షన్ల సవరణ ఫేజ్–1	06.10.2023	30.09.2023
కళాశాలల వారీగా ప్రవేశాల జాబితా	09.10.2023	03.10.2023
కళాశాలల్లో రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు	10.10.23–13.10.23	04.10.23–07.10.23
తరగతులు ప్రారంభం	30.10.2023	30.10.2023

కేంద్రం ఎన్ని అవాంతరాలు పెట్టినా..

అవార్డులు తెలంగాణకే

- స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి



పెద్దపల్లి జిల్లా నుంచి ఎంపికైన గర్రెపల్లి సర్పంచ్ సుజాత రమేష్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఎర్రబెల్లి

ఏజీవర్సిటీ (హైదరాబాద్): కేంద్రం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక అనేక అవాంతరాలు సృష్టిస్తోందని, రావాల్సిన నిధులను నిలిపివేసి అనేక కొర్రీలు పెడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అయితే ఎన్ని కొర్రీలు పెట్టినా దేశంలో తెలంగాణకే అవార్డుల పంట పండుతోందని, ఇది సీఎం కేసీఆర్ ఘనత అని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని టీఎస్ ఐఆర్డీలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావుతో కలిసి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన పంచాయతీలకు మంత్రి అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

'చంద్రబాబు నిర్వాకంతోనే నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ'

పంజగుట్ట: పథకం ప్రకారమే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజాం షుగర్స్‌ను ప్రైవేట్ పరం చేసి చెరకు రైతుల నోట్లో మట్టి కొట్టారని కాంగ్రెస్ జాతీయ కిసాన్ సంఘ్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఇది మంచిది కాదని అప్పుడే లేఖరాసినా వినిపించుకోలేదని పేర్కొన్నారు. కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం చెరుకు రైతుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ కిసాన్ సంఘ్ కన్వీనర్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తమ సమస్యలపై చెరకు రైతులు సీఎం కేసీఆర్‌కు లేఖలు రాయాలని పిలుపు నిచ్చారు.

45 మంది విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్

- మన్ననూరు బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన

మన్ననూర్: బాలికల గిరిజన ఆశ్రమపాఠశాలలో 45 మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన గురువారంరాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో చోటుచేసుకున్నది. మన్ననూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 400 మంది వరకు విద్యార్థినులు ఉన్నారు. గురువారంరాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. కొద్ది సేపటికే 10 మంది బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై ఊపిరి ఆడకపోవడం, కడుపులో తీవ్రమైన నొప్పి వస్తోందని అల్లాడిపోయారు. దీంతో సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో వసతిగృహంలో ఒకరి తర్వాత మరొకరు అస్వస్థతకు గురవుతుండటంతో 4 అంబులెన్స్‌లలో సుమారు 45 మందిని అచ్చంపేటకు తరలించారు. ఆ తర్వాత లారీ తీసుకువచ్చి సుమారు వంద మంది విద్యార్థినులను అచ్చంపేటకు తీసుకెళ్లారు. ఇందులో ఇద్దరు బాలికల పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

కరువు నేలకు కృష్ణమ్మ

- రేపు 'పాలమూరు–రంగారెడ్డి' ప్రారంభోత్సవం
- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రాజెక్ట్ జాతికి అంకితం
- 'నార్లాపూర్'లో మొదటి మోటార్ స్విచాన్ చేసి ప్రారంభించనున్న కేసీఆర్
- 6 జిల్లాలు.. 19 నియోజకవర్గాలు సస్యశ్యామలం



ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



ఎల్లూరు సర్జిపూల్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్: కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కే గడియ రానే వచ్చింది. 2015లోనే పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు అంకురార్పణ జరగ్గా, దాదాపు ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత ఆ కల సాకారం కానుంది. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నార్లాపూర్ పంపుహౌస్, కృష్ణాతీరంలోని హెడ్‌రెగ్యులేటరీ ఇన్‌టేక్ వద్ద, కొల్లాపూర్ చుట్టుపక్కల పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం సీఎం కేసీఆర్ కొల్లాపూర్‌కు రోడ్డు మార్గంలో వస్తారు. మొదటగా నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్టు పంప్‌హౌస్‌లోని కంట్రోల్ రూం వద్ద పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరిస్తారు. పంపుహౌస్‌లోని నాలుగో అంతస్తులో మొదటి మోటారు స్విచ్ ఆన్ చేసి నీటి ఎత్తిపోతలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి 1.7 కి.మీ దూరంలో ఉన్న హెడ్ రెగ్యులేటరీ వద్దకు చేరుకొని కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం కొల్లాపూర్ పట్టణ శివారులోని సింగోటం చౌరస్తా సమీపంలో నిర్వహించనున్న భారీ బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

కొల్లాపూర్‌లో సీఎం సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లను మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి వేర్వేరుగా పర్యవేక్షించారు. అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని, శుక్రవారం రాత్రి వరకు ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు.అంతకుముందు మంత్రి నిరంజన్‌రెడ్డి పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను పరిశీలించారు. స్విచ్ బోర్డుల పనితీరు గురించి నీటి పారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి మంత్రికి వివరించారు.

మహా బాహుబలి మోటార్లు

- పాలమూరు ఎత్తిపోతల్లో మొత్తం 34 మోటార్లు వినియోగిస్తున్నారు. ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇంత సామర్థ్యం గల మోటార్లు ఏర్పాటు చేయడం ప్రపంచంలోనే ప్రథమం. ఈ మోటార్లను మహా బాహుబలి పంప్‌లుగా పిలుస్తున్నారు.
- ఏదుల పంప్‌హౌస్ వద్ద ఆసియాలోనే అతిపెద్ద భూగర్భ సర్జిపూల్‌ను భూ ఉపరితలం నుంచి 145 మీటర్ల లోతులో నిర్మించారు. 90 మీటర్ల ఎత్తు, 357 మీటర్ల పొడవు, 31 మీటర్ల వెడల్పుతో దీని డిజైన్ రూపొందించారు.
- పాలమూరు ఎత్తిపోతల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లను భూ ఉపరితలంపైనే నిర్మించారు. పంపులు, విద్యుత్ వ్యవస్థతో పాటు అన్నింటా మానవరహిత వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్కాడా (సాంకేతిక వ్యవస్థ) వినియోగిస్తున్నారు. 550 టన్నుల బరువు ఉండే పంప్ నడుస్తున్నప్పుడు అధిక వేడి ఉత్పత్తి అవుతుంది. ఈ మేరకు చల్లబరిచేందుకు కూలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి మోటారుకు 20 భారీ ఏసీలు అమర్చారు.



బాహుబలి మోటార్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

లిఫ్ట్‌ల వారీగా సామర్థ్యం ఇలా..

లిఫ్ట్	ఎత్తు (మీటర్లు)	మోటార్లు	ఒక్కో మోటార్ సామర్థ్యం (మెగావాట్లలో)	ఒక్కొక్కటి ఎత్తిపోసే నీరు (క్యూసెక్కులలో)
లిఫ్ట్–1	104	8	145	3,200
లిఫ్ట్–2	124	9	145	2648
లిఫ్ట్–3	121	9	145	2,648
లిఫ్ట్–5	122	5	145	2,648
లిఫ్ట్–5	69	3	75	–

పీఆర్ఎల్ఐ పథకం వివరాలు..

పరిపాలన అనుమతులు	10–06–2015
పనుల ప్రారంభం	2015 జూన్ 11
ప్రతి రోజూ లిఫ్ట్ చేసేది	2 టీఎంసీలు
నీటి ఎత్తి పోసే లక్ష్యం	60 రోజులు (90 టీఎంసీలు)
లబ్ధి పొందే జిల్లాలు	6
సాగునీరు అందేది	12.30 లక్షల ఎకరాలు
తాగునీరు అందే ప్రాంతాలు	70 మండలాలు, 1,226 గ్రామాలు
జిల్లాల వారీగా ఆయకట్టు ఇలా (ఎకరాల్లో)	
నాగర్‌కర్నూల్	1,03,389
మహబూబ్‌నగర్	2,35,319
నారాయణపేట	1,60,955
నల్లగొండ	29,339
రంగారెడ్డి	3,59,047
వికారాబాద్	13,41,951
జలాశయాల సామర్థ్యం ఇలా (టీఎంసీల్లో)	
అంజనగిరి (నార్లాపూర్)	6.40
వీరాంజనేయ (ఏదుల)	6.55
వెంకటాద్రి (వట్టెం)	16.74
కురుమూర్తిరాయ (కర్వెన)	19
ఉదండాపూర్	16.03
కేపీ లక్ష్మీదేవి	2.80

స్టాక్ హోల్డింగ్ డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (SDMS)
SHCIL హౌస్, పి-51, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ఎంఐడిసి, మహాపే నవి ముంబయి, మహారాష్ట్ర - 400 710
CIN - U74140MH2006GOI163728
ప్రపోజల్ కోసం అభ్యర్థన (ఆర్‌ఎఫ్‌పి)
SDMS యొక్క ఎంపానెల్మెంట్ కోసం నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తును ఆహ్వానిస్తుంది -
1. డిజిటలైజేషన్ ప్రాజెక్టుల కోసం బిజినెస్ అసోసియేట్స్
2. జిఎంటి (మెటల్ బాక్సులు), రాక్‌లు మరియు కాంపాక్టర్‌ల సరఫరాదారులు
3. పాన్ ఇండియా స్థాయిల్లో లేబర్ కాంట్రాక్టర్స్
మరిన్ని వివరాల కోసం, దయచేసి వెబ్‌సైట్‌ను చెక్ చేయండి www.stockholding dms.com/tenders/php
ఏ కారణం చూపకుండానే ఏదైనా లేదా అన్ని ప్రతిపాదనలను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు SDMS కి ఉంది

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
Lr.No.E1/ /2023-24 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 14-09-2023
రూ.76.00 లక్షల మొత్తంతో వివిధ పనులను చేపట్టుటకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి టెండరు షెడ్యూలు దిగువ విధంగా ఉన్నది టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేది: 14-09-2023 మ.3.30 గం. నుండి 20-09-2023 సా.4.30 గం. వరకు కమిషనర్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వారిచే స్వీకరించబడును మరియు టెండర్లను తెరచుట సా.4.31గం.కు కమిషనర్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేదా వారి డిప్యూటీచే తెరువబడుతుంది. తదుపరి వివరాలకొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in ని దర్శించండి లేదా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించు నెం. 7337557261
సం/- కమిషనర్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.6629-PP/CL/Advt/1/2023-24, Dt 14.09.2023

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా
Lr.No.E1/38/2023-24 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 13.09.2023
రూ. 951.00 లక్షల వ్యయంతో (59) నం.ల సివిల్ పనుల కోసం నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 16-09-2023న ఉ. 10.30 గం.లు. కమిషనర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ వారిచే 25-09-2023న ఉ.10.30 గం.ల వరకు టెండరు స్వీకరించబడును. అది 25-09-2023న ఉ. 10.30 గం.లకు కమిషనర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేదా మున్సిపల్ ఇంజనీర్‌చే తెరువబడును. తదుపరి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in దర్శించండి లేదా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించండి. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO No.6619-PP/CL/Advt/1/2023-24, Dt 13.09.2023

hmda హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(G.O.Ms.No.140 MA&UD Dept., తేది: 01.08.2023)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008) లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ఆమోదించబడిన ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లో ఉద్దేశించిన భూమి ఉపయోగానికి సదరు సెక్షన్‌లోని ఉపసెక్షన్ (1) ద్వారా అవసరమైన విధంగా ప్రభుత్వం ఇందుమూలంగా దిగువ తెలిపిన మార్పు చేస్తోంది. G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ఆమోదించబడిన ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031 ప్రకారం యాదాద్రి-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామంలోని సర్వే నం.286/పి, 287/పి, 288, 289, 290/పి, 291/పి, 292, 337/పి, 338 మరియు 339లో ప్రస్తుతం పాక్షిక కన్జర్వేషన్ యూజ్ జోన్ మరియు పాక్షిక మాన్యుఫ్యాక్చరింగ్ యూజ్ జోన్ కోసం కేటాయించబడిన ఎ.103.02 గం. విస్తీర్ణం గల సైట్ ఇప్పుడు రెసిడెన్షియల్ యూజ్ జోన్‌గా నిర్దేశించడమైనది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభిస్తాయి. సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA తరఫున
DIPR RO No.6645-PP/CL/Advt/1/2023-24, Dt 14.09.2023

అనుబంధం - I
తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ
07 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీస్) 2030 వేలం
మొత్తం : రూ.500.00 కోట్లు
జారీ ధర : ప్రతి రూ.10,000.00 లకు రూ.10,000.00
కరెన్సీ : 07 సంవత్సరాలు
రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి : మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 21.09.2023న వ్యాపార వేళల తరువాత తక్షణమే ముగుస్తుంది.
పైన తెలిపిన రుణానికి తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె. రామకృష్ణా రావు
స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్
DIPR RO No.1642-DP/CL/Advt/1/2023-24, Dt: 14.09.2023

మున్సిపల్ కౌన్సిల్ వికారాబాద్ :: వికారాబాద్ జిల్లా
ఇ-మెయిల్: vikarabadmunicipality@gmail.com ఫ్యాక్స్: 08416253429 ఫోన్: 08416252128, 08416200079
No.MCV/E/152/2023 కొటేషన్ నోటీసు తేది: 13.09.2023
దిగువ తెలిపిన పనుల కోసం వికారాబాద్ మున్సిపాలిటీలోని 13MLD సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (STP)కి మరమ్మతులు మరియు సర్వీసింగ్ కోసం స్థానిక అధీకృత ఏజెన్సీలు/సరఫరాదారు/తయారీదారు/కాంట్రాక్టర్స్ నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.

క్ర. సం.	వివరణ	Nos	యూనిట్స్
1.	STP క్లారిఫయర్ రెక్టిఫికేషన్	1	Nos
2.	MBBR-01 వద్ద STP ఫైన్ స్క్రీన్ సర్వీసింగ్ మరియు మరమ్మతులు	1	Nos
3.	STP బెల్ట్ కన్వేయర్ మోటార్ వైండింగ్ & ఇతర మరమ్మతులు	1	Nos
4.	RAW సీవేజ్ పంప్‌లో 70 HP మోటార్ వైండింగ్ మరియు మరమ్మతులు	1	Nos
5.	పైప్‌లైన్‌తో సహా కొత్త వ్యర్థ పంప్‌మోటార్ రీప్లేస్‌మెంట్	2	Nos
6.	మెకానికల్ గ్రిడ్ సెపరేటర్స్, మోటార్ గేర్ బాక్స్ మరమ్మతులు	1	Nos
7.	వ్యర్థ ఫీడ్ పంప్స్ 3 HP మోటార్ మరమ్మతులు	2	Nos
8.	OCT యూనిట్ సర్వీసింగ్	1	LS
9.	పంప్ హౌస్ EOT క్రేన్స్ సర్వీసింగ్	1	LS
10.	OCT EOT క్రేన్స్ సర్వీసింగ్	1	LS

మీరు సీల్డ్ కొటేషన్‌ను 16.09.2023 వరకు దాఖలు చేయవలెను
DIPR RO No. 6601-PP/CL/Advt/1/2023-24, Dt: 14.09.2023 సం/- మున్సిపల్ కమిషనర్, వికారాబాద్ మున్సిపాలిటీ

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
PUB/1048
నోటిఫికేషన్
దిగువ తెలిపిన విధంగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని గతిశక్తి యూనిట్ కోసం నెలవారీ రెమ్యునరేషన్ ప్రాతిపదికన పునర్నియామకం కోసం ఇంజినీరింగ్ మరియు ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ రైల్వే జూనియర్ స్కేల్ ఆఫీసర్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి:

క్ర.సం.	డిపార్ట్‌మెంట్	కేటగిరీ	సిబ్బంది సంఖ్య
1	ఇంజినీరింగ్	జూనియర్ స్కేల్ ఆఫీసర్	01
2	ఎలక్ట్రికల్	జూనియర్ స్కేల్ ఆఫీసర్	01
		మొత్తం	02

సవివరమైన ప్రకటన లభ్యత: www.scr.indianrailways.gov.in > about us > Division > Secunderabad > Personnel > Re-engagement of Retired Railway staff on Secunderbad Division and www.scr.indianrailways.gov.in > News & Recruitment > Recruitment > Notification.
దరఖాస్తులను http://bit.ly/3EAnyp0 ద్వారా దాఖలు చేయవచ్చును
దరఖాస్తు దాఖలుకు చివరి తేది: 23.09.2023
ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే అంగీకరించబడతాయి
A1454 సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, సికింద్రాబాద్

నిందితుడైన వ్యక్తి హాజరు కోరుతూ ప్రకటన
సెక్షన్ 82 Cr.P.C. చూడండి
నిందితుడైన వ్యక్తి శ్రీ మీర్ ఉస్మాన్ అలీ, ప్యారడైజ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ యొక్క ప్రొప్రయిటర్, దారుల్ అమన్ కాంప్లెక్స్, డి.నం.12-2-800/C/9, దిల్షాద్‌నగర్ కాలనీ, రింగ్ రోడ్, మెహిదీపట్నం, హైదరాబాద్-500028 (తెలంగాణ), ఇక్కడ కూడా: 12-02-800/441/3/A, దిల్షాద్‌నగర్ కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాద్-500028 వారిపై P.S. I.P ఎస్టేట్, ఢిల్లీ వద్ద నమోదుకాబడిన N.I. చట్టంలోని సెక్షన్ 138 క్రింద CC No. 7678/17 ప్రకారం నమోదైన కేసులో నేరానికి పాల్పడినారని (లేదా నేరానికి పాల్పడినట్లు అనుమా నించబడినారని) నా సమక్షంలో ఫిర్యాదు చేయబడింది మరియు అది తిరిగి అరెస్ట్ వారెంట్ జారీ చేసేందుకు దారి తీసింది, సదరు నిందితుడైన వ్యక్తి శ్రీ మీర్ ఉస్మాన్ అలీ ఆచూకీ కనుగొనబడలేదని తెలియజేయబడింది మరియు సదరు నిందితుడైన వ్యక్తి శ్రీ మీర్ ఉస్మాన్ అలీ పరారీలో ఉన్నారని (లేదా సదరు వారెంట్ అందుకోకుండా తనకుతాను దాగి ఉన్నారని) నా సంతృప్తి మేరకు చూపబడినది. P.S. I.P ఎస్టేట్, ఢిల్లీ వద్ద నమోదుకాబడిన N.I. చట్టంలోని సెక్షన్ 138 క్రింద CC No. 7678/17 కేసులో సదరు నిందితుడైన వ్యక్తి శ్రీ మీర్ ఉస్మాన్ అలీ సదరు ఫిర్యాదుకు జవాబు చెప్పేందుకు ఈ కోర్టు సమక్షంలో (లేదా నా సమక్షంలో) 05-12-2023న లేదా ఆలోగా హాజరు కావలసిందిగా కోరుతూ ప్రకటన చేయబడింది.
ఉత్తర్వు ద్వారా
Ms. సాక్షి జైస్వాల్
మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, (NI చట్టం) 05, (సెంట్రల్), రూమ్ నెం.2, గ్రౌండ్ ఫ్లోర్, కోర్ట్ బిల్డింగ్ అనెక్స్-I, తీస్ హజారీ కోర్ట్, ఢిల్లీ
DP/9879/CD/2023
(Court Matter)

క్లుప్తంగా...

నైజీరియాలో కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థ

అబూజా: ఆఫ్రికా ఖండంలో అత్యధిక జనాభా కలిగిన దేశమైన నైజీరియాలో గురువారం గాఢాంధకారం అలుముకుంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థ కుప్పకూలడంతో దేశమంతటా కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఉదయం విద్యుత్ ఉత్పత్తి సున్నా మెగావాట్లుగా నమోదైంది. ఆ తర్వాత క్రమంగా కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. నైజీరియాలో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడడం మామూలే. 2022లో ఏకంగా నాలుగు సార్లు గ్రిడ్ కుప్పకూలింది. అయితే, సాంకేతిక కారణాల వల్లే ఈ సమస్య తలెత్తుతోందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, రెండు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను అనుసంధానించే లైన్ అగ్నిప్రమాదానికి గురైందని, అందుకే గ్రిడ్ విఫలమైందని నైజీరియా విద్యుత్ శాఖ మంత్రి అడెబయో అడెలాబూ చెప్పారు.

బిహార్‌లో ఘోరం

పడవ మునగడంతో పది మంది చిన్నారుల గల్లంతు

ముజఫర్‌పూర్(బిహార్): బిహార్‌లో గురువారం పడవ ప్రమాదం సంభవించింది. ముజఫర్‌పూర్ జిల్లాలోని భాగమతి నదిలో పడవ మునిగిపోయిన దుర్ఘటనలో 10 మంది చిన్నారుల ఆచూకీ గల్లంతైంది. 30 మంది చిన్నారులతో వెళ్తున్న ఈ పడవ మధుపూర్ పట్టి ఘాట్ వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. గురువారం జరిగిన ఈ ఘటనలో 20 మంది చిన్నారులను కాపాడగలిగారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేరే ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విషయం తెల్సి దిగ్భ్రాంతి చెందారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా మేజిస్ట్రేట్‌ను ఆదేశించారు. జాతీయ విపత్తు స్పందన దళం, రాష్ట్ర విపత్తు స్పందన దళం రంగంలోకి దిగాయి.

హిందీపై అమిత్ షా సందేశం హాస్యాస్పదం

తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై: హిందీ భాష దేశంలోని ఇతర భాషల వైవిధ్యాన్ని ఏకం చేస్తోందని, అన్ని భాషలను, యాసలను గౌరవిస్తోందని 'హిందీ దివస్' సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సందేశాన్ని తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ గురువారం తప్పుపట్టారు. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అమిత్ షా సందేశం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేవలం నాలుగైదు రాష్ట్రాల్లో మాట్లాడే భాష దేశాన్ని ఎలా ఏకం చేస్తుందని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.



➤ జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో బుధవారం భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆర్మీ కల్నల్, మేజర్, డీఎస్పీ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని సృష్టించింది. ముష్కరుల దుశ్చర్యకు దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ముగ్గురు ఉన్నతాధికారులను బలి తీసుకున్న రాక్షస మూక కోసం వేట ముమ్మరంగా సాగుతోంది. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురి మరణానికి నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) కారణమని ప్రాథమికంగా గుర్తించారు. పాకిస్తాన్ ప్రభుత్వ అండదండలతో ఈ 'ప్రతిఘటన దళం' రాక్షస దళంగా చెలరేగిపోతోంది. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగానికి పెనుసవాలుగా మారింది. భద్రతా సిబ్బందితోపాటు సామాన్య ప్రజలను పొట్టన పెట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో అసలు ఏమిటీ టీఆర్ఎఫ్? దాని పుట్టుపూర్వోత్తరాలేమిటో తెలుసుకుందాం..

రాక్షస మూక

లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్'

ఉగ్ర మూకకు పాకిస్తాన్ సైన్యం, 'ఐఎస్ఐ' అండదండలు..

భారత భద్రతా సిబ్బంది, జమ్మూకశ్మీర్ మైనార్టీలపై టీఆర్ఎఫ్ గురి

జనవరిలో యూఏపీఏ కింద నిషేధం విధించిన భారత ప్రభుత్వం

➤ జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం 2019 ఆగస్టులో రద్దు చేసి పారేసింది. ఈ పరిణామాన్ని ఉగ్రవాదులు ఏమాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన కొంత కాలానికే అదే సంవత్సరం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' పురుడు పోసుకుంది. పురుడు పోసింది లష్కరే తోయిబా నాయకత్వమే. నిఘా వర్గాలకు దొరక్కుండా ఆన్‌లైన్ ద్వారా సభ్యులను చేర్చుకోవడం, నిధులను సేకరించడం మొదలుపెట్టారు. ఇతర ఉగ్రవాద ముఠాల్లోని కొందరు సభ్యులు సైతం టీఆర్ఎఫ్‌లో చేరిపోయారు. పాకిస్తాన్ సైన్యంతోపాటు పాకిస్తాన్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' మద్దతు కూడా దొరకడంతో కశ్మీర్ లోయలో టీఆర్ఎఫ్ అత్యంత చురుగ్గా మారిపోయింది. కార్యకలాపాలను ఉధృతం చేసింది. పదుల సంఖ్యలో ఉగ్రవాద దాడులకు పాల్పడింది. టీఆర్ఎఫ్ ప్రధాన లక్ష్యం భారత జవాన్లు, జమ్మూకశ్మీర్‌లోని మైనార్టీలే. కశ్మీరీ పండిట్లను అంతం చేయడమే ధ్యేయంగా దాడులకు దిగుతోంది.

టార్గెట్ కశ్మీరీ పండిట్లు..

➤ టీఆర్ఎఫ్ అరాచకాలు పెరిగిపోతుండడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) కింద ఈ ఏడాది జనవరిలో టీఆర్ఎఫ్‌పై నిషేధం విధించింది. సంస్థ కమాండర్ షేక్ సజ్జాద్ గుల్‌ను యూఏపీఏలోని నాలుగో షెడ్యూల్ కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని రోజ్ అవెన్యూ కాలనీకి చెందిన షేక్ సజ్జాద్ గుల్ చిన్నప్పటి నుంచి ఉగ్రబాట పట్టాడు. 2018 జూన్‌లో జరిగిన కశ్మీరీ జర్నలిస్టు షుజాత్ బుఖారీ హత్య వెనుక అతడి హస్తం ఉన్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. టీఆర్ఎఫ్ లష్కరే తోయిబాకు అనుబంధంగా వ్యవహరిస్తోందని రాజ్యసభలో కేంద్ర హోంశాఖ ప్రకటించింది. భద్రతా సిబ్బందిని, మైనార్టీలను హత్య చేయడంతోపాటు పాకిస్తాన్ భూభాగం నుంచి ఆయుధాలు, మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతోందని, అక్కడి నుంచి ఉగ్రవాదులను భారత్‌లోకి చేరవేస్తోందని వెల్లడించింది.

పాక్ నుంచి ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్

ఎందుకు సృష్టించారు?

ఉగ్రవాదులకు నిధులు అందజేస్తున్నందుకుగాను పాకిస్తాన్‌ను పారిస్‌కు చెందిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో చేర్చింది. దీంతో నిషేధిత ఉగ్రవాద సంస్థలకు నేరుగా నిధులు అందించే మార్గం మూసుకుపోయింది. నిధులు ఆగిపోవడంతో లష్కరే తోయిబా, దాని అధినేత హాఫీజ్ సయీద్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. అందుకే లష్కరే తోయిబాకు అనుబంధంగా ద రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను సృష్టించారు. పాకిస్తాన్ సర్కారు నేరుగా టీఆర్ఎఫ్‌కు నిధులు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ఉగ్రవాద సంస్థ అని గానీ, మతపరమైన సాయుధ దళం అని గానీ చెప్పకుండా స్థానిక ప్రతిఘటన దళంగా మభ్యపెట్టడానికి టీఆర్ఎఫ్ అని నామకరణం చేసినట్లు స్పష్టమవుతోంది.

ఉధృతంగా చేరికలు..

ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2022లో జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు 90కిపైగా ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 42 మంది విదేశీ ఉగ్రవాదులు సహా మొత్తం 172 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో 108 మంది టీఆర్ఎఫ్‌కు చెందినవారే కావడం గమనార్హం. అలాగే 2022లో దాదాపు 100 మంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరగా, వీరిలో ఏకంగా 74 మంది కేవలం టీఆర్ఎఫ్‌లోనే చేరడం గమనార్హం. దీన్నిబట్టి టీఆర్ఎఫ్ నుంచి ఎదురవుతున్న ముప్పును అర్థం చేసుకోవచ్చు.




నిషేధించిన మరుసటి రోజే 'హిట్ లిస్ట్'..

➤ భారత్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 44 ఉగ్రవాద సంస్థలను ప్రభుత్వం యూఏపీఏ కింద నిషేధించింది. వీటన్నింటిలో టీఆర్ఎఫ్ అత్యంత చురుగ్గా పని చేస్తున్నట్లు గుర్తించారు. నిషేధం విధించిన మరుసటి రోజే ఈ సంస్థ 'హిట్ లిస్ట్' విడుదల చేసింది. అందులో ఉన్న వ్యక్తులందరినీ అంతం చేస్తామని హెచ్చరించింది. సామాన్య యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించడానికి టీఆర్ఎఫ్ సోషల్ మీడియాను ఉపయోగించుకుంటోంది. 'సైకలాజికల్ ఆపరేషన్లు' చేస్తోంది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారిని ప్రేరేపిస్తోంది. యువకుల మనసు మార్చేసి ఉగ్రవాదులుగా తయారు చేస్తోంది. టీఆర్ఎఫ్ జమ్మూకశ్మీర్‌లోని మైనార్టీ సిక్కులను కూడా లక్ష్యంగా చేసుకుంది. ప్రత్యేక పోలీసు అధికారులుగా(ఎస్పీఓ) పనిచేస్తున్న సిక్కు యువకులపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఏజెంట్లు అనే ముద్ర వేస్తోంది. టీఆర్ఎఫ్ దాడుల్లో సిక్కులు సైతం బాధితులుగా మారుతున్నారు. టీఆర్ఎఫ్ ముష్కరులు భారత భద్రతా దళాలపై యుద్ధమే సాగిస్తున్నారని చెప్పొచ్చు. అధునాతన ఆయుధాలతో భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకొని కాల్పులకు పాల్పడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

జ్యుడీషియల్ డేటా గ్రిడ్‌లో 'సుప్రీం' సమాచారం

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అందుబాటులోకి: సీజేఐ



న్యూఢిల్లీ: జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్(ఎన్‌జేడీజీ)తో సుప్రీంకోర్టు కేసుల వివరాలు అనుసంధానించారు. ఇకపై సుప్రీంకోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తాజా సమాచారం ఎప్పటికప్పుడు కక్షిదారులుసహా అందరూ చూడొచ్చు. ఈ వివరాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గురువారం సర్వోన్నత న్యాయస్థానం కోర్టు రూమ్‌లో వెల్లడించారు. తాలూకా స్థాయి నుంచి సుప్రీంకోర్టు దాకా ఏ కోర్టులో ఎన్నెన్ని కేసుల విచారణ పూర్తయింది, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి అనేదంతా తెల్సిపోతుంది. ' ఇదో చిన్న ప్రకటనే. కానీ ఈ రోజు చరిత్రాత్మకమైన రోజు. ఎన్ఐసీ బృందం, సుప్రీంకోర్టు టీమ్ కలిసి ఈ వేదికను అభివృద్ధిచేశాయి. సంవత్సరాలవారీగా, రిజిస్టర్ అయిన, రిజిస్టర్‌కాని, కోరమ్ వారీగా ఇలా భిన్న విధాలుగా కేసుల వివరాలు పొందొచ్చు. 62,946 సివిల్ కేసులు, 16,555 క్రిమినల్ కేసులు మొత్తంగా 80,501 పెండింగ్ కేసులు ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు ఎదురుచూస్తున్నాయి. అన్ని వివరాలను వెబ్‌పేజీలు అందిస్తాయి. ఎన్‌జేడీజీలో సమాచారం అప్‌లోడ్ ద్వారా న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత ఇనుమడిస్తుంది' అని సీజేఐ చెప్పారు. 585 కేసులను త్రిసభ్య ధర్మాసనాలకు అప్పజెప్పాల్సి ఉంది. త్వరలోనే ఆయా ధర్మాసనాలను ఏర్పాటుచేస్తానని సీజేఐ పేర్కొన్నారు. 'స్వేచ్ఛా సమాచార పాలసీ'లో భాగంగానే ఇవన్నీ అమల్లోకి తెస్తున్నట్లు చెప్పారు. ఎన్‌జేడీజీలో 18,735 జిల్లా, సబార్డినేట్ కోర్టులు, హైకోర్టుల సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. ఈ–కోర్ట్స్ ప్రాజెక్టు కింద దీనిని ఏర్పాటుచేశారు. కక్షిదారులకు వెబ్ సేవల ద్వారా అన్ని హైకోర్టులు ఎన్‌జేడీజీతో అనుసంధానమయ్యాయి. వేర్వేరు రకాల కేసులు సంవత్సరాలవారీగా ఈ పోర్టల్‌లో ఒక్క క్లిక్‌తో చూసుకోవచ్చు. కేసుల సంబంధ సమస్త సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా పొందొచ్చు.

పారదర్శకతలో పై మెట్టు: మోదీ

' సుప్రీంకోర్టు, సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ వేసిన గొప్ప ముందడుగు ఇది. అధునాతన సాంకేతికతతో న్యాయవితరణలో, న్యాయవ్యవస్థలో పారదర్శకత మరో మెట్టు పైకి ఎక్కింది' అంటూ ఎన్‌జేడీజీలో సుప్రీంకోర్టు అనుసంధానాన్ని ప్రధాని మోదీ శ్లాఘించారు.

మూడొంతుల మందిని సాగనంపుతా!

ఎఫ్‌బీఐ వంటి ప్రధాన దర్యాప్తు సంస్థల్నీ మూసేస్తా: : వివేక్ రామస్వామి



వాషింగ్టన్: తాను అధ్యక్షుడినైతే అమెరికా ప్రభుత్వంలోని ముప్పావు వంతు ఉద్యోగులను ఇంటికి పంపిస్తానని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న వివేక్ రామస్వామి సంచలన ప్రకటన చేశారు. భారతీయ మూలాలున్న వివేక్.. అమెరికన్ వార్తా వెబ్‌సైట్ యాక్సియస్‌కు ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో పలు విషయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ' రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం సాధించి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచి అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చుంటే వెంటనే నా పని మొదలుపెడతా. దేశవ్యాప్తంగా విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బందిలో 75 శాతం మందిని ఉద్యోగాల నుంచి తీసేస్తా. ఇన్ని లక్షల మంది సిబ్బంది అమెరికా సర్కార్‌కు పెనుభారం. ఇక ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) వంటి ప్రధాన దర్యాప్తు సంస్థలను మూసేస్తా. విద్య, ఆల్కాహాల్, పొగాకు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, అణు నియంత్రణ కమిషన్, అంతర్గత ఆదాయ సేవలు, వాణిజ్య శాఖల ప్రక్షాళనకు కృషిచేస్తా. అధ్యక్షుడిగా తొలి ఏడాది పూర్తయ్యేలోపు సగం మంది ప్రభుత్వ ఉద్యోగులను ఇంటికి సాగనంపుతా. మిగతా సగం మందిలో 30 శాతం మందితో వచ్చే ఐదేళ్లలో పదవీ విరమణ చేయిస్తా. ఇందులో అనుమానమేమీ లేదు. పిచ్చిపని అస్సలుకాదు' అని 38 ఏళ్ల వివేక్ అన్నారు. ప్రస్తుతం అమెరికాలో 22.5 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 75 శాతం మందిని అంటే దాదాపు 16 లక్షల మందిని వచ్చే నాలుగేళ్లలో ఉద్యోగాల నుంచి తీసేస్తానని వివేక్ లెక్కచెప్పారు. ఇన్ని లక్షల మందిని తీసేస్తే ప్రభుత్వంపై వేతన భారం భారీగా తగ్గుతుందని ఆయన అభిప్రాయం.

సనాతన ధర్మాన్ని అంతం చేసేందుకు కుట్రలు

ప్రతిపక్ష కూటమిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం

- 'ఇండియా'.. దురహంకారి కూటమి
- దేశాన్ని బానిసత్వంలోకి నెట్టివేయాలని చూస్తున్నారు
- మనం ఐక్యంగా ఉంటే కుట్రదారుల ఆటలు సాగవు
- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన

బీనా/రాయ్‌గఢ్: ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని దురహంకారి కూటమిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని ఇండియా కూటమి లక్ష్యంగా పెట్టుకుందని, వెయ్యి సంవత్సరాల బానిసత్వంలోకి దేశాన్ని నెట్టివేయాలని చూస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతమైందని, ఈ ఘనత 140 కోట్ల మంది భారతీయులకు దక్కుతుందని పేర్కొన్నారు. ఈ విజయం దేశ ప్రజల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పారు. త్వరలో శాసనసభ ఎన్నికలు జరుగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ గురువారం పర్యటించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లాలోని బీనా రిఫైనరీలో రూ.49 వేల కోట్లతో నిర్మించే పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. దాంతోపాటు మరో 10 పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్ జిల్లా కొండతరాయి గ్రామంలో 'విజయ్ శంఖనాథ్' సభలోనూ మాట్లాడారు. రెండు సభల్లో ఆయన ఏం చెప్పారంటే...

కుట్రలను అడ్డుకోవాలి

''దురహంకారి కూటమి ఇటీవలే ముంబైలో సమావేశమైంది. ఆ కూటమికి ఒక విధానం లేదు, ఒక నాయకుడు లేడు. సనాతన ధర్మంపై దాడి చేసి, నాశనం చేయాలన్న రహస్య ఎజెండా మాత్రమే ఉంది. సనాతన ధర్మం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తి పొందారు. స్వాతంత్య్రం కోసం ఆయన సాగించిన పోరాటం సనాతన ధర్మం చుట్టూ కేంద్రీకృతమైంది. మహాత్ముడు జీవితాంతం సనాతన ధర్మాన్ని పాటించారు. ఆయన చివరిసారిగా 'హే రామ్' అంటూ నెలకొరిగారు. రాణి అహిల్యాబాయి హోల్కర్, ఝాన్సీ లక్ష్మీబాయి, స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్ వంటి మహనీయులు సనాతన ధర్మ నుంచి స్ఫూర్తి పొంది ముందుకు నడిచారు. విపక్ష కూటమి నాయకులు బహిరంగంగా మాట్లాడడం ప్రారంభించారు. వారు మనపై దాడికి పదును పెడుతున్నారు. దేశంలో సనాతన ధర్మాన్ని ఆచరించే ప్రతి ఒక్కరూ, దేశాభిమానులు ఈ విషయం గమనించాలి. అప్రమత్తంగా ఉండాలి. సనాతన ధర్మాన్ని నిర్మూలించేందుకు సాగుతున్న కుట్రలను మనమంతా కలిసికట్టుగా అడ్డుకోవాలి. మనం ఐక్యంగా ఉంటే వారి ఆటలు సాగవు. వారి ప్రయత్నాలనీ విఫలమవుతాయి.

మన లక్ష్యం 'ఆత్మనిర్భర్ భారత్'

జీ20 సదస్సు విజయంతో దేశ ప్రజల హృదయాలు గర్వంతో ఉప్పొంగుతున్నాయి. ఈ ఘనత మోదీకి కాదు, ముమ్మాటికీ 140 మంది భారతీయులదే. చిన్నపిల్లలకు కూడా జీ20 గురించి తెలిసింది. బృంద స్ఫూర్తితో పని చేయడం వల్ల ఈ సదస్సు విజయవంతమైంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ చాలా ఏళ్లు అధికారంలో ఉంది. కానీ, ఆ పార్టీ చేసిందేమీ లేదు. అవినీతికి, నేరాలకు పాల్పడడంతోనే కాంగ్రెస్‌కు సమయం సరిపోయింది. కాంగ్రెస్ హయాంలో నేరగాళ్లు రాజ్యమేలారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకివచ్చాక అవినీతి అంతమైంది. సుపరిపాలన కొనసాగుతోంది. పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామివేత్తలు తరలివస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించుకోవాలి. పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తుల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి మారాలి. దిగుమతులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. స్వయం స్వావలంబన దిశగా బీనా రిఫైనరీ ఒక ముందడుగు అవుతుంది.



బీనా రిఫైనరీలో శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

దళారుల ప్రమేయాన్ని అంతం చేశాం

బానిస మనస్తత్వం నుంచి దేశం బయట పడింది. 'న్యూ ఇండియా' సగర్వంగా ముందడుగు వేస్తోంది. ప్రభుత్వ పథకాల అమలులో దళారుల ప్రమేయాన్ని అంతం చేశాం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అర్హులైన రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నాం. ఈ పథకం కింద ఇప్పటిదాకా రూ.2.60 లక్షల కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమచేశాం. వ్యవసాయ రంగంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడానికి కృషి చేస్తున్నాం. రైతులపై భారం తగ్గిస్తున్నాం. ఎరువులను చౌకగా అందజేయడానికి సబ్సిడీ రూపంలో గత తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లకుపైగా వెచ్చించాం. అమెరికాలో ఒక యూరియా సంచి ధర రూ.3,000 ఉంది. మన దగ్గర మాత్రం రైతులకు కేవలం రూ.300కే లభిస్తోంది. దేశంలో గత నాలుగేళ్లలో కొత్తగా 10 కోట్ల కుటుంబాలకు కుళాయి నీటి కనెక్షన్లు ఇచ్చాం. మొఘల్ రాజులపై పోరాటం చేసిన గిరిజన పాలకురాలు రాణి దుర్గావతి 500వ జయంతి వేడుకలను అక్టోబర్ 5న ఘనంగా నిర్వహిస్తాం.

'ఇండియా' పట్ల జాగ్రత్త

భారత్‌ను, ప్రాచీన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కనుమరుగు చేయాలని చూస్తున్న విపక్ష 'ఇండియా' కూటమి కుయుక్తుల పట్ల ప్రజలు నిత్యం జాగరూకులై ఉండాలి. మన దేశానికి, మన విశ్వాసాలకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోంది. కొందరు వ్యక్తులు అధికారం నుంచి దూరమయ్యాక ప్రజల పట్ల ద్వేషం పెంచుకున్నారు. అందుకే ప్రజల గుర్తింపుపై, సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దేశంలో వేలాది సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్నదే వారి అసలు లక్ష్యం. సనాతన ధర్మం వ్యక్తుల జన్మకు కాదు, వారి కర్మ(చేసే పనులు) ప్రాధాన్యం ఇస్తుంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

14 మంది టీవీ యాంకర్లపై 'ఇండియా' బహిష్కరణ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి 14 మంది టీవీ యాంకర్లు, జర్నలిస్టులను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకుంది. వివిధ వేదికలపై, చానళ్లలో వారి కార్యక్రమాలను తాము హాజరుకాబోమని గురువారం ప్రకటించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అధికార బీజేపీ తప్పుపట్టింది. దీన్ని అత్యవసర పరిస్థితి నాటి పరిణామాలతో పోల్చింది. అలాగే న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బీడీఏ) సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య విరుద్ధంగా నడుచుకోవడం సమంజసం కాదని పేర్కొంది. 14 మంది టీవీ యాంకర్లు, జర్నలిస్టుల కార్యక్రమాలకు హాజరు కారాదంటూ బుధవారం జరిగిన తమ కూటమి సమన్వయ కమిటీ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు విపక్ష కూటమి మీడియా కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సదరు యాంకర్లు, జర్నలిస్టుల పేర్లను సైతం విడుదల చేసింది.

మృతుల సంఖ్య 20 వేలు చేరుకోవచ్చు!

డెర్నా సిటీ మేయర్ అనుమానం

డెర్నా: వరదలు, రెండు డ్యామ్‌ల నేలమట్టంతో జనావాసాలపైకి జల ఖడ్గం దూసుకొచ్చి వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన లిబియాలో పరిస్థితి కుదుటపడలేదు. డేనియల్ తుపాను మిగిల్చిన విషాదం నుంచి డెర్నా నగరం తేరుకోలేదు. అక్కడ ఇంకా వేలాది మంది ఆచూకీ గల్లంతైంది. 5,500 మందికిపైగా చనిపోయారని అధికారులు ప్రకటించగా మృతుల సంఖ్య 20,000కు చేరుకోవచ్చని సిటీ మేయర్ అబ్దెల్ మోనియమ్ అల్ ఘైతీ అనుమానం వ్యక్తంచేశారు.

ఉగ్రవాదులను చుట్టుముట్టాం

జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రకటన

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ముగ్గురు ఉన్నతాధికారుల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదుల కోసం భద్రతా సిబ్బంది గాలింపు చర్యలు ఉధృతం చేశారు. లష్కరే తోయిబా, దాని అనుబంధ సంస్థకు చెందిన ఇద్దరు ముష్కరులను చుట్టుముట్టామని జమ్మూకశ్మీర్ పోలీసుల ప్రకటన గురువారం ప్రకటించారు. వారిని బంధించడానికి అనంత్‌నాగ్ జిల్లా కోకెర్‌నాగ్‌లో ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు.

టైమ్ 100 నవ్య సారథుల జాబితాలో హర్మన్‌ప్రీత్

న్యూయార్క్: భిన్న రంగాల్లో విశేష కృషిచేస్తూ ప్రపంచ గతిని మార్చే కొత్త తరం సారథుల జాబితా అంటూ ప్రఖ్యాత మ్యాగజైన్ టైమ్ తీసుకొచ్చిన జాబితాలో భారతీయ మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ స్థానం దక్కించుకున్నారు. 2023 టైమ్ 100 నెక్స్ట్: ది ఎమర్జింగ్ లీడర్స్ షేపింగ్ ది వరల్డ్ పేరిట 100 పేర్లతో ఈ జాబితాను సిద్ధంచేశారు. 'ఆటలో పోటీతత్వం, రగిలిపోయే క్రీడాసక్తితో హర్మన్‌ప్రీత్.. మహిళా క్రికెట్‌ను ప్రపంచంలో విలువైన క్రీడా ఆస్తిగా మలిచారు' అని టైమ్ పొగిడింది. క్షయ వ్యాధి సోకడంతో అతిగా ఔషధాలు వాడి, వాటి దుష్ప్రభావంతో వినికిడి శక్తిని కోల్పోయినా మెరుగైన డ్రగ్ కోసం పోరాడి విజయం సాధించిన నందితా వెంకటేశన్ పేరూ ఈ జాబితాలో ఉంది. ఈమె కృషి ఫలితంగానే భారత్‌లో క్షయ చికిత్సకు మరింత మెరుగైన జనరిక్ మందులు అందుబాటులోకి వచ్చాయి. పర్యావరణహిత నిర్మాణాలతో మంచి పేరు తెచ్చుకున్న వినూ డేనియల్ పేరూ ఈ జాబితాలో ఉంది.

సింగపూర్ అధ్యక్ష పీఠంపై షణ్ముగరత్నం

సింగపూర్: అంతర్జాతీయ రాజకీయాల్లో మరో భారతీయుడు పతాకశీర్షికలకెక్కారు. సింగపూర్ నూతన అధ్యక్షుడిగా భారతీయ మూలాలున్న ఆర్థికవేత్త థర్మాన్ షణ్ముగరత్నం గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల ముగిసిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన పోటీదారులైన చైనా మూలాలున్న ఎంగ్‌కోక్ సాంగ్(15.72 శాతం ఓట్లు), తన్‌కిన్ లియాన్ (13.88 శాతం)లను వెనక్కి నెట్టేసి ఏకంగా 70.4 శాతం ఓట్లు సాధించి షణ్ముగరత్నం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. అధ్యక్ష భవనం ఇస్టానాలో ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి, భారతీయ మూలాలున్న జడ్జి సుందరేశ్ మీనన్ ఈయనతో అధ్యక్షుడిగా ప్రమాణం చేయించారు. బహుళ జాతుల, సమ్మిళిత సమాజాభివృద్ధికి కృషిచేస్తానని అధ్యక్ష హోదాలో షణ్ముగరత్నం హామీ ఇచ్చారు. 66 ఏళ్ల షణ్ముగరత్నం ఆరేళ్లపాటు అధ్యక్షునిగా పాలన కొనసాగిస్తారు.

పార్టీ ఎంపీలకు బీజేపీ, కాంగ్రెస్ విప్‌ల జారీ

ప్రత్యేక సమావేశాలు జరిగే ఐదు రోజులూ కచ్చితంగా హాజరుకావాలని ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు హాజరు కావాలని తమ పార్లమెంట్ సభ్యులకు బీజేపీ విప్ జారీ చేసింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ ప్రత్యేక సమావేశానికి, వివిధ విషయాలపై ప్రభుత్వ వైఖరికి మద్దతు ఇవ్వడానికి ఎంపీలందరూ తప్పనిసరిగా సభలో ఉండాలని విప్‌లో ఆదేశించింది. ఈ ప్రత్యేక సమావేశాల్లో 75 సంవత్సరాల పార్లమెంటు ప్రయాణంపై ప్రత్యేక చర్చతో పాటు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో రెండు బిల్లులను, రాజ్యసభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక బిల్లు పార్లమెంట్ ముందుకు రానుంది. ఇప్పటికే ఈ బిల్లును వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ పాత భవంతిలో సమావేశాలు మొదలుపెట్టి కొత్త భవంతిలో ముగిస్తారని సమాచారం.

కాంగ్రెస్ సైతం

ఈ ప్రత్యేక సమావేశాల్లో ఎజెండాతో సంబంధం లేకుండా అనూహ్యంగా కొత్త బిల్లులను మోదీ సర్కార్ తీసుకురావచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. బలం మేరకు ఆ బిల్లులను అడ్డుకోవాలని కంకణం కట్టుకుంది. అందుకే తమ పార్టీ ఎంపీలంతా ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ విప్ జారీచేసింది. ' సెప్టెంబర్ 18వ తేదీ ఉదయం 11 గంటలుమొదలు 22వ తేదీ ఇరుసభలు నిరవధిక వాయిదా పడేదాకా పార్టీ నిర్ణయాన్ని ఉమ్మడిగా వినిపించేందుకు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా రావాలి' అంటూ కాంగ్రెస్ విప్ జారీచేసింది. రాజ్యసభలో ఆమోదం పొందిన లోక్‌సభలో న్యాయవాదుల(సవరణ)బిల్లు–2023, ప్రెస్, పిరియాడికల్స్‌రిజిస్ట్రేషన్ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

నిఫాపై నిరంతర నిఘా

కేరళకు చేరిన యాంటీవైరల్ ఔషధాలు

తిరువనంతపురం: ప్రాణాంతక నిఫా వైరస్ మళ్లీ రాష్ట్రంలో వెలుగుచూడటంతో కేరళ రాష్ట్రం అప్రమత్తమైంది. నిఫా వ్యాధిగ్రస్తులకు చికిత్సలో వినియోగించేందుకు కావాల్సిన యాంటీవైరల్ ఔషధాలు కేరళకు చేరుకున్నాయని రాష్ట్ర సర్కార్ వెల్లడించింది. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖతో రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ' నిఫాకు ఉన్న ఏకైక యాంటీవైరల్ చికిత్స.. మోనోక్లోనల్ యాంటీబాడీలే. అందుకే వాటిని హుటాహుటిన రాష్ట్రానికి తెప్పించాం. కోజికోడ్ జిల్లాలో నిఫా వెలుగుచూడడంపై ఆందోళన వద్దు. జిల్లాలోని ప్రజానీకం సరైన నివారణ చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటే సమస్య నుంచి గట్టెక్కగలం' అని రాష్ట్ర ఆరోగ్య శాఖ మహిళా మంత్రి వీణ జార్జ్ వ్యాఖ్యానించారు. కోజికోడ్ జిల్లాలో వ్యాపించిన వైరస్ కారణంగా ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఇన్ఫెక్షన్ రేటు తక్కువ ఉన్నాసరే మరణాల రేటు ఎక్కువ ఉండటంతో కేంద్ర ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. పుణె నుంచి వైరాలజీ నిపుణుల బృందాన్ని రాష్ట్రానికి పంపిన విషయం తెల్సిందే. 24 ఏళ్ల ఆరోగ్య కార్యకర్తకు నిఫా సోకడంతో ఇప్పటిదాకా వైరస్ బారిన పడిన వారి సంఖ్య ఐదుకు చేరింది. వీరిలో ఇద్దరు మరణించారు. కోజికోడ్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో అన్ని విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. కోజికోడ్ జిల్లా మాత్రమేకాదు ఇలాంటి ఇన్ఫెక్షన్ల బారిన రాష్ట్రం మొత్తం పడే వాతావరణం అక్కడ ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధనా మండలి ప్రకటించాయని కేరళ సర్కార్ పేర్కొంది. బుధవారం సాయంత్రం నాటికి కోజికోడ్‌లో 11 వార్డులను కంటైన్మెంట్ జోన్లుగా ప్రకటించారు.



GOVERNMENT OF TAMILNADU
TRUTH ALONE TRIUMPHS



ప్రారంభోత్సవం

కలైంజర్ మగళిర్ ఉరిమై తిట్టం

ప్రారంభించువారు

శ్రీ ఎం.కె. స్టాలిన్ గారు

గౌరవనీయ తమిళనాడు ముఖ్యమంత్రి వర్యులు

15.09.2023 శుక్రవారం, ఉ.10.00 గం.లకు
తమిళనాడు అంతటా

నెలకు రూ.1,000/-

1 కోటి మంది
మహిళలకు లబ్ధి చేకూరుతుంది



**ఇది ఉదార కానుక కాదు;
మీ హక్కుల గుర్తింపు!**

DIPR/1047/Display/2023

tndiprnews tndipr tndipr TN DIPR www.dipr.tn.gov.in/

శివ్ దాస్ మీనా, ఐ.ఎ.ఎస్.
ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా...

నల్లగొండ నుంచే పోటీ చేస్తా: కోమటిరెడ్డి

50 వేల మెజార్టీతో గెలుస్తా



సాక్షి, యాదాద్రి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నుంచి పోటీ చేసి 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ పక్కా గెలుస్తుందని ధీమావ్యక్తం చేశారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కేసీఆర్ కొంగర కలాన్‌లో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి సభ ఏర్పాటు చేస్తే 4 లక్షల మంది కూడా రాలేదన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హాజరయ్యే సభకు 10 లక్షల మంది వస్తారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం తెలంగాణను అప్పుల పాలుచేసి లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆరోపించారు. వేలసంఖ్యలో ప్రభుత్వస్కూళ్లను మూసివేసి ఇప్పటివరకు టీచర్ నియామకాలను చేపట్టలేకపోయారని కేసీఆర్‌పై మండిపడ్డారు. ఎమ్మెల్యేలకు పథకాల లబ్ధిదారుల ఎంపిక అధికారాలు ఉంటాయా? అని ప్రశ్నించారు. ఇప్పటివరకు అఖిల పక్షసమావేశం నిర్వహించని ఏకైక సీఎం కేసీఆరే అని ధ్వజమెత్తారు. కొండ పోచమ్మ సాగర్ ద్వారా సీఎం ఫామ్ హౌస్‌కు నీళ్లు పోతున్నాయే తప్ప పక్కనే ఉన్న బస్వాపూర్‌కు రావడం లేదన్నారు. విద్యుత్ శాఖ నిర్వహణ సక్రమంగా లేక యాదాద్రి జిల్లా నాగారంలో విద్యుదాఘాతంతో భార్య భర్తలు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో అపోహలు సృష్టించే యత్నం: కేవీపీ



సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా 'రైతే రాజైతే' పుస్తకావిష్కరణ సమయంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ, తెలంగాణ కాంగ్రెస్ కేడర్‌లో అపోహలు సృష్టించే ప్రయత్నం జరుగుతున్నదని మాజీ ఎంపీ కేవీపీ.రామచంద్రారావు తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశమున్న కాంగ్రెస్‌ను దెబ్బ తీసే వ్యూహంతో చోటా మోటా నాయకుల నుంచి బీఆర్ఎస్ అగ్ర నాయకులు తనను బూచిగా చూపిస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. 1970 నుంచి కాంగ్రెస్ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్న తాను పార్టీకి నష్టం కలిగించే పనులు ఇప్పటి వరకు చేయలేదని, ఎప్పుడూ చేయనని వివరించారు. తనను విమర్శిస్తున్న వారి వలలో పడి ఆవేశంతో ప్రతివిమర్శలు చేసే కుసంస్కారం తనది కాదన్నారు. సీడబ్ల్యూసీ సమావేశం హైదరాబాద్‌లో మొదటిసారిగా జరపాలన్న నిర్ణయం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పండగ లాంటిదని చెప్పారు.

బీఆర్ఎస్‌కు 'ఆరెపల్లి' రాజీనామా



విద్యానగర్ (కరీంనగర్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు ఆరెపల్లి మోహన్ బీఆర్ఎస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరులతో తన రాజీనామాకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన తాను బీఆర్ఎస్ పార్టీ ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, బంగారు తెలంగాణ సాకారం అవుతుందని ఆ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. అయితే రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. మానకొండూరు నియోజకవర్గం, కరీంనగర్ జిల్లా అభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలనే తపనతో అధికార పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. తన అభిమానులు, కార్యకర్తలతో చర్చించి త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ వెల్లడిస్తానని పేర్కొన్నారు.

25 స్థానాల్లో 'బీసీ రాజ్యాధికార సమితి' పోటీ

రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్



సుందరయ్య విజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ రాజ్యాధికార సమితి 25 స్థానాల్లో పోటీ చేస్తుందని రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ స్పష్టం చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేసి తమ సత్తాను చాటుతామన్నారు. బీసీలంతా చైతన్యమై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు దొంత ఆనందం, ప్రధాన కార్యదర్శి సుతారి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఈడీ నోటీసు కాదు.. మోదీ నోటీసు

▶ మొదటి పేజీ తరువాయి

సూచనల మేరకు ముందుకు వెళతామని చెప్పారు. ఈడీ నోటీసుల నేపథ్యంలో ఆమె గురువారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ''రాజకీయ కక్షతోనే ఈడీ నోటీసులు ఇచ్చారు. వీటికి భయపడే ప్రసక్తే లేదు. టీవీ సీరియల్ మాదిరిగా ఏడాది కాలం నుంచి సాగదీస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మరో కొత్త ఎపిసోడ్ రిలీజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 2జీ స్పెక్ట్రం కేసు సైతం ఇంతకాలం సాగలేదు..'' అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. లిక్కర్ కుంభకోణం, ఈడీ నోటీసులు బీజేపీ ఎన్నికల స్టంట్ అని వ్యాఖ్యానించారు.

బీజేపీకి ఈ జిమ్మిక్కులు అలవాటే..

ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుంటే ఆ రాష్ట్రంలో ఇలాంటి జిమ్మిక్కులు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని కవిత ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు భయపడుతున్నాయన్నారు. తెలంగాణలో కేసీఆరే మరోసారి సీఎం కాబోతున్నారని పేర్కొన్నారు. దేశ ప్రజలు కూడా కేసీఆర్ విషయంలో సానుకూలంగా ఉన్నారని చెప్పారు. రాజకీయ పార్టీలు, నాయకులపై అనేక రకాల ఆరోపణలు వస్తూనే ఉంటాయని.. బీఆర్ఎస్ ఏ పార్టీకి కూడా బీ టీమ్ కాదని స్పష్టం చేశారు. బీజేపీకి బీ టీమ్ అని కాంగ్రెస్, మరోవైపు కాంగ్రెస్‌కు బీ టీమ్ అని బీజేపీ కావాలనే తప్పుడు చేస్తున్నాయని విమర్శించారు. కొందరు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, కానీ తామేమిటో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.

అన్నింటా కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

అన్ని ముఖ్యమైన అంశాల్లో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కవిత మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లద్దాఖ్ పర్యటనలో అదానీని విమర్శించారని, అదే రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అదానీతో కలసి ప్రాజెక్టులు చేస్తోందని విమర్శించారు. డిక్లరేషన్ల పేరిట తెలంగాణలో హామీలు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ.. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని వ్యాఖ్యానించారు. సీడబ్ల్యూసీ సమావేశం కోసం రాష్ట్రానికి వస్తున్న కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఇక దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రంలో కాకుండా ఢిల్లీలో ఈ హామీ అమలు కోసం దీక్ష చేయాలని సూచించారు.

లిక్కర్ స్కాం.. మళ్లీ తెరపైకి!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రచారం మొదలైంది. కొన్నినెలల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈడీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న దానిపై చర్చ మొదలైంది.

బీజేపీ గ్రాఫ్ తగ్గినందుకే!: బీఆర్ఎస్ నేతలు

ఢిల్లీ లిక్కర్ కేసు సమసిపోయినట్టేనన్న అభిప్రాయం నెలకొన్న తరుణంలో తాజాగా ఈడీ నోటీసులివ్వడం బీఆర్ఎస్ శ్రేణుల్లో కలకలం రేపుతోంది. ఎమ్మెల్సీ కవితను ఇప్పటికే మూడు పర్యాయాలు విచారించినా.. మళ్లీ విచారణ కోసం ఢిల్లీ రావాలనడం వెనుక బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టేందుకే ఈ నోటీసులు జారీ చేసిందని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ బాగా తగ్గిందనే ప్రచారం, ఆ పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. బిల్లు ఆమోదానికి కృషి చేయాలంటూ ఇటీవలే 47 రాజకీయ పార్టీల నేతలకు లేఖలు కూడా రాశారు. ఈ క్రమంలో కవితపై ఒత్తిడి తెచ్చేందుకే ఈడీ విచారణను తెరపైకి తెచ్చారని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని ఎండగడతామని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. మరోవైపు ఈ కేసులో కీలకమైన పలువురు అప్రూవర్లుగా మారిన నేపథ్యంలో కవితకు నోటీసులతో పరిస్థితులు ఎక్కడికి దారితీస్తాయోనన్న ఆందోళన కూడా బీఆర్ఎస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

పగోళ్లు కావాలా? పనోళ్లా?

- వచ్చే ఎన్నికల్లో నోబెల్స్.. గోబెల్స్‌కు మధ్యే పోటీ
- ఖమ్మంలో మంత్రి హరీశ్‌రావు




మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో పువ్వాడ, నామా, వనమా తదితరులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టును ప్రారంభిస్తామంటే ప్రతిపక్షాలు శకుని పాత్ర పోషిస్తున్నాయి..కాళేశ్వరంకన్నా పెద్దదైన ఈ ప్రాజెక్టు పాలమూరు ప్రజల కరువు తీరుస్తుంది. కానీ కాంగ్రెస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయి.. మనకు పనోళ్లు కావాలా, పగోళ్లు కావాలా ప్రజలు ఆలోచించాలి. వచ్చే ఎన్నికల్లో నోబెల్స్..గోబెల్స్‌కు మధ్యే పోటీ. మరింత అభివృద్ధి కోసం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని భావిస్తున్న ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారు' అని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఖమ్మంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను ఆయన ప్రారంభించారు. మమత మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ తర్వాత ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు గవర్నర్ ఆమోదం పొందిందన్నారు. ఇన్ని రోజులు పెండింగ్‌లో పెట్టినా బిల్లును ఆమోదించడం.. ధర్మమే గెలుస్తుందనడానికి నిదర్శనమని తెలిపారు. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ దేశంలోనే ప్రథమస్థానంలో ఉందని చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఆకలైనప్పుడు అన్నం పెట్టకపోగా, ఇప్పుడు గోరుముద్దలు తినిపిస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా ప్రజల కరుణ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఉండాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు పనులు చివరి దశలో ఉన్నాయని, ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే కేసీఆర్‌ను దీవించాలన్నారు. మమత కళాశాల సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యం అందించేలా 25 ఏళ్ల క్రితం కాలేజీని స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యూహంపై | 10 రోజుల్లో నివేదిక

టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా అనుసరించాల్సిన వ్యూహంపై 10 రోజుల్లో నివేదిక ఇస్తామని టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేమ్‌సాగర్‌రావు చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన స్ట్రాటజీ కమిటీ సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సభ్యులు కె. లక్ష్మారెడ్డి, పాల్వాయి స్రవంతి, లోకేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత తొమ్మిదిన్నరేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలు, గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిన మేలు గురించి ఈ ఎన్నికల సందర్భంగా ప్రజలకు కళ్లకు కట్టినట్టు వివరించేలా పార్టీ వ్యూహాన్ని తయారు చేస్తామని చెప్పారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మినీ చార్జిషీట్లు

తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనా వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో చార్జిషీట్లు విడుదల చేయాలని, రాష్ట్రస్థాయిలో వేసే చార్జిషీట్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మినీ చార్జిషీట్‌లు వేయాలని టీపీసీసీ చార్జిషీట్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. కమిటీ చైర్మన్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ చార్జిషీట్ కమిటీ సమావేశం జరిగింది. అనంతరం సంపత్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేరలేదని, ఈ అంశాలన్నింటినీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. స్థానికంగా ఎమ్మెల్యేల అరాచకాలను ఈ చార్జిషీట్లలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తామని సంపత్ వెల్లడించారు.

మండలాల వారీగా డేటా సేకరణ

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రీసెర్చ్ విభాగాన్ని బలోపేతం చేయాలని, అన్ని కోణాల్లో మండలాల వారీగా డేటా సేకరించి ప్రజలకు అవసరమైన కార్యకలాపాలు చేపట్టేలా పార్టీకి తగిన సమాచారం అందించాలని టీపీసీసీ కమ్యూనికేషన్స్ కమిటీ నిర్ణయించింది. కమిటీ చైర్మన్ జెట్టి కుసుమకుమార్ అధ్యక్షతన గురువారం గాంధీభవన్‌లో సమావేశం జరిగింది. అనంతరం కుసుమకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఏఐసీసీ తరహాలోనే గాంధీభవన్ లోనూ లైబ్రరీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ సభలో కుర్చీల కొట్లాట

- వేదికపైకి పిలవలేదని రచ్చరచ్చ
- రాష్ట్ర పరిశీలకురాలి ముందే ఇరువర్గాల బాహాబాహీ



గల్లాలు పట్టుకుని వాగ్వాదం చేసుకుంటున్న మురళీనాయక్, బలరాంనాయక్ వర్గీయులు

సాక్షి, మహబూబాబాద్: మానుకోట కాంగ్రెస్ నాయకులు మరోసారి రచ్చకెక్కారు. రాష్ట్ర పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్ ముందే కుర్చీల కోసం కొట్లాడుకున్నారు. అందరినీ సభావేదికపైకి పిలవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సభను విజయవంతం చేసేందుకు జనసమీకరణ నిమిత్తం మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనాయకుల సమావేశం గురువారం మహబూబాబాద్‌లో జరిగింది. ములుగు నుంచి ఎమ్మెల్యే సీతక్క, భద్రాచలం నుంచి ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఇల్లెందు నుంచి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, నర్సంపేట నుంచి దొంతి మాధవరెడ్డి, డోర్నకల్ నుంచి రాంచంద్రనాయక్, మహబూబాబాద్ నుంచి పోరిక బలరాం నాయక్, బెల్లయ్యనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిని పిలవాలని అనుకున్నారు. అయితే, అక్కడున్న చిన్నాచితకా నాయకులు కూడా వేదికపైకి వచ్చి కూర్చోవడంతో కుర్చీలన్నీ నిండిపోయాయి. ఈ క్రమంలో ముందుగా పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు మాట్లాడుతుండగా 'అందరూ వేదికపై ఉన్నారు. మా నేత మురళీనాయక్‌ను కూడా పిలవాలి, లేకపోతే అర్హత లేని వారిని కిందికి దింపాలి'అంటూ పలువురు కేకలు వేశారు. ఈ క్రమంలో మురళీ నాయక్, బలరాంనాయక్ వర్గాల కార్యకర్తలు ఒకరినొకరు గల్లాలు పట్టుకుని తోసుకున్నారు. ఇరువర్గాల నినాదాలతో సభాస్థలి దద్దరిల్లింది. మీనాక్షి నటరాజన్ జోక్యం చేసుకొని విజ్ఞప్తి చేయడంతో వేదికపై ఉన్న అందరూ కిందికి దిగారు. ఆ తర్వాత ఆమె ముఖ్యులతో మాట్లాడించారు.

కవిత కేసులో వివాదాస్పద వ్యాఖ్యలొద్దు!

బీజేపీ నేతలకు జాతీయ నాయకత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమైన, రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న అంశాలపై ఆచితూచి వ్యవహరించాలని రాష్ట్ర నాయకులను బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మళ్లీ ఈడీ నోటీసులు, విచారణ, తదితర పరిణామాలపై ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయవద్దని.. జైల్లో పెడతాం, అరెస్ట్ చేస్తామనే విధంగా కామెంట్స్ చేయవద్దని సూచించినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బందులు తేవొద్దని స్పష్టం చేసినట్టు తెలిసింది.

ఇక నా దృష్టి కరీంనగర్ 'పార్లమెంట్'పైనే

బీజేపీ ఎంపీ బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: ఇకపై కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపైనే ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ తెలిపారు. అందులో భాగంగానే ఎక్కువ సమయం నియోజకవర్గానికే కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ దమ్ము చూపిస్తామని, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని అన్నారు. గురువారం ఆయన కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలతో సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలు, త్వరలో చేపట్టబోయే బస్ యాత్ర వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి వరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ అన్నిజిల్లాలు తిరగాల్సి రావడంతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోయానని అన్నారు. పార్టీ ఆదేశిస్తే కరీంనగర్‌తోపాటు ఎక్కడైనా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 16న బైక్ ర్యాలీలు నిర్వహించాలని, 17న ఉదయం అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాతీయ జెండాను ఎగరేయాలని సమావేశంలో తీర్మానించారు.

కవితలా స్కాముల్లో రాహుల్ అప్‌డేట్ కాలేదు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్: ఎమ్మెల్సీ కవితలా స్కాములు చేయడంలో రాహుల్‌గాంధీ అప్‌డేట్ కాలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత పీకల్లోతులో కూరుకుపోయారని విమర్శించారు. ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్న ఆమె.. కేసుల భయంతోనే బీజేపీ నేతలను పల్లెత్తు మాట అనడం లేదని తెలిపారు. జగిత్యాలలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో గంటసేపు మాట్లాడిన కవిత.. తనను, కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వ అధీనంలోకి తీసుకుంటామని హామీ ఇచ్చిన కవిత ఎంపీగా గెలిచాక ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసివేశారని ఆరోపించారు. చెరుకు రైతులను మోసగించిన ఆమె వద్ద సుద్దులు నేర్చుకోవలసిన అవసరం తనకు లేదని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

పటాన్‌చెరు టికెట్‌పై పునరాలోచన చేయండి

మండలి డిప్యూటీ చైర్మన్‌కు ముదిరాజ్‌ల వినతి

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ కేటాయింపు విషయంపై పునరాలోచించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండా ప్రకాశ్ ముదిరాజ్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో గణనీయంగా ఉన్న ముదిరాజ్ సామాజికవర్గానికి బీఆర్ఎస్ పార్టీ ఒక్క టికెట్ కూడా కేటాయించక పోవడాన్ని ప్రస్తావిస్తూ, పటాన్‌చెరు టికెట్‌ను నీలం మధుకు ఇచ్చేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజవర్గాల్లో 6 లక్షల జనాభా కలిగిన ముదిరాజ్‌లకు ఒక సీటు కూడా ఇవ్వలేదన్నారు. నీలం మధుకు టికెట్ ఇవ్వని పక్షంలో ముదిరాజ్‌లు బీఆర్ఎస్‌కు దూరమయ్యే అవకాశముందని వినతిపత్రంలో పేర్కొన్నారు. బండా ప్రకాశ్‌ను కలసిన వారిలో సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మహేశ్ తదితరులున్నారు.

తెలంగాణ సమాజం మేలుకోవాలి

- కేసీఆర్ దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాలి
- కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి పిలుపు
- సర్కార్‌కు చుక్కలు చూపించే కార్యక్రమాలు చాలా ఉన్నాయి: జవదేకర్



కిషన్ రెడ్డి నిరాహార దీక్షను విరమింపచేస్తున్న ప్రకాశ్ జవదేకర్. చిత్రంలో ఈటల తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రజల హక్కులను కాలరాస్తున్న దుర్మార్గుడు సీఎం కేసీఆర్ అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనేక ప్రజా సమస్యలపై బీజేపీ అలుపెరగని పోరాటం, ఉద్యమాలు చేస్తుంటే పోలీసుల అండతో అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో నిరసన తెలిపే హక్కు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సమాజం మేలుకోవాలని, కేసీఆర్ దుర్మార్గపు పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డికి నిమ్మరసం ఇచ్చిన రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ నిరుద్యోగుల సమస్యలపై చేపట్టిన 24 గంటల దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

యువతకు భరోసా కల్పించేందుకే దీక్ష

'కేసీఆర్ అవినీతి, అక్రమ పాలనకు సంబంధించి, డబుల్ బెడ్రూం ఇళ్లు, యువతకు ఉద్యోగాలు, ధరణి ఇలా అనేక సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తోంది. నిరుద్యోగుల సమస్యలపై ధర్నాచౌక్ వద్ద శాంతియుతంగా దీక్ష చేస్తే మీకు కలిగిన ఇబ్బందేంటి? మీ ఫాం హౌస్‌లో ధర్నా చేశామా? తెలంగాణ ఉద్యమ లక్ష్యాలైన 'నియామకాల'పై కేసీఆర్ సర్కారు విధానం పట్ల తెలంగాణ యువతలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో వారికి అండగా నిలవడంతో పాటు మేమున్నామనే భరోసా కల్పించేందుకే 24 గంటల దీక్ష చేపట్టాం. ఈ దీక్షకు యువత నుంచి మద్దతు లభించడంతో కేసీఆర్ సర్కార్ దిక్కుతోచని స్థితిలో పడింది. బలవంతంగా దీక్షను భగ్నం చేసే ప్రయత్నం చేసింది. ఇందిరా పార్కు వద్ద పోలీసులతో పార్టీ కార్య కర్తలు, సహచరులు చేసిన పోరాటానికి సంబంధించిన వీడియోలు చూస్తోంటే ఒళ్లు గగుర్పొడించింది. అయితే ఇది పోలీసులకు వ్యతిరేకంగా కాదు.. కేసీఆర్ కుటుంబానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం..' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉద్యోగాల క్యాలెండర్ విడుదల చేసి అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంకా 100రోజులే ఉన్నాయి: ప్రకాశ్ జవదేకర్

'ఇంకా వంద రోజులే ఉన్నాయి. కేసీఆర్ అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలియజేసే ఉద్యమాలు కొనసాగిద్దాం. ఇప్పటికే వివిధ సందర్భాల్లో బీజేపీ సత్తాను కేసీఆర్‌కు చూపించాం. కేసీఆర్ సర్కార్‌కు, కల్వకుంట్ల కుటుంబానికి చుక్కలు చూపించే కార్యక్రమాలు ఇంకా చాలా ఉన్నాయి. నిరుద్యోగుల సమస్యలపై దీక్ష చేయాలనే కిషన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాన్ని, బీజేపీ కార్యకర్తలు చూపిన తెగువను అభినందిస్తున్నా..' అని ప్రకాష్ జవదేకర్ అన్నారు. కాగా యువతకు ఉద్యోగాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా పూర్తి స్థాయిలో ఉద్యోగాలు భర్తీ చేయాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి దీక్షకు మాజీ ఎంపీలు చాడ సురేష్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, రమేశ్ రాథోడ్, పార్టీ నేతలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, చింతా సాంబమూర్తి, డా.ఎస్.మల్లారెడ్డి, జి.మనోహర్‌రెడ్డి, డా.జి.గౌతంరావు, శ్యాంసుందర్‌గౌడ్ సంఘీభావం తెలిపారు.

బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదు

సోషల్ మీడియాలో ఫేక్ లిస్ట్: కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా అంటూ సోషల్ మీడియాలో 'ఫేక్ లిస్ట్ (తప్పుడు జాబితా)'ను సర్క్యులేట్ చేస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చెప్పారు. ఆ జాబితా నిజం కాదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వైరల్‌అవుతున్న బీజేపీ అభ్యర్థుల లిస్టుతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

కవితకు నోటీసులతో బీజేపీకి సంబంధం లేదు

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ పార్టీ సభ జరుపుకోనివ్వకుండా బీజేపీ అడ్డుకుందనేది శుద్ధ తప్పు అని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వాళ్ల మీటింగ్‌తో తమకు సంబంధం లేదని అన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ ఆదుకుంటుందని అనడం మూర్ఖత్వమని, ఎంఐఎంతో కలసి పని చేసే ఏ పార్టీతోనూ బీజేపీ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు ఇవ్వడంతో బీజేపీకి సంబంధం లేదన్నారు. జనసేన, టీడీపీ పొత్తుల గురించి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు మాట్లాడతారని చెప్పారు. తెలంగాణలో మాత్రం బీజేపీకి ఏ పార్టీతోనూ ఎలాంటి పొత్తులు లేవని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు.

నేడు పరకాలకు బీజేపీ బైక్ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి పరకాల సమీపంలోని అమరధామం వరకు శుక్రవారం కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడంలో భాగంగా బైక్‌ర్యాలీ చేపట్టి, ముగింపు సందర్భంగా సాయంత్రం పరకాలలో బహిరంగసభ నిర్వహిస్తారు. ఉదయం 7.40 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై పరకాల అమరధామానికి చేరుకుంటుంది. అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. సాయంత్రం పరకాలలో బహిరంగసభ నిర్వహిస్తారు.

మండుతున్న దిష్టిబొమ్మ మీదపడి
బీజేపీ నేతకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మురళీ యాదవ్


మెదక్: మెదక్ పట్టణంలో బీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో కలకలం చెలరేగింది. మండుతున్న సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్‌పై పడటంతో ఆయన ముఖానికి, చేతికి గాయాలయ్యాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు బీజేపీ కార్యకర్తలు, నాయకులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తోపులాట జరిగింది. మండుతున్న దిష్టిబొమ్మను పోలీసులు పక్కకు తోసే క్రమంలో అది నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీ యాదవ్‌పై పడిపోయింది. దీంతో ఆయన ముఖానికి, కుడి చేతికి గాయాలుకాగా, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం హైదరాబాద్ తరలించారు. కాగా, ప్రజాస్వామ్య దేశంలో నిరసనలు తెలిపే అధికారం అందరికీ ఉంటుందని, పోలీసుల అత్యుత్సాహం వల్ల తనకు మంటలు అంటుకున్నాయని మురళీధర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిది దొంగ దీక్ష: బడుగుల

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల సమస్యల పేరిట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దొంగ దీక్షలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. గురువారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో లింగయ్య మీడియాతో మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ఏటా ఇస్తామని చెప్పిన 2 కోట్ల ఉద్యోగాల గురించి కిషన్‌రెడ్డి మాట్లాడాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టిన చరిత్ర బీజేపీ పార్టీకే ఉందని, రాష్ట్రంలో 1.40లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్‌రెడ్డి నయాపైసా తీసుకురాలేదని, తెలంగాణ ప్రజల కోసం ఏనాడూ పనిచేయలేదని బడుగుల విమర్శించారు.

నా అనుభవంతో చెప్తున్నా..
కాంగ్రెస్ 70కిపైగా సీట్లు గెలుస్తుంది

సోనియా ఇచ్చే ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: 'ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచిన రాజకీయ అనుభవంతో చెప్తున్నా, ఈసారి ఎన్నికల్లో రాష్ట్రంలోని 70కిపైగా అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది'అని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంటరీ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం అనంతరం ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న రాష్ట్ర చరిత్రలోనే అరుదైన బహిరంగసభను తుక్కుగూడలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీతోపాటు నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ జాతీయ నాయకులందరూ పాల్గొనే ఈ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు హిమాచల్ ప్రదేశ్‌లో ఉద్యోగులకు ఓపీఎస్ విధానాన్ని అమలు పరుస్తున్నామని, కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీల్లో నాలుగింటినీ ఇప్పటికే అమలు చేశామని చెప్పారు. తెలంగాణలోనూ ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వబోతున్నామని, సోనియాగాంధీ ఈ ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ప్రకటిస్తారని చెప్పారు. ఠాక్రే మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే సీడబ్ల్యూసీ సమావేశాలు దేశానికి మంచి సంకేతాన్ని ఇస్తాయని చెప్పారు. బహిరంగ సభ అనంతరం 18న కాంగ్రెస్ నాయకులందరూ క్షేత్రస్థాయికి వెళ్లి ఐదు గ్యారంటీ కార్డు స్కీంలపై ప్రచారం చేయాలని, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం, 15, సెప్టెంబర్, 2023



సందడిగా వ్యవస్థాపక దినోత్సవం

సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజ్ 69వ వ్యవస్థాపక దినోత్సవాలు అలుమ్నీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సందడిగా జరిగాయి.

-10లో



సీఎస్‌కు వినాయక విగ్రహం అందజేత

మట్టి వినాయక విగ్రహాల ప్రమోషన్‌లో భాగంగా సచివాలయంలో గురువారం ప్రభుత్వ సీఎస్ శాంతికుమారికి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ వినాయక విగ్రహాన్ని అందజేశారు.

నేడు మహాగణపతికి 'నేత్రోనిలనం'

ఖైరతాబాద్: తుది మెరుగులు దిద్దుకుంటున్న శ్రీ దశమహా విద్యాగణపతికి శుక్రవారం సాయంత్రం 4.30 నుంచి 5 గంటల్లోపు నేత్రోనిలనం (కంటిపాప) అమర్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గురువారం శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విఠల శర్మ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేత్రోనిలనం చేపట్టడంతో విగ్రహానికి ప్రాణం పోసినట్లవుతుందని శిల్పి పేర్కొన్నారు.

వరద నీటిలో చిక్కుకున్న ఆటోను ముందుకు తోస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది



సచివాలయం వద్ద వరద నీరు చేరడంతో వాహనదారుల ఇక్కట్లు



ఎల్బీనగర్ చింతలకుంటలో..



మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్ద..



మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి చేరిన వరద..



వీఎస్టీ వద్ద..



రాజ్‌భవన్ రోడ్డులో..



మళ్లీ దంచికొట్టింది

నగరంలో మరోసారి భారీ వర్షం దంచికొట్టింది. గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో రోడ్లపై భారీగా వరద నీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. జంక్షన్లలో మోకాలు లోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 8 గంటల వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌లో వాహనదారులు నరకయాతన అనుభవించారు. నగరంలో అత్యధికంగా సికింద్రాబాద్‌లో 4.7 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. బంజారాహిల్స్, గణాంక భవన్ ప్రాంతాల్లో 4.1 సెం.మీ, బేగంబజార్‌లో 4, గౌలిగూడలో 3.9, ఉప్పల్‌లో 3.7, బర్కత్‌పురా, చార్మినార్, నాంపల్లిలలో 3.6, సరూర్‌నగర్‌లో 3.5, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీలలో 3.4, నాగోలు, బండ్లగూడలలో 3.2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. శుక్రవారం భారీ వర్షాలు పడే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. - సాక్షి, సిటీబ్యూరో

న్యూస్‌రీల్

హెచ్ఎండీఏ గణపతిని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాల పంపిణీ ప్రారంభమైంది. గురువారం మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ హెచ్ఎండీఏ గణపతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నగరంలోని 40 కేంద్రాల్లో పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్ మహానగర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆరేళ్లుగా హెచ్ఎండీఏ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ప్రతి సంవత్సరం లక్ష మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి. ప్రభాకర్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ అర్వింద్ కుమార్ నేతృత్వంలో హెచ్ఎండీఏ అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినాయక మట్టి ప్రతిమను అందజేశారు. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు వినాయక మట్టి ప్రతిమలను హెచ్ఎండీఏ యంత్రాంగం పంపిణీ చేయనుంది.

నిమ్స్‌లో 'బయో' వేస్ట్ బాక్స్



లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం యాంటీ బయోటిక్ మందుల పట్ల రోగులకు అవగాహన కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలోని ఓపీడీ బ్లాక్, స్పెషాలిటీ బ్లాక్‌లలో బయో వేస్ట్ బాక్స్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. యాంటీ బయోటిక్స్‌ను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పెను ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. యాంటీ బయోటిక్ సంబంధించిన మిగిలిన ఔషధాల పట్ల చాలా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో నిమ్స్‌లో బయో వేస్ట్ బాక్స్‌ను అందుబాటులోకి తీసుకుచ్చామన్నారు. ఈ బాక్స్ ద్వారా సేకరించిన యాంటీ బయోటిక్స్‌ను నిర్దీత నియమ నిబంధనల మేరకు డిస్పోజ్ చేస్తామని చెప్పారు. ఈ బాక్స్‌ను సద్వినియోగపర్చుకోవాల్సిందిగా డాక్టర్ బీరప్ప సూచించారు. కాగా.. బయో వేస్ట్ బాక్స్‌కు నిమ్స్ క్లినికల్ ఫార్మకాలజీ, థెరప్యూటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రూబీ రాఫెల్ రూపకల్పన చేశారు.

కూల్చేశారు

ప్రగతినగర్ ఘటనపై యంత్రాంగం సీరియస్

- కుప్పకూలిన భవనాన్ని నేలమట్టం చేసిన అధికారులు
- ముగ్గురిపై కేసు.. పరారీలో బిల్డర్

నిజాంపేట్: నాణ్యత ప్రమాణాలు పాటించకుండా.. ప్రగతినగర్‌లో నిర్మిస్తున్న ఓ భవనం శ్లాబ్‌లు బుధవారం కుప్పకూలిన ఘటనపై యంత్రాంగం సీరియస్‌గా ఉంది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం నిర్మాణంలో ఉన్న భవనాన్ని మొత్తం కూల్చివేశారు. నిజాంపేట్‌లోని ప్రగతినగర్‌లో అయిదంతస్తుల భవనాన్ని ఓ బిల్డర్ నిర్మిస్తున్నారు. రెండు శ్లాబ్‌లు పూర్తి చేసి బుధవారం మూడోది వేస్తున్న క్రమంలోనే భవనం కుప్పకూలింది. అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం బిల్డర్ ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించలేదని అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. శ్లాబ్‌ల కోసం తక్కువ ధరకు వచ్చే కంపెనీ నుంచి ఆర్ఎంసీ (రెడీ మిక్స్‌డ్ కాంక్రీట్) వాడటం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. పిల్లర్ నుంచి మరో పిల్లర్ వరకు గ్యాప్ ఎక్కువగా ఉండటంతో ఈ మధ్యలో ఇచ్చిన బీమ్ బరువును ఆపలేకపోవడం కూడా కారణం కావచ్చని అధికారులు భావిస్తున్నారు. శ్లాబ్‌లు వేసిన తర్వాత క్యూరింగ్ సైతం సరైన విధంగా చేయలేదని అధికారులు నిర్ధారించారు.

బాధ్యులపై చర్యలు..

శ్లాబ్‌లు కూలిన ప్రమాదానికి బాధ్యులుగా గుర్తించిన ముగ్గురిపై మున్సిపల్ అధికారులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ సుమన్ కుమార్ బిల్డర్లు మధుసూదన రాజు, కిశోర్‌లతో పాటు సూపర్‌వైజర్ శంకర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్లాబ్‌లు కూలినప్పటి నుంచి బిల్డర్లు పరారీలో ఉన్నారు. ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. గురువారం ఉదయం నుంచి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు భవనం మొత్తం హిటాచీ, జేసీబీలతో 20 మంది సిబ్బందితో సాయంత్రం వరకు నేలమట్టం చేయించారు.

బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి..

అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్న బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ కోరారు. గురువారం ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. బిల్డర్లు నాణ్యత పాటించకుండా ఎడాపెడా నిర్మాణాలు పూర్తి చేసి కొనుగోలుదారులకు అప్పగిస్తుండటంతో భవిష్యత్తులో ఆ ఫ్లాట్లు కొన్నవారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. నేషనల్ లేబర్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



సెప్టెంబర్ 17..ఎవరికి వారే!

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రభుత్వంలో 'హైదరాబాద్ స్టేట్' విలీనమైన సెప్టెంబర్ 17 వేడుకలను రాజకీయ పక్షాలు వేర్వేరుగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. అధికార బీఆర్ఎస్, దాని మిత్రపక్షమైన మజ్లిస్ పార్టీ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో, బీజేపీ విమోచన పేరిట జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరుపతలపెట్టాయి. కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దినోత్సవం పేరుతో సభలు నిర్వహించనున్నాయి. ఇందు కోసం మైదానాలు సంసిద్ధమవుతున్నాయి.

పబ్లిక్ గార్డెన్‌లో జాతీయ పతాకావిష్కరణ

అధికార బీఆర్ఎస్ పబ్లిక్ గార్డెన్‌లో తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.



పరేడ్ గ్రౌండ్‌లో విమోచన

భారతీయ జనతా పార్టీ సికింద్రాబాద్ రక్షణ శాఖ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా తెలంగాణ విమోచన సభకు సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో పాటు సభలో ప్రసంగించనున్నారు. సభ కోసం నగరంలోని అసెంబ్లీ నియోజకవర్గానికి 50 వేలు తగ్గకుండా భారీగా జన సమీకరణకు బీజేపీ కసరత్తు చేస్తోంది.

హాకీ మైదానంలో ఎంఐఎం సభ

మజ్లిస్ పార్టీ సైతం సెప్టెంబర్ 17న ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ సమైక్యతా దినోత్సవం పేరుతో మాసబ్ ట్యాంక్ హాకీ మైదానంలో సభ నిర్వహించేందుకు సిద్ధమైంది. నాంపల్లిలోని దర్గా యూసఫియ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి హాకీ స్టేడియంలో మధ్యాహ్నం 2గంటలకు భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. సభలో పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా ప్రసంగించనున్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కమ్యూనిస్టులు

వామపక్ష పార్టీలు నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారోత్సవాల పేరుతో సభకు సన్నాహాలు చేస్తున్నాయి.


ఓయూలోకి ఇక నో ఎంట్రీ!

- విద్యార్థులకు తప్ప ఇతరులకు ప్రవేశం లేదు
- ఎన్‌సీసీ జంక్షన్-అడిక్‌మెట్ ఫ్లై ఓవర్ వరకు..

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇక అన్ని వర్గాల వారు ప్రయాణించకుండా అధికారులు ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. కేవలం విద్యార్థులకు మాత్రమే ఓయూలోకి అనుమతించేలా చూడాలని భావిస్తున్నారు. ఇందుకోసం - ప్రత్యామ్నాయంగా లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం తార్నాక వైపు నుంచి హిందీ మహా విద్యాలయ, విద్యానగర్, నల్లకుంట తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు.. ఆ ప్రాంతాల నుంచి తార్నాక వైపు వెళ్లాల్సిన వారు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) నుంచే వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా వర్సిటీ ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతోంది. ఈ పరిస్థితి నివారించేందుకు మంత్రి కేటీఆర్ మానసపుత్రికగా ప్రారంభమైన లింక్/స్లిప్ రోడ్ నిర్మాణం ఉపకరిస్తుందని అధికారులు గుర్తించారు. ఓయూ క్యాంపస్‌లోకి రానవసరం లేకుండా ఉపకరించే ప్రత్యామ్నాయంగా లింక్ రోడ్డు నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు నుంచి అడిక్‌మెట్ ఆర్‌ఓబీ వరకు దాదాపు 1.20 కి.మీ.లతో ఈ లింకు రోడ్డు హెచ్‌ఆర్‌డీసీఎల్ (హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. అంచనా వ్యయం రూ.16 కోట్లుగా నిర్ణయించామని హెచ్‌ఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ సరోజరాణి తెలిపారు. వంద అడుగుల వెడల్పుతో నాలుగులేన్లలో, ఫుట్‌పాత్‌లతో సహా నిర్మించే ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనాలిక ఓయూలోకి వెళ్లాల్సిన అవసరం ఉండదు.

మొన్న తల్లిదండ్రులు.. నిన్న కుమారుడు

- అసువులు బాసిన అభాగ్యులు
- గ్యాస్ లీకేజీ ఘటనలో బాలుడి మృతి
- అనాథగా మారిన బాలిక



హర్షవర్ధన్

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీ నగర్ వడ్డెర బస్తీలో మూడ్రోజుల క్రితం వంట గ్యాస్ లీకై దంపతులు ఒకరి తర్వాత ఒకరు మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరి కుమారుడు గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మహాత్మాగాంధీ నగర్ వడ్డెర బస్తీలో నివసించే మిర్యాల రమేష్.. ఇంట్లోని వంట గ్యాస్ లీకైన విషయాన్ని గ్రహించకుండా.. కరెంటు స్విచ్ వేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కుటుంబ సభ్యులు మంటల్లో చిక్కుకొని గాయాలపాలయ్యారు. అదే రోజు రమేష్ మృతి చెందాడు. మరుసటి రోజు ఆయన భార్య శ్రీలత ఆస్పత్రిలో కన్నుమూసింది. తీవ్ర గాయాలపాలైన కుమారుడు హర్షవర్ధన్ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనతో వడ్డెర బస్తీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోదరుడు మృతి చెందడంతో చెల్లెలు అనాథగా మారింది. ప్రస్తుతం ఈ బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

డబుల్ లక్కీ ఎవరికో!

డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత డ్రా నేడు

- 24 నియోజకవర్గాల్లో 13,300 లబ్ధిదారుల ఎంపిక
- హైదరాబాద్ కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ
- హాజరు కానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరిగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో మరికొందరు పేదలకు సొంతింటి కల నెరవేరనుంది. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత లక్కీ డ్రా హైదరాబాద్ కలెక్టరేట్ వేదికగా శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 24 నియోజక వర్గాలకు చెందిన సుమారు 13,300 మంది లబ్ధిదారులను ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ర్యాండమైజేషన్ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ర్యాండమైజేషన్ లక్కీ డ్రా కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, హరీష్ రావు, సబిత ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, మూడు జిల్లాల కలెక్టర్లు హాజరు కానున్నారు.

21న గృహాల పంపిణీ

ర్యాండమైజేషన్ పద్ధతిలో ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 21న ఇళ్ల పంపిణీ జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మొదటి విడతలో ఎంపికైన 11,700 మంది లబ్ధిదారులకు శివార్లలోని 8 ప్రాంతాల్లో ఇళ్లను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేశారు. తాజాగా రెండో విడత లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. లబ్ధిదారుల ఎంపికలో సైతం రిజర్వేషన్ పాటించనున్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారానే మొత్తం ఇళ్లలో ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 6 శాతం, వికలాంగులకు 5 శాతం కేటాయించే విధంగా సాఫ్ట్‌వేర్ రూపొందించారు.

ర్యాండమైజేషన్ డ్రై రన్

గ్రేటర్ పరిధిలోని మొత్తం 24 నియోజకవర్గాల ర్యాండమైజేషన్ ప్రక్రియ నేపథ్యంలో ముందస్తుగా



గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో డ్రై రన్ నిర్వహించారు. ఎన్ఐసీ ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ నిర్వహించి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రూపొందించారని చెప్పారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారానే ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఇతరులకు ఇళ్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్ఓ వెంకటాచారి ఎన్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

నేడే టెట్..

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ!


- గ్రేటర్ జిల్లాల్లో 387 కేంద్రాలు
- మొత్తం అభ్యర్థులు 91,636 మంది

పేపర్-1 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	అభ్యర్థులు
హైదరాబాద్	99	28,3333
మేడ్చల్	32	6840
రంగారెడ్డి	82	15,490

పేపర్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	అభ్యర్థులు
హైదరాబాద్	91	21,821
మేడ్చల్	25	5,766
రంగారెడ్డి	58	13,386



సాక్షి, సిటీబ్యూరో: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు సర్వం సిద్ధమైంది. గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 387 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్‌లో 240 మందిని కేటాయించారు. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించే ఈ పరీక్షకు మొత్తం 91,636 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి. అభ్యర్థులను అరగంట ముందే సెంటర్‌లోకి అనుమతించనున్నారు. నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా.. అనుమతించరు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది తలెత్తకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, మంచినీరు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్- 2 పరీక్ష నిర్వహించనున్నారు. పోలీసులు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వెంట బ్లాక్‌బాల్ పెన్ను మినహా ఏ ఇతర వస్తువులను తీసుకురావొద్దు. వెంట తెచ్చుకున్న వస్తువులను గేటు బయట ఏర్పాటు చేసిన కౌంటర్లలోనే భద్రపర్చుకోవాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు ప్రకటించారు.

నకిలీ వేలిముద్రలతో బురిడీ


ఫెవిగమ్‌+వ్యాక్స్‌= ఫింగర్‌ ప్రింట్‌
- జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల నకి'లీలలు'
- ముగ్గురు శానిటరీ ఫీల్డ్‌ సూపర్‌వైజర్ల వ్యవహారమిది
- ఏళ్లుగా బల్దియా సొమ్ము కొల్లగొడుతున్న ఈ త్రయం
- ఇద్దరిని అరెస్టు చేసిన తూర్పు మండల టాస్క్‌ఫోర్స్‌



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ శానిటరీ విభాగంలో ఫీల్డ్‌ సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న ముగ్గురు భారీ స్కెచ్‌ చేశారు. ఫెవిగమ్‌, వ్యాక్స్‌ (మైనం) వినియోగించి 31 మంది పారిశుద్ధ్య కార్మికుల నకిలీ వేలిముద్రలు సృష్టించారు. వీటిని వినియోగించి ప్రతి రోజూ తమ వద్ద ఉండే బయోమెట్రిక్‌ మిషన్లలో హాజరు తంతు పూర్తి చేశారు. ఇలా గడిచిన కొన్నాళ్ళుగా ప్రభుత్వ సొమ్మును కాజేసింది. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న తూర్పు మండల టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు గురువారం ఇరువురిని పట్టుకున్నారని అదనపు డీసీపీ ఏవీఆర్‌ నర్సింహ్మారావు వెల్లడించారు. అంబర్‌పేట్‌, కర్మన్‌ఘాట్‌, జియాగూడ ప్రాంతాలకు చెందిన ఎ.సాయినాథ్‌, నాగరాజు, వి.విజయ్‌కుమార్‌ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–14లో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే పారిశుద్ధ్య కార్మికుల వద్దకు ప్రతి రోజూ వెళ్లి బయోమెట్రిక్‌ మిషన్ల ద్వారా వారి హాజరును తీసుకోవడం వీరి విధి. ఔట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో పని చేసే ఒక్కో కార్మికుడికీ నిర్దేశిత పని వేళలు ఉంటాయి. పని ప్రారంభించే ముందు బయోమెట్రిక్‌ మిషన్‌లో లాగ్‌ ఇన్‌, పూర్తయ్యాక లాగ్‌ ఔట్‌ నిర్దేశిస్తూ వీళ్లు వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. దీన్ని గమనించిన ఈ త్రయం కొన్నాళ్ళ క్రితం భారీ స్కెచ్‌ వేసింది. పారిశుద్ధ్య కార్మికుల నకిలీ వేలిముద్రలు తయారు చేయడంపై వీళ్ళు దృష్టి పెట్టారు. యూ ట్యూబ్‌లో సెర్చ్‌ చేయడం ద్వారా ఫెవిగమ్‌లో కొవ్వొత్తులకు సంబంధించిన మైనం (వ్యాక్స్‌) కలపడం ద్వారా ఓ రకమైన సింథటిక్‌ పదార్థం తయారు చేయవచ్చని తెలుసుకున్నారు. ఇలా రూపొందించిన దానిపై దానిపై జాగ్రత్తగా కార్మికుల వేలిముద్రల్ని సేకరించారు. ఆ సింథటిక్‌ పదార్థాన్ని వేలిముద్రల ఆకారంలో కట్‌ చేశారు. వీటిని తమ జేబులో వేసుకుని ఫీల్డ్‌కు వెళ్తున్న ముగ్గురూ అదును చూసుకుని లాగ్‌ ఇన్‌, లాగ్‌ ఔట్‌ కోసం వేలిముద్రలు వేసేస్తున్నారు. ఇలా పనికి రాని వారూ హాజరైనట్లు సృష్టించేస్తున్నారు. ఇలా ఆ పారిశుద్ధ్య కార్మికుడికి జీహెచ్‌ఎంసీ నెలకు ఇచ్చే జీతాన్ని స్వాహా చేస్తున్నారు. ఈ ముగ్గురూ కలిసి మొత్తం 31 మంది వేలి ముద్రల్ని తయారు చేసింది. కొన్నాళ్ళుగా సాగిన ఈ వ్యవహారంపై ఇటీవల తూర్పు మండల టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ టి.శ్రీనాథ్‌రెడ్డికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో రంగంలోకి దిగిన ఎస్సైలు సి.వెంకటేష్‌, బి.అర్వింద్‌ గౌడ్‌, పి.నాగరాజు వలపన్నారు. గురువారం ఉదయం నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌ వద్ద సాయినాథ్‌ను, సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద నాగరాజును రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి మూడు బయోమెట్రిక్‌ మిషన్లు, 31 నకిలీ వేలి ముద్రలు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న విజయ్‌ కుమార్‌ కోసం గాలిస్తున్నారు. సాయినాథ్‌ పదేళ్ళుగా, నాగరాజు ఏడాదిన్నరగా జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

కాలేయ కేన్సర్‌కు విప్లవాత్మక చికిత్స

- కొత్త ఇమ్యునోథెరపీతో సత్ఫలితాలు
- ఏఐజీ హాస్పిటల్స్‌ అధ్యయనంలో వెల్లడి



మాట్లాడుతున్న ఏఐజీ హాస్పిటల్స్‌ చైర్మన్‌ డాక్టర్‌ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: కాలేయ కేన్సర్‌ను సకాలంలో గుర్తించి, సత్వరమే చికిత్స చేసినప్పుడు అటెజోలిజుమాబ్‌, బెవాసిజుమాబ్‌ల కాంబినేషన్‌తో కూడిన సరికొత్త ఇమ్యునో థెరపీ మంచి ఫలితాలను అందిస్తుందని, గణనీయమైన సంఖ్యలో కాలేయ కేన్సర్‌ రోగులు కోలుకునేలా చేస్తుందని ఏషియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. జర్నల్‌ ఆఫ్‌ క్లినికల్‌ అండ్‌ ఎక్స్‌పెరిమెంటల్‌ హెపటాలజీలో ప్రచురించిన అధ్యయన విశేషాలను గురువారం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఓ సమావేశంలో వైద్యులు వెల్లడించారు.

చికిత్సతో మంచి ఫలితాలు...

ఈ సందర్భంగా ఏఐజీ హాస్పిటల్స్‌ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్‌–చీఫ్‌ డాక్టర్‌ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'కాలేయ కేన్సర్‌కు కారణం వైరల్‌ హెపటైటిస్‌ బి అనేది ఎంతో కాలంగా మనకు తెలుసు. అయితే ఇప్పుడు అది నాన్‌–ఆల్కహాలిక్‌ స్టీటోహెపటైటిస్‌ లేదా ఫ్యాటీ లివర్‌గా మారుతోంది. దీనికి నిశ్చల జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మధుమేహం..వంటి కారణాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన కొత్త ఇమ్యునోథెరపీ చికిత్స అధునాతన కాలేయ కేన్సర్‌ చికిత్సలో విప్లవాత్మక మార్పు' అని అన్నారు. ''అడ్వాన్స్‌ దశలోని కాలేయ కేన్సర్‌తో బాధపడుతున్న రోగులకు సంప్రదాయిక చికిత్సతో కణితిని పూర్తిగా రూపుమాపడం కష్టం. అయితే దీనితో సుమారు 10–13 శాతం మంది రోగులు కణితి సమస్యను పూర్తిగా అధిగమించారు. నాలుగో వంతు మంది పాక్షిక ఫలితాలుసాధించారని మేం గుర్తించాం'' అని ఈ అధ్యయన ప్రధాన రచయిత ఏఐజీ వైద్యులు డాక్టర్‌ ఆనంద్‌ కులకర్ణి చెప్పారు. సమావేశంలో ఏఐజీ ఆసుపత్రికి చెందిన హెపటాలజీ డైరెక్టర్‌ డాక్టర్‌ పీఎన్‌ రావు, జైపూర్‌లోని మహాత్మా గాంధీ హాస్పిటల్‌ గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ హెడ్‌ ప్రొఫెసర్‌ వివేక్‌ సరస్వత్‌, ఇండియన్‌ లివర్‌ కేన్సర్‌ మార్గదర్శకాలను రూపొందించిన సర్‌ గంగారామ్‌ హాస్పిటల్‌ (ఢిల్లీ) సీనియర్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ ఆశిష్‌ కుమార్‌, ముంబయిలోని సర్‌ హెచ్‌ఎన్‌ రిలయన్స్‌ హాస్పిటల్‌ హెపటాలజీ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆకాష్‌ శుక్లాలు ఈ చికిత్స విశేషాలను వివరించారు

అధ్యయనం సాగిందిలా...

అటెజోలిజుమాబ్‌, బెవాసిజుమాబ్‌ మందుల కాంబినేషన్‌లో సాగే ఈ ఇమ్యునోథెరపీ శరీర రోగనిరోధక వ్యవస్థను ఉపయోగించి కేన్సర్‌ కణాలను చంపుతుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం నగరంలోని ఏఐజీ హాస్పిటల్‌కు చెందిన 59 మంది రోగులు, జైపూర్‌లోని మహాత్మా గాంధీ మెడికల్‌ కాలేజీకి చెందిన 8 మంది రోగులను ఎంచుకున్నారు. వీరిలో 12.9 శాతం మంది రోగులు కణితి నుంచి పూర్తి విముక్తి పొందగా..25.8 శాతం మందికి పాక్షికంగా నయమైంది. మొత్తంగా అధ్యయనం చేసిన 66.12 శాతం మంది రోగులలో వ్యాధి తీవ్రత తగ్గింది.

పర్యావరణ పరిరక్షణకే మట్టి ప్రతిమలు

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ రోనాల్డ్‌రాస్‌

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం జీహెచ్‌ఎంసీ పరిధిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ప్రారంభించినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ రోనాల్డ్‌రాస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ వరకు వార్డుల వారీగా విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వార్డుకు 2,500 చొప్పున ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రతి సర్కిల్‌కు ఒక ఏఎంఓహెచ్‌ను ఇన్‌చార్జిగా, ప్రతి వార్డుకు వార్డు ఆఫీసర్‌ను ఇన్‌చార్జిగా నియమించామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ద్వారా 1.5 అడుగుల మట్టి విగ్రహాలు 10 వేలు, 1 అడుగువి 30 వేలు, 8 అంగుళాలు 2,70,000 విగ్రహాలు, హెచ్‌ఎండీఏ ద్వారా 8 అంగుళాల విగ్రహాలు 79,200, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు ద్వారా 8 అంగుళాల విగ్రహాలు 75,000 పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మరో 46 వేల విగ్రహాలను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అన్ని విభాగాల ఆధ్వర్యంలో 4,64,200 మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సందడిగా గాంధీ వైద్యకళాశాల వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థినికి గోల్డ్‌మెడల్‌ అందిస్తున్న అలుమ్ని వ్యవస్థాపక అధ్యక్షుడు రాజిరెడ్డి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్‌ గాంధీ మెడికల్‌ కాలేజీ 69వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గాంధీ అలుమ్ని అసోషియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం సందడిగా జరిగాయి. అలుమ్ని అసోషియేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్‌ రాజారెడ్డి, గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ రాజారావులు ముఖ్యఅతిథులుగా హాజరై వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతు వైద్యరంగానికి తమవంతు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనేక సామాజిక సేవ కార్యక్రమాలతోపాటు వైద్యవిద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సీపీఆర్‌, బేసిక్‌ లైఫ్‌ సపోర్ట్‌ (బీఎల్‌ఎస్‌)లపై సుమారు పదివేల మందికి ఉచిత శిక్షణ అందించామని అలుమ్ని అసోషియేషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ జీఆర్‌ లింగమూర్తి వివరించారు. అనంతరం ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన 36 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. తమకు వైద్యవిద్యను బోధించిన ఆనాటి గురువులు సుజాత, శ్రీనివాసరెడ్డి, శ్రీరాంరెడ్డి, మనోహర్‌రెడ్డిలతోపాటు, బేసిక్‌ లైఫ్‌ సపోర్ట్‌పై ఉచిత శిక్షణ ఇచ్చిన వైద్యులు మహేశ్వరరెడ్డి, విజయరావు, బాస్కర్‌రెడ్డి, రజిత, నాగార్జునచక్రవర్తి, లక్ష్మీనారాయణ, రాజేష్‌, రామకృష్ణ, మెహిబ్‌హుస్సేన్‌, రోహిత్‌ రెడ్డిలకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలుమ్ని ప్రతినిధులు లింగమూర్తి, వెంకటరత్నం, చంద్రశేఖర్‌, నందకుమార్‌లతోపాటు పలువురు వైద్యులు, పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పీజీ ప్రవేశాల రిజిస్ట్రేషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశాలకు ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్లకు శుక్రవారం గడువు ముగియనున్నట్లు టీఎస్‌ సీపీఈటీ–2023 కన్వీనర్‌ ప్రొ.పాండురంగా రెడ్డి గురువారం తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఇంతవరకు 25 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్‌ చేసుకున్నట్లు వివరించారు. వివిధ వర్సిటీలలోని 50 కోర్సులకు 45 వేల పీజీ సీట్లు ఉండగా అందులో యూనివర్సిటీ క్యాంపస్‌ కాలేజీల్లో 8 వేలు ఉన్నాయన్నారు. సీట్లు సాధించిన విద్యార్థుల మొదటి జాబితాను ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ప్యాంటు..ఫ్యానులో బంగారం



శంషాబాద్‌: అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్‌ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం రియాద్‌ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని కస్టమ్స్‌ అధికారులు తనిఖీ చేయగా అతడు ప్యాంటులో ప్రత్యేకంగా తయారు చేయించుకున్న జేబులో 582 గ్రాముల బరువు కలిగిన బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. బంగారం విలువ 35.35 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. మరో కేసులో కౌలాలంపూర్‌ నుంచి వచ్చిన ప్రయాణికుడి లగేజీలో ఉన్న సీలింగ్‌ ఫ్యాన్‌ యంత్రం కనిపించడంతో దానిని విప్పి చూశారు. అందులో 636 గ్రాముల బరువు కలిగిన బంగారం బయటపడింది. బంగారం విలువ 38.62 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

Education

100% పాస్‌ గ్యారంటీతో అక్టోబర్‌ లో 10th, ఇంటర్‌ & జనవరిలో డిగ్రీ, పీజీ డిప్లొమా పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. ఫెయిల్‌ అయినా రీకౌంటింగ్‌ ద్వారా పాస్‌, ఫైన్‌ తో అడ్మిషన్స్‌ కలవు. ఫోన్‌: 6305979755 [H-189391]

FREE TRAINING

పేద అమ్మాయిలకు IDPL కూకట్‌పల్లి, చంపాపేట్‌లో HR+మీడియా+డిజి।మీ+కంప్యూటర్‌లో 120డేస్‌ ఫ్రీ ట్రెయినింగ్‌+ ఫ్రీ సర్టిఫికేట్‌+ ఫ్రీ ప్లేస్‌మెంట్‌+ భవిష్యత్తు+ ఆదాయం. Q: డిగ్రీ+ స్మార్ట్‌ ఫోన్‌ మస్ట్‌. ఫోన్‌ : 9908743803 [HA-2542]

Real Estate

12,999/– కే గజం DTCP అప్రూవ్డ్‌ శ్రీశైలం హైవే ఫేసింగ్‌ వెంచర్‌ ఆమనగల్‌ దగ్గర న్యూవెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. ఫోన్‌ : 8309376230 [H-788540]

FLAT FOR SALE

Affordable 3BHK Flats In Ready to Occupy Gated Community, Must See Last 2 Flats Available for Sale No GST. Call Now : 9000149079. [H-788595]

Chaitanya Food Court Backside, MIG 28/4 1st Floor, 3rd Phase, Sqft.1125 Housing Board Colony, Kukatpally, Contact : 9949668756, 7702220700 [H-788680]

PLOT FOR SALE

మీ బడ్జెట్‌ లో 126 ఎకరాల DTCP అప్రూవ్డ్‌ 30 నెలల వాయిదా పద్ధతిలో ప్లాట్‌ తీసుకున్న వారికి 2 గ్రా. గోల్డ్‌ ఫ్రీ. ఫోన్‌ : 6309771255. [H-189493]

Services

శ్రీ రామ్‌ గోల్డ్‌ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధరకు కొనబడును. ఫోన్‌ :9133214214 [H-788622]

BUSINESS SERVICE



మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్‌, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్‌ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788357]

BUSINESS OFFER

రియల్‌ ఎస్టేట్‌ లో పార్ట్‌టైమ్‌ వర్క్‌ చేయడం ద్వారా మంచి ఆదాయం సంపాదించడం, ఫీల్డ్‌ వర్క్‌ లేకుండా కస్టమర్లను సంపాదించడం అను అంశంపై ఉచిత సెమినార్‌ ఫోన్‌ : 9000028341 [H-189589]

తెలంగాణ గోల్డ్‌ బయ్యర్స్‌: తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని విడిపించాలనుకుంటున్నారా? మీ బంగారాన్ని అమ్మాలనుకుంటున్నారా? తక్షణమే నగదు. సంప్ర: 9000030022 [H-788415]

DISTRIBUTORS

Wanted District Wise Stockists for European Sofa Fabrics, Wallpapers. Call: 9182931347 [HA-5920]

PERSONAL CARE



CHANGE OF NAME

I, Mohita Sahu D/o. Narottam Das Sahu, W/o. Vaibhav Jakhodia, residing at 401, Alekhya Golden Bamboos, Khanamet, Kondapur, Rangareddy, Telangana - 500084, have changed my name and shall hereafter be known as Mohieta Vaibhhav Jakkhodia. [DA-8811]

I, Kommanaboina Somanna R/o. G-1, Thirumala Apts, Street No. 9, Tarnaka, Sec-bad-17, TS, Changed my Name as Kommanaboina Someshwar S/o. Komuraiah. [H-788312]

I, Pothireddygari Maadhusudhana Reddy S/o. Pothireddygari Madhava Reddy Mother Name: Pothireddygari Pramela Spouse Name: Pothireddygari Suvarna R/o. P.No. 131, 3rd Flr., 5th Phase, Opp: Hometel Menpg. KPHB Colony, Kukatpally, TS-85, have changed our Names to Pothireddy Madhusudhana Reddy S/o. Pothireddy Madhava Reddy, Mother Name Pothireddy Pramela, Spouse Name: Pothireddy Suvarna Here after my name is known as Pothireddy Madhusudhana Reddy. [H-796947]

OLD AGE HOME

వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం।। వైద్య, భోజనం వసతి ఉప్పల్‌, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467086. [H-189473]

రామకృష్ణ హోం కేర్‌ సర్వీస్‌ (డీలక్స్‌) విజయవాడ, హైదరాబాద్‌. 24 గంటలు వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్‌ కొరకు M/F మీ ఇంటికి పంపగలము. ✆ 94413 84123, 94413 86123. [B-1206745]

Wanted

L.B. నగర్‌ ప్రముఖ రియల్‌ ఎస్టేట్‌ ఆఫీస్‌ నందు పనిచేయుటకు ''లేడీ టెలికాలర్స్‌'' & లేడీ ఆటెండర్లు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. ఫోన్‌ : 8096403602 [H-189293]

డైరెక్ట్‌ జాబ్‌: (18–50సం., లలోపు) మహిళలు/ పురుషులు వెంటనే కావలెను. జీతం: 25000/- వేల వరకు, ఫ్రీ రూం + భోజనం. ఫోన్‌:9966310431, 8886733005 / 008 [H-788916]

హైదరాబాద్‌లో ఇంట్లో ఉండి వంటపనికి సీనియర్‌ సిటిజన్‌ను చూసుకోవటానికి 40–55 వయస్సు గల 10th చదివిన మగ మనిషి కావలెను. Ph: 7207914195 [H-781280]

త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K. ఏజెంట్‌ కమీషన్‌. 3K Ph: 9848571888 [H-189332]

రామకృష్ణ హోం కేర్‌ సర్వీస్‌ (డీలక్స్‌) VJA, HYD. శ్రీమంతులల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్‌ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్‌/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్‌ 5 వేలు. ✆ 94413 84123, 94413 86123. [B-1206744]

బాలాజీ హోం కేర్‌ సర్వీస్‌ (డీలక్స్‌) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్‌ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్‌/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్‌ 5 వేలు. ✆ 94413 81678, 94413 82678 [B-1068108]

Wanted full time Consultants Cordiologist, Dentel Pulmonologist, Pediatrics, Neonatologist & Gynaecology for super speciality hospitals at beeramguda, Patancheru & isnapur Ph: 7780294541 [HA-401]

Walk-in Interview@kondapur For Field Executive's (Male), Tele Callers. Female, Fresh/Exp. Call: Ph: 8121005904. [HA-615]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్‌ సెంటర్స్‌

సాక్షి క్లాసిఫైడ్స్‌ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్‌	9912348016	రాజేంద్రనగర్‌	9010202372
ఎల్‌.బి.నగర్‌	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్‌	9951602997
సికింద్రాబాద్‌	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్‌	9705144457	చందానగర్‌	9010213322
అమీర్‌పేట్‌	9505507563	ఉప్పల్‌	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్‌, రోడ్‌ నెం.1, బంజారాహిల్స్‌, హైదరాబాద్‌ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

పన్నుల నిధులు పక్కదారి!

- ఘట్‌కేసర్‌ మున్సిపాల్టీలో రూ.3 కోట్ల 13 లక్షల నిధుల గోల్‌మాల్‌
- ఆడిట్‌లో గుర్తింపు.. రికవరీ చేసిన అధికారులు

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీలో గోల్‌మాలైన ట్యాక్స్‌ నిధులు రూ.3,13,3000 కోట్లుగా తేలింది. ప్రజలు చెల్లించిన ట్యాక్స్‌ సొమ్మును మున్సిపాల్టీ బ్యాంకు ఖాతాలో డిపాజిట్‌ చేయకుండా పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారం 2021 నుంచి జరిగింది. ఇటీవల నూతనంగా వచ్చిన కమిషనర్‌ గుర్తించి గత జూలైలో ఆడిటింగ్‌కు ఆదేశించారు. ఆడిటింగ్‌ జరుగుతుండగానే బ్యాంకులో డబ్బులు జమజేసే వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీంతో గోల్‌మాల్‌ నిజమేనని తేలింది. ఇక కోట్ల రూపాయలకు సంబంధిన ట్యాక్స్‌ నిధుల చిట్టా డిపాజిట్‌, చిట్టా నమోదు విధులు ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగికి అప్పగించడం, ఉద్యోగులను అజామాయిషి చేయకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించారని అప్పటి కమిషనర్లు వసంత, వేమనరెడ్డికి రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్‌ మెమోలు జారీ చేశారు. అలాగే ఏడాదిగా చిట్టా నమోదును పరిశీలించకుండా నిధుల దుర్వినియోగానికి కారణమైన మున్సిపల్‌ మేనేజర్లు శ్రీధర్‌రెడ్డి, అంజిరెడ్డిని విధుల నుండి తొలగించినట్లు ఉత్తర్వులు జారీచేశారు. కాగా మున్సిపాలిటీలో గోల్‌మాలైన నిధులు అధికారులు రీకవరీ చేసినట్లు తెలుస్తోంది. అప్పటి కమిషనర్లు వసంత, వేమన రెడ్డిలపై చర్యలు తీసుకోవడంతో వారు స్పందించి గోల్‌మాల్‌ అయిన నిధులను తిరిగి డిపాజిట్‌ చేశారని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

పనిచేసే సంస్థకు కన్నం

రూ.1.47 కోట్లతో ఉడాయించిన ఉద్యోగి

రాంగోపాల్‌పేట్‌: ఆరు నెలల పాటు నమ్మకంగా పనిచేసి..యజమాని నమ్మకాన్ని చూరగొన్నాడు. అవకాశం కోసం ఎదురుచూస్తూ సంస్థ లాకర్‌లో ఉన్న రూ.1.47 కోట్ల నగదుతో ఉడాయించాడు ఓ మోసగాడు. ఈ ఘటన రాంగోపాల్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ లింగేశ్వర్‌ తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానా టెక్స్‌బుక్‌ కాలనీకి చెందిన రాజేష్‌ గాంధీ అనే వ్యక్తి పీజీ రోడ్డులో సిపుల్‌ ఎంటర్‌ప్రైజెస్‌ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఈ సంస్థ ద్వారా పాల ఉత్పత్తుల వ్యాపారం చేస్తుంటారు. ఇందులో భాగంగా రోజూ పెద్ద ఎత్తున నగదును కార్యాలయానికి తెస్తుంటారు. గత 6 నెలల క్రితం కన్వరాజ్‌ సింగ్‌ అలియాస్‌ రాకేష్‌ బట్టి అనే వ్యక్తి ఆఫీస్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. కన్వరాజ్‌ క్యాషియర్‌ లలిత్‌జైన్‌, అకౌంటెంట్‌ రాజు కుమార్‌లకు సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వినియోగదారుల నుంచి నగదు, చెక్కులు తీసుకుని వచ్చి బ్యాంకులో డిపాజిట్‌ కూడా చేస్తుంటాడు. జూన్‌ నెలలో క్యాషియర్‌ లలిత్‌ జైన్‌ తన వ్యక్తిగత పనుల నిమిత్తం సొంత ఊరికి వెళ్లగా, అకౌంటెంట్‌ రాజు కుమార్‌ పరేఖ్‌ కూడా సెలవుపై వెళ్లాడు. వీరిద్దరికి పీజీ రోడ్‌ కార్యాలయంలోని లాకర్‌ ఫింగర్‌ ప్రింట్‌ యాక్సెస్‌ ఉంది. ఇద్దరు ఒకేసారి సెలవుపై వెళ్లడం, అప్పటికే ఎంతో నమ్మకంగా కన్వరాజ్‌ సింగ్‌ పనిచేస్తుండటంతో లాకర్‌ ఫింగర్‌ ప్రింట్‌ యాక్సెస్‌ను అతనికి ఇచ్చాడు యజమాని. దీంతో తరచుగా లాకర్‌లో నగదు ఉంచడం, తీయడం ఆయనే చేస్తూ ఉన్నాడు. అయితే లలిత్‌జైన్‌, రాజ్‌ కుమార్‌ పరేఖ్‌లు వచ్చిన తర్వాత కూడా కన్వరాజ్‌పై నమ్మకం కుదరడంతో ఫింగర్‌ ప్రింట్‌ యాక్సెస్‌ అలాగే ఉంచారు. గత మూడు రోజుల నుంచి కన్వరాజ్‌ సింగ్‌ కార్యాలయానికి రాకపోవడంతో పాటు ఫోన్‌కూడా స్విచాఫ్‌ ఉంది. అనుమానం వచ్చి గురువారం మధ్యాహ్నం లాకర్‌ను తెరిచిచూడగా అందులో రూ.1.47 కోట్ల నగదు తక్కువగా ఉంది. దీంతో యజమాని రాజేష్‌ గాంధీ రాంగోపాల్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం ప్రత్యేక గాలింపు చేపట్టారు.

నేషనల్‌ సైన్స్‌ అకాడమీ ఫెలోగా డా. డి.శ్రీనివాసరెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ టెక్నాలజీ (సీఎస్‌ఐఆర్‌–ఐఐసీటీ) డైరెక్టర్‌ డాక్టర్‌ డి.శ్రీనివాసరెడ్డి 2023 సంవత్సరానికి ఇండియన్‌ నేషనల్‌ సైన్స్‌ అకాడమీ ఫెలోగా ఎన్నికయ్యారు. తన నైపుణ్యంతో ఆయన వివిధ ఔషధాల తయారీలో ప్రముఖ పాత్ర పోషించారు. ఇరవయ్యేళ్లకు పైగా పరిశోధన రంగంలో మానవాళి ఆరోగ్యం కోసం ఔషధాల తయారీలో ఎనలేని సేవలందించారు. ఆయన చేసిన విశేష సేవలకు గాను ఇప్పటికే ఆయన కెమికల్‌ సైన్సెస్‌లో శాంతిస్వరూప్‌ భట్నాగర్‌ అవార్డు, కేంద్ర ప్రభుత్వ జేసీ బోస్‌ నేషనల్‌ ఫెలోషిప్‌, సీఆర్‌ఎస్‌ఐ బ్రాంజ్‌ మెడల్‌ తదితర అవార్డులెన్నో పొందారు. ఆయన ఇప్పటికే నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌, ఇండియన్‌ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌, మహారాష్ట్ర అకాడమీ ఆఫ్‌సైన్సెస్‌, తెలంగాణ అకాడమీ ఆఫ్‌ సైన్సెస్‌ ఫెలోగా కూడా ఉన్నారు. నగరంలోని ఎన్‌జీఆర్‌ఐకి చెందిన డాక్టర్‌ మండల్‌, సెంటర్‌ ఫర్‌ డీఎన్‌ఏ ఫ్రింటింగ్‌అండ్‌ డయాగ్నస్టిక్స్‌కు చెందిన మద్దిక సుబ్బసైతం ఈ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు.

మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి

శాసన మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌ రెడ్డి



డాక్టర్‌ కృష్ణయ్య దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: సమాజంలోని మహోన్నత వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు ఎదిగిన తీరు నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్స్‌ థియేటర్స్‌ 51వ వార్షికోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్‌ ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్‌ కృష్ణయ్య, సుజాత దంపతులకు 'అక్కినేని–అన్నపూర్ణ ఆదర్శ దంపతుల జీవిత సాఫల్య' పురస్కారాన్ని ప్రదానం చేశారు. అదేవిధంగా పలువురు ప్రవాస భారతీయులకు అక్కినేని–వంశీ పురస్కారాలను అందజేశారు. అంతకు ముందు శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శించగా నవ వ్యాస మాలిక సంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్‌ కేవీ రమణాచారి, సినీనటుడు మురళీమోహన్‌, దర్శకుడు రేలంగి నర్సింహారావు, వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి యూపీ అధికారుల బృందం

వరద నివారణ, ఇంజినీరింగ్‌ పనుల నిర్వహణపై అధ్యయనం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో అమలవుతున్న వరదనివారణ చర్యలు, డీఆర్‌ఎఫ్‌ బృందాల పనితీరు, ఇంజినీరింగ్‌ పనుల నిర్వహణ తదితరమైనవి అధ్యయనం చేసేందుకు ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన ఐఏఎస్‌ అధికారులు, ఇంజినీర్ల బృందం నగరానికి వచ్చింది. ఈవీడీఎం కార్యాలయంలో వారితో సమావేశమైన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ రోనాల్డ్‌రాస్‌, ఈవీడీఎం డైరెక్టర్‌ ప్రకాశ్‌రెడ్డి, ఈఎన్‌సీ జియావుద్దీన్‌, సీఈ కిషన్‌ తదితర అధికారులు డీఆర్‌ఎఫ్‌ కంట్రోల్‌ రూమ్‌ను, బృందం పనితీరును సంబంధిత దృశ్యాల ద్వారా వారికి వివరించారు. అనంతరం బృందంలోని అధికారులు సంజీవయ్యపార్కు సమీపంలోని ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌, జవహర్‌నగర్‌ చెత్త నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. నగరంలో వరదల నివారణకు ఎస్‌ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన పనులను శుక్రవారం వారు దర్శించనున్నట్లు జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఉత్తరప్రదేశ్‌ అధికారుల బృందంలో ఐఏఎస్‌ అధికారులు సుధీర్‌గార్గ్‌(రెవెన్యూ అడిషనల్‌ చీఫ్‌ సెక్రటరీ) , సిపుగిరి(వారణాసి మునిసిపల్‌ కమిషనర్‌), గౌరవ్‌సింఘ్‌ సోగర్‌వాల్‌ (గోరఖ్‌పూర్‌ మునిసిపల్‌ కమిషనర్‌), విక్రమాదిత్య సింగ్‌మాలిక్‌ (ఘజియాబాద్‌ మునిసిపల్‌ కమిషనర్‌), ఇందర్‌జీత్‌సింగ్‌ (లక్నో మునిసిపల్‌ కమిషనర్‌), తదితరులున్నారు.

'మాస్టర్‌' లేకుండానే టీ.. కాఫీ రెడీ!

నగరంలో 'ఏఐ' ఈ–డబ్ల్యూటీసీ యంత్రాలు

సాక్షి,సిటీబ్యూరో: టీ మాస్టర్‌ అవసరం లేకుండానే కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్‌ ఇంటలిజెన్స్‌)తో టీ, కాఫీ తయారు చేసే ఈ–డబ్ల్యూటీసీ మెషిన్‌లు నగరంలో సందడి చేయనున్నాయి. జెమ్‌ ఓపెన్‌క్యూబ్‌ టెక్నాలజీస్‌ ఆధ్వర్యంలోని ఈ మెషిన్‌లను సనాతన్‌ వరల్డ్‌ ప్రాజెక్టులో భాగంగా యూకేకు చెందిన ఎస్‌ఆర్‌ఎఎమ్‌–ఎంఆర్‌ఎమ్‌ సంస్థ వైస్‌ చైర్మన్‌ గురూజీ కుమారన్‌ స్వామిజీ 1000 ఈ–డబ్ల్యూటిసి మెషిన్లను కొని దేశవ్యాప్తంగా వివిధ ఎయిర్‌ పోర్టులు, షాపింగ్‌ మాల్స్‌తో పాటు ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా కొన్ని మెషిన్లను నిరుద్యోగ యువతను ఎంపిక చేసి వారి ఉపాధి కోసం ఉచితంగా అందించనున్నామని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన ఒప్పంద కార్యక్రమాన్ని గురువారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌ వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెమ్‌ ఓపెన్‌క్యూబ్‌ టెక్నాలజీస్‌ సంస్థ సీఈఓ పి.వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ., రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 600కి పైగా మెషీన్లు అమ్ముడయ్యాయని, సనాతన్‌ వరల్డ్‌ ప్రాజెక్ట్స్‌ లిమిటెడ్‌ ఒప్పందంతో ఒక్కరోజే ఈ సంఖ్య 1600కు చేరిందని అన్నారు. టీ లవర్స్‌ ఉండే ప్రతిచోటకు ఈ మెషిన్‌ను అందుబాటులోకి తీసుకువెళ్లడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్‌ వైర్‌మెన్‌ పరీక్ష దరఖాస్తుల గడువు పెంచాలి

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్‌ వైర్‌మెన్‌, సూపర్‌ వైజర్‌ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 22 వరకు పొడగించాలని తెలంగాణ ప్రైవేటు ఎలక్ట్రికల్‌ వర్కర్స్‌ అసోసియేషన్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి, ప్రధానకార్యదర్శి నేమాల బెనర్జీలతో కూడిన బృందం సాంకేతిక విద్యాశాఖ శిక్షణ మండలి కార్యదర్శి ఎ.పుల్లయ్య సహా తెలంగాణ ఎలక్ట్రికల్‌ లైసెన్సింగ్‌ బోర్డు కార్యదర్శి టి.కాంతారావులను వేర్వేరుగా కలిసి వారికి వినతిపత్రాలు అందజేశారు. సభ్యుల విజ్ఞప్తికి వారు సానుకూలంగా స్పందించినట్లు వారు ప్రకటించారు. ఆన్‌లైన్‌లో ప్రకటనకు తోడు వరస సెలవుల వల్ల చాలా మందికి ఈ సమాచారం వెళ్లలేదని వారు వివరించారు. దరఖాస్తు గడువు పెంచడం వల్ల మరింత మంది అభ్యర్థులకు మేలు చేకూరే అవకాశం ఉందని వారు కోరారు.

ఇన్‌స్పెక్టర్‌ హరిభూషణ్‌కు జాతీయ బహుమతి



సాక్షి, సిటీబ్యూరో: ఏపీ మహేష్‌ కో–ఆపరేటివ్‌ అర్బన్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌లో గత ఏడాది చోటు చేసుకున్న భారీ సైబర్‌ నేరాన్ని దర్యాప్తు చేసిన సైబర్‌ క్రైమ్‌ ఇన్‌స్పెక్టర్‌ హరిభూషణ్‌ రావుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నైజీరియన్లతో సహా అనేక మంది కలిసి రూ.12.48 కోట్లు కొల్లగొట్టిన ఈ కేసును సిటీ సైబర్‌ క్రైమ్‌ పోలీసులు పక్కా సాంకేతికంగా దర్యాప్తు చేసి పలువురిని అరెస్టు చేశారు. నేషనల్‌ క్రైమ్‌ రికార్డ్స్‌ బ్యూరో (ఎన్సీఆర్బీ) నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన స్టేట్‌ సైబర్‌ నోడల్‌ ఆఫీసర్స్‌ కాన్ఫరెన్స్‌లో గురువారం హరిభూషణ్‌ ఈ కేసుపై ప్రజెంటేషన్‌ ఇచ్చారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న ఎన్సీఆర్బీ ఆయనకు జాతీయ స్థాయిలో మూడో బహుమతి ప్రకటించింది.

మధ్యాహ్న భోజన వంట కార్మికుల గౌరవ వేతనం పెంచాలి

పంజగుట్ట: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వంట కార్మికులకు ప్రతి నెలా గౌరవ వేతనం రూ.3 వేలు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం డిమాండ్‌ చేసింది. లేకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హన్మాండ్లు చారి, ఉపాధ్యక్షురాలు జి.సంతోష, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.మంజుల, ప్రధానకార్యదర్శి డి.బాబాయిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీ, ఆశావర్కర్స్‌, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి మూడుసార్లు చొప్పున పెంచారని, తాము ఏం పాపం చేశామని ప్రశ్నించారు. గత 8 నెలలుగా బిల్లులు ఇవ్వలేదని, పెరిగిన ధరలతో తాము ఎలా బతుకుతామని ప్రశ్నించారు.



దంచికొట్టిన వాన.. ముంచెత్తిన వరద

మునిగిన కాలనీలు, బస్తీలు | జలమయమైన రహదారులు | ఎక్కడిక్కడ స్తంభించిన ట్రాఫిక్

ఒక్కసారిగా దంచికొట్టిన వానకు ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీ రోడ్లు నీట మునిగాయి. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి జూబ్లీహిల్స్, బంజారాహి ల్స్, శ్రీకృష్ణానగర్, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, ఖైరతాబాద్ రహదారులన్నీ జలమయం అయ్యా యి. ముఖ్యంగా మరోసారి వరద నీరు శ్రీకృష్ణానగర్‌ను ముంచెత్తింది. భారీ ఎత్తున వరద ప్రవహించడంతో ఇక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి. శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోవడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. యధావిధిగా ఖైరతాబాద్ రైల్వే గేటు జంక్షన్‌తోపాటు షాదన్ కాలేజీ వద్ద పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోయింది.

– బంజారాహిల్స్


శ్రీకృష్ణానగర్ వీధుల్లో వరద నీరు


శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో...


అమీర్‌పేట్‌లో...




జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో...


ఖైరతాబాద్‌లో...


దానం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఇందిరానగర్ బస్తీవాసులు

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఫిలింనగర్: ప్రజల ఆలోచనలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ నడుచుకుంటున్నారని ఎన్నికల ముందు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎన్నికలకు ముందు తాము డబుల్ బెడ్‌రూమ్‌లు, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, మైనార్టీ బంధు హామీలు ఇవ్వలేదని అయినా సరే ఇవన్నీ ఇస్తున్నన్నదని తెలిపారు. గురువారం జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో వందలాది మంది మహిళలు, యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల కోసమే సీఎం తాపత్రయమన్నారు. ఇంకా పనులు చాలా చేయాల్సి ఉందని వెల్లడించారు. మా మీద నమ్మకంతో బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి ఏం చేస్తామో చెప్పడానికి ఇక్కడికి వచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. ఇన్ని పథకాలు అమలుచేస్తున్న తమను ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత బోజిరెడ్డి, స్థానిక నేతలు రాజేష్, కార్తీక్, వినోద్, కిట్టు, వెంకటేష్, శ్రీశైలం, శంకర్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జేహెచ్‌పీఎస్‌లో ఘనంగా హిందీ దివస్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలో అధికారికంగా, విస్తృతంగా మాట్లాడే భాష హిందీ అని ఈ సందర్భంగా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పి. కాంచనవల్లి తెలిపారు. హిందీలో కార్యక్రమాలతో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. పాటలు, నృత్యాలు, పద్యపఠనం ద్వారా హిందీ ప్రాముఖ్యతను తెలియజేశారు. స్వచ్ఛ భారత్‌పై నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంచనవల్లి మాట్లాడుతూ... దైనందిన జీవితంలో హిందీ ఎంతో ప్రాముఖ్యతను చోటు చేసుకుందున్నారు. ప్రతి ఒక్కరూ భాషపట్ల గర్వపడాలన్నారు. పాఠశాలలోని ప్రతి ఒక్కరూ హిందీని మాధ్యమంగా తీసుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.

కనులపండువగా ఎడ్లపొలాల మాస పండుగ


ఎడ్ల పండుగ వేడుకల్లో పాల్గొన్న మున్నూరుకాపులు

బంజారాహిల్స్: మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగుల, విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ట్యాంక్ బండ్‌పై ఎడ్లపొలాల మాస, బొడ్డెమ్మ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో వ్యవసాయదారులు పంటను పండించేందుకు సహాయపడే ఎడ్లను పూజించి గౌరవించే గొప్ప సంప్రదాయ పండుగ ఎడ్లపొలాల మాసమని సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల శ్రీనివాస్ పటేల్ వెల్లడించారు. ట్యాంక్‌బండ్ మీద రఘుపతి వెంకటరత్నం నాయుడు విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎడ్ల అలంకరణ, పూజ, ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. మున్నూరుకాపు రైతులు, పెద్దలు, మేధావులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ ఎడ్లపొలాల మాసం పండుగలో పాల్గొన్నారు. ఎడ్లను పూజిద్దాం, వ్యవసాయాన్ని రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ పండుగ ద్వారా భవిష్యత్ తరాలకు వ్యవసాయ ప్రాముఖ్యతను తెలపాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. సంఘం ప్రతినిధులు ఎనుముల రాజు పటేల్, శ్రవణ్ కుమార్ పటేల్, వామన్ పటేల్, దుర్గం రవీందర్, మహంతి వెంకట్ రావు, జూబ్లీహిల్స్ నియోజక వర్గం బీజేపీ నాయకులు ఆలపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

రహమత్‌నగర్: గణేష్ ఉత్సవాల నిర్వహకులు పోలీసుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్‌ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. బోరబండ గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం బుధవారం రాత్రి శ్రీరాంనగర్‌లోని ప్రైమ్ గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏసీపీ మాట్లాడుతూ... మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాల జరుగకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు అంబులెన్స్‌కు వెళ్లేందుకు దారి వదలాలని సూచించారు. ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించిన నిర్వాహకులకు పోలీసు శాఖ అధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సన్మానాలు చేయాలని నిర్ణయించిందన్నారు. నిమజ్జనానికి తరలి వెళ్లేటప్పుడు క్రమపద్ధతిలో వాహనాలు తరలించాలని, ప్రధానంగా వృద్ధులు, పిల్లలను వాహనాల వెంట తీసుకెళ్లరాదని సూచించారు. సాధ్యమైనంత వరకు పగటి వేళాల్లో గణనాథుల విగ్రహాలను తరలించేందుకు ప్రయతి్నంచాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌స్పెక్టర్ కాముల్ల రవికుమార్, సెక్టార్ ఎస్ఐలు భూపాల్‌గౌడ్, సర్దార్ జమాల్, సప్నారెడ్డి, మనోజ్ కుమార్, తుల్జారాం నాయక్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ నగర నాయకులు కంది మోహన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ నందరాజ్‌గౌడ్, కో కన్వీనర్ భరత్‌గౌడ్, బోరబండ కన్వీనర్ కృష్ణ మోహన్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలో నీరు కలుషితమవుతున్న ప్రాంతాలను జలమండలి అధికారులు, సిబ్బంది గురువారం గుర్తించారు. ఏడాదిగా కలుషిత నీటితో లబోదిబోమంటున్న మధురానగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు అనేకమార్లు జలమండలి అధికారులకు, కాలనీ సంక్షేమ సంఘానికి ఫిర్యాదులు చేశారు. ఆ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇటీవల కలుషిత నీరు తాగి కాలనీలోని ఏ–బ్లాక్‌కు చెందిన ఇరువురు బాలికలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని రెండు రోజుల క్రితం 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన జలమండలి ఎండీ విచారణ చేయాలని చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)కు సమాచారం అందించారు. దాంతో సీజీఎం రెండు రోజుల కిందట కాలనీలో పర్యటించి వాస్తవాన్ని తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేయడానికి అంచనాలు తయారు చేయాలని కింది స్థాయి అధికారులకు తెలియజేశారు. ఎక్కడ నీరు కలుషితమం అవుతుందో తక్షణం తెలుసుకోవాలని చెప్పారు. సిబ్బంది మధురానగర్‌కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తిల సహకారంతో రెండురోజుల పాటు శ్రమించి ప్రత్యేక డిటెక్టర్‌ను తీసుకువచ్చి పలు ప్రాంతాల్లో పరీక్షలు చేశారు. ఎట్టకేలకు గురువారం ఏ–బ్లాకు, సి–బ్లాకుల్లో రెండుచోట్ల నీరు కలుషితమవుతున్నట్టుగా గుర్తించి ఉన్నతాధికారులకు రిపోర్టును పంపారు. ఆయా ప్రాంతాల్లో మరమ్మతు కార్యక్రమాలను చేపట్టారు. పాతపైపు లైన్లు తొలగించి ఆ స్థానంలో నూతన పైపులైన్ల నిర్మాణం చేపట్టడానికి జలమండలి అధికారులు అంగీకరించడం పట్ల కాలనీ అసోసియేషన్ నేతలు, కాలనీవాసులు అభినందించారు.


డిటెక్టర్‌తో నీరు కలుషితమవుతున్న ప్రాంతాలను తెలుసుకుంటున్న జలమండలి సిబ్బంది

అన్నదానం

వెంగళరావునగర్: ప్రజలు సుఖశాంతులతో విరాజిల్లాలను ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశామని రహమత్‌నగర్ వర్తక సంఘం నాయకులు అన్నారు. రహమత్‌నగర్ చౌరస్తాలో గురువారం వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీఅన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. వర్తక సంఘం నేతలు తాడికొండ కృష్ణమూర్తి గుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, పి.వి.బ్రహ్మనందం, ప్రభు, ఆంజనేయులు యాదవ్, చందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

వెంగళరావునగర్: నగరంలోని నిరుపేదలను ఆదుకోవడానికి లయన్స్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేసు మల్లారెడ్డి తెలియజేశారు. బోరబండలోని శ్రీవెంకట పద్మావతి జూనియర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో గురువారం లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నిరుపేదలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్ భూషణ్‌రెడ్డి, లయన్ ధనశేఖర్‌రెడ్డి, లయన్ అవంతీరెడ్డి, లయన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



విజయానికి చేరువలోనే కాంగ్రెస్

● సికింద్రాబాద్ అబ్జర్వర్ రుబీమనోహర్

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ విజయానికి చేరువలోనే ఉందని అయితే కార్యకర్తలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్, తమిళనాడు ఎమ్మెల్యే రుబీమనోహర్ అన్నారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. రుబీమనోహర్ మాట్లాడుతూ... పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ పార్టీని విజయతీరాలకు చేర్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత ఉందని ఇలాంటి సమయంలో పార్టీ కార్యకర్తలు వారికి అండగా ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ మొదటి సారిగా తుక్కుగూడలో జరిగే బహిరంగ సభకు హాజరవుతున్నారని, కాంగ్రెస్ బలాన్ని ఇతర పార్టీలను నిరూపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... డీసీసీ పరిధిలోని ఐదు నియోజకవర్గాల్లో భారీగా కార్యకర్తలను సమీకరిస్తున్నట్లు చెప్పారు. రమేష్, నారికెళ్ల నరేష్, గోల్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న కల్వ సుజాత

బంజారాహిల్స్: తుక్కుగూడలో ఈ నెల 17వ తేదీన జరగబోయే కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని ఖైరతాబాద్ విజయభేరి సభ ఇన్‌చార్జి సుజాత కోరారు. ఇందుకు సంబంధించిన సమావేశం ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీ పీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి నేతృత్వంలో జరిగింది. సభకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నేతలు తరలి రావాలని ఆమె విజ్ఞప్తిచేశారు. సభను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీలతో వెళ్లాలని విజయారెడ్డి కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయిని హైమావతికి ప్రముఖుల నివాళి

వెంగళరావునగర్: ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగళ్ల రాంబాబు మాతృమూర్తి హైమావతి సంస్మరణ సభ మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగింది. కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, చంద్రమహేష్, ఈశ్వర్‌రెడ్డి, ఆర్.సి.ఎం.రాజు, లక్ష్మి (నిమ్స్), రచయిత్రి విజ్ఞాన్ శశిబాల, సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నేరెళ్ల మాల్యాద్రి, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కోశాధికారి చిత్తరంజన్ దాస్, రచయిత సత్య తుమ్మల, సినీ నటి చెల్లి స్వప్న, సంగీత దర్శకులు ఖుద్దూస్, ఇండియా టుడే మాజీ ఎడిటర్ సూర్య ప్రకాశరావు, సీనియర్ జర్నలిస్ట్ కిశోర్, ఆర్టిస్ట్ శ్రీధర్ తదితరులు హైమావతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సినీ, టీవీ రంగానికి చెందిన ప్రముఖులు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైమావతి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డును పొందారని, రచయిత్రిగా, సాహిత్యపరంగా ఆమె ఎన్నో సేవలు చేశారని కొనియాడారు.

29 నుంచి హైలైఫ్ ఫ్యాషన్ డిజైనరీ ఎగ్జిబిషన్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మోడల్స్

వెంకటేశ్వరకాలనీ: ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1 వరకు హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ ఫ్యాషన్ డిజైనరీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లో జరిగింది. ఫ్యాషన్ ప్రియుల కోసం నిర్వహిస్తున్న అతిపెద్ద ఫ్యాషన్, లగ్జరీ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ అని వారు తెలిపారు. మోడల్స్ డిజైనరీ దుస్తులు, ఆభరణాలు ధరించి సందడి చేశారు.

హిందీని ఉపయోగించేలా ప్రోత్సహించాలి

హిమాయత్‌నగర్: యువతను హిందీ భాషను ఉపయోగించేలా ప్రోత్సహించాలని పలువురు వక్తలు సూచించారు. తెలంగాణ హిందీ జర్నలిస్ట్ అసోసియేషన్, గుజరాతీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిందీలో సేవలందిస్తున్న జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలను సన్మానించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్, తెలంగాణ గీత కార్మిక సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మ పల్లె రవికుమార్, గుజరాతీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, అగర్వాల్ సమాజ్ ట్రస్ట్ ఆత్మగౌరవ భవన్ అధ్యక్షుడు రాజేష్ అగర్వాల్, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ శశికాంత్‌మిశ్రా ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మాల మహానాడు నగర అధ్యక్షుడు గిరీంధర్ మృతి



వెంగళరావునగర్: మాల మహానాడు నగర అధ్యక్షుడు కట్టెల సాయి గిరీంధర్(50) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహానగర్‌లోని సాయిగిరి గ్రేటర్ హైదరాబాద్ రికగ్నైజ్డ్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతదేహాన్ని ఎల్ఎన్ నగర్‌లోని సాయిగిరి హైస్కూల్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే విష్ణు, కాంగ్రెస్ నాయకులు భవానీశంకర్, బిట్ల సుశీల్‌కుమార్, ఎంఐఎం మాజీ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర మాల మహానాడు జేఏసీ చైర్మన్ రాంచందర్, అద్దంకి దయాకర్, బీజేపీ నాయకులు లంకెల దీపక్‌రెడ్డి, కుంభాల గంగరాజు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు సాయిగిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


డి.సాకేత్


అంకురి ఎల్లయ్య

ఫిలింనగర్: వేర్వేరు ప్రాంతాల్లో వృద్ధుడు, బాలుడు అదృశ్యమయ్యారు. ఫిలింనగర్ పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీలో నివసించే డి.సాకేత్(14), మహబూబాబాద్ గిరిజన హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. అయితే హాస్టల్‌లో ఉండటం నచ్చని ఈ బాలుడు ఇటీవల హాస్టల్‌నుంచి తల్లి రజిత వద్దకువచ్చాడు. సముదాయించిన తల్లి హాస్టల్‌కు పంపించాలని ఈ నెల 12వ తేదీన ఉదయం కొడుకును తీసుకొని ఇంటి బయటికి వచ్చింది. ఇంటి తాళం వేస్తున్న సమయంలోనే సాకేత్ తల్లికళ్లుగప్పి అక్కడి నుంచి పారిపోయాడు. పట్టుకోవడానికి ప్రయత్నించగా సందుల్లో నుంచి పారిపోయాడు. అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన కొడుకు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61497లో సంప్రదించాలని ఎస్ఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

మరో ఘటనలో...

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు అదృశ్యం కాగా ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. వివరాలివీ... మహబూబ్‌నగర్ జిల్లా రేవల్లి మండలం గోపాలపేట గ్రామానికి చెందిన అంకురి ఎల్లయ్య(75) ఆరు నెలల క్రితం షేక్‌పేట వినాయకనగర్‌లో నివసించే తన కొడుకు నాగరాజు వద్దకు వచ్చాడు. ఈ నెల 13న అనుమానాస్పదంగా ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. అన్ని పాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 9490911468లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● విటుడు.. నిర్వాహకుల అరెస్టు

వెంగళరావునగర్: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కు చెందిన కాటం రాధాకృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఎం.శ్రీదేవి మధురానగర్ డి–బ్లాకులోని గృహంలో ఉంటూ గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం చేయిస్తున్నారు. మధురానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ మాధవిరెడ్డి ఆ గృహంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. నిర్వాహకులు రాధాకృష్ణ, శ్రీదేవిలతో పాటుగా పక్క గదిలో ఒక జంట అశ్లీలంగా కనిపించారు. దాంతో నిర్వాహకులతో పాటుగా విటుడు ప్రసాద్‌రాజు, మహిళను కూడా అరెస్టు చేసి మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ. 5600, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

కౌంటర్ దాఖలుకు మూడు నెలలా?

- రాష్ట్ర ప్రభుత్వానికి అంత సమయం ఇవ్వలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరించడంపై కౌంటర్ దాఖలు చేయడానికి 3 నెలల సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరగా, అందుకు హైకోర్టు నిరాకరించింది. వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది. రాష్ట్రంలోని నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా పలువురు అక్రమార్కులు చట్టవిరుద్ధంగా ఇలాంటి భూములను క్రమబద్ధీకరణ చేయించుకునే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. కష్టపడి డబ్బు కూడబెట్టుకుని తక్కువ మొత్తంలో భూమి కొన్న పేదలకు ఇలాంటి చర్యలు తప్పుడు సంకేతాలనిస్తాయన్నారు. 125 చదరపు గజాలు అంతకంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఆస్తులకు స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ నుంచి పూర్తి మినహాయింపు ఇస్తే రాష్ట్ర ఖజానా పెద్దఎత్తున ఆదాయం కోల్పోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నోటరీ భూ విక్రయ లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి సంబంధించి జూలై 26న ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 84 కొట్టివేయాలని కోరుతూ ది భాగ్యనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. జీవో 84 చట్ట విరుద్ధంగా ఉందన్న అభిప్రాయాన్ని గతంలోనే ధర్మాసనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గురువారం విచారణ సందర్భంగా స్పెషల్ జీపీ హరిందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. కౌంటర్ దాఖలుకు మరో 3 నెలల సమయం కావాలన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. ఆస్తి బదిలీ చట్టంలో నిబంధనలు లేకుండా నోటరీ పత్రాలను క్రమబద్ధీకరించడం ఎలా సాధ్యం అని ప్రశ్నించింది. వారం సమయం ఇస్తున్నామని, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, 21వ తేదీకి విచారణ వాయిదా వేసింది.

ఇద్దరు యువకుల మధ్య పబ్‌లో గొడవ

ఈ ఘటనలో మాజీ డీజీపీ తనయుడు

బంజారాహిల్స్ (హైదరాబాద్): పబ్‌లో వీడియో విషయంలో తలెత్తిన గొడవ పెద్దదవడంతోపాటు పరస్పరం దాడులకు దిగిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం రాత్రి ఏపీ మాజీ డీజీపీ కొడుకు డేవిడ్ సవాంగ్ (29) తన స్నేహితులు సనా, సిద్ధార్థ్ నేగి, సమద్, యూసుఫ్‌తో కలిసి జూబ్లీహిల్స్‌లోని జీరో ఫార్టీ పబ్‌కు వచ్చాడు. అదే సమయంలో మాసబ్‌ట్యాంక్‌కు చెందిన సిద్ధార్థ్ మాగ్నాని (28) కూడా తన స్నేహితులు రామకృష్ణ దత్, ఆరిబ్ అలీ, అబ్దుల్‌రెహమాన్, నబీద్‌తో కలిసి వచ్చాడు. వారి కామన్ ఫ్రెండ్ మయూర్ తొలిసారిగా పబ్‌లో లైవ్ బ్యాండ్‌లో పాల్గొంటున్న సందర్భంగా ఇరువర్గాలకు చెందిన స్నేహితులు పబ్‌కు వచ్చారు. సిద్ధార్థ్, డేవిడ్ సవాంగ్ మధ్య కొంత కాలంగా ఓ యువతితో స్నేహం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పబ్‌లో పాడుతున్న మయూర్‌తోపాటు అతడి స్నేహితులను సిద్ధార్థ వీడియోలు తీస్తుండగా డేవిడ్ సవాంగ్ అడ్డుచెప్పాడు. మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. ఈ క్రమంలో డేవిడ్ సవాంగ్ స్నేహితుడి వెంట వచ్చిన యువతిపట్ల సిద్ధార్థ్ తదితరులు అసభ్యకరంగా ప్రవర్తించడంతో గొడవ ముదిరింది. తర్వాత రెండు గ్యాంగ్‌లు పబ్ నుంచి కిందికి వచ్చి పార్కింగ్ వద్ద పరస్పరం దాడులు చేసుకున్నాయి. సిద్ధార్థ్, డేవిడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి, హైదరాబాద్: మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో దొరికిన తీగను లాగుతుంటే టాలీవుడ్ డ్రగ్ డొంక కదులుతోంది. తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్-నాబ్) అధికారులకు గత నెల 31న అక్కడి సర్వీస్ ఫ్లాట్‌లో చిక్కిన వారిలో ఫిల్మ్ ఫైనాన్షియర్ కె.వెంకటరమణారెడ్డి ఉండగా... గురువారం పట్టుబడిన వారిలో 'డియర్ మేఘ' చిత్ర దర్శకుడు అనుగు సుశాంత్ రెడ్డి ఉన్నారు. హీరో నవదీప్, 'షాడో' చిత్ర నిర్మాత రవి ఉప్పలపాటి తదితరులు పరారీలో ఉన్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. ఐసీసీసీలో టీఎస్-నాబ్ ఎస్పీ (వెస్ట్) డి.సునీతా రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

టాలీవుడ్ తెరపై
మరో డ్రగ్ మరక

8 మందిని అరెస్ట్ చేసిన నార్కోటిక్స్ బ్యూరో • వీరిలో 'డియర్ మేఘ' సినీ దర్శకుడు, నైజీరియన్లు

రూ. 10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం • పరారీలో హీరో నవదీప్, నిర్మాత రవి

స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో...

నెల్లూరుకు చెందిన బి.బాలాజీ గతంలో ఇండియన్ నేవీలో అధికారిగా పని చేశాడు. కంటికి తీవ్రమైన గాయం కావడంతో మెడికల్లీ అన్‌ఫిట్ అయ్యాడు. దీంతో నేవీ నుంచి బయటకు వచ్చి వ్యాపారిగా మారాడు. తరచుగా హైదరాబాద్‌కు వచ్చి వెళ్లే బాలాజీ తన స్నేహితులతో కలిసి ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లోని సర్వీస్ ఫ్లాట్‌లో రేవ్ పార్టీలకు హాజరయ్యేవాడు. ఇలా ఇతడికి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు ఏర్పాటు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి దీని ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు...

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్బావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణా రెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితోపాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నార్ట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే పీఎస్ కృష్ణ ప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదులు ఏర్పాటుచేసి డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో ప్రముఖులు, సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవదీప్, రవి

2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్బావే మైకేల్, థామస్‌తోపాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి సహా మిగిలిన నిందితులు తమ ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో సహా పరారయ్యారు.

సినిమాల్లోని సీన్లపైనా నజర్

- డ్రగ్స్ వినియోగం ప్రేరేపించేలా ఉంటే చర్యలు
- ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమా టీమ్‌కు నోటీసులు
- బాలీవుడ్‌పైనా దృష్టి పెట్టేలా ఎన్సీబీకి సమాచారం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్-నాబ్) అధికారులు మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న జరిగిన ఓ డ్రగ్ పార్టీపై దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్... ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్, టీఎస్ నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చామని, వారు తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చారని గురువారం చెప్పారు. అందులో ఉన్న సీన్లపై తాము చెప్పిన తర్వాతే సినిమాలో వార్నింగ్ నోట్ పెట్టారని, అప్పటివరకు అలాంటిది కూడా లేదని అన్నారు. ఇలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలను సినిమాల్లో పెట్టవద్దని ఆనంద్ హితవు పలికారు. వీటి ద్వారా స్ఫూర్తి పొంది అనేక మంది యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సీన్లతో కూడిన సినిమాలు వచ్చాయని, అయితే వాటిని ఎవరూ పట్టించుకోలేదని చెప్పిన ఆనంద్.. ఇకపై ఈ తరహాలో ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'టాలీవుడ్ లింకులు ఉన్న డ్రగ్స్ కేసు'లో పరారీలో ఉన్న సూర్య.. స్నార్ట్ అనే పేరుతో పబ్ నిర్వహిస్తున్నాడని, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను స్నార్టింగ్ ప్రక్రియ ద్వారా వినియోగిస్తారని చెప్పారు. దీన్ని బట్టి సూర్య తన వద్ద మాదకద్రవ్యాలు లభిస్తాయని అర్థం వచ్చేలా తన పబ్‌కు పేరు పెట్టాడని భావించాల్సి వస్తోందని ఆనంద్ వ్యాఖ్యానించారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించే సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరతామన్నారు. ఎన్సీబీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారని, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. తాము ఇటీవల కాలంలో 33 మంది నైజీరియన్లను అరెస్టు చేయగా, వారిలో 18 మంది బెంగళూరులో స్థిరపడిన వారిగా తేలిందన్నారు. టీఎస్ నాబ్ సేవల విస్తరణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరతామని చెప్పారు.

డ్రగ్స్, హత్యలులేని తెలంగాణ కావాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


సభలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

ముషీరాబాద్(హైదరాబాద్): మాదకద్రవ్యాల వినియోగంలో తెలంగాణ మరో పంజాబ్ మాదిరిగా మారకముందే కేసీఆర్ ప్రభుత్వం మేలుకొని డ్రగ్స్, హత్యలు, వడ్డీ వ్యాపారం లేని ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం యునైటెడ్ ముస్లిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద 'మాదకద్రవ్యాలు, హత్యలు, వడ్డీ వ్యాపారం ఊబి నుంచి యువతను ఏవిధంగా కాపాడాలి'అనే అంశంపై నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకూ డ్రగ్స్, హత్యలు, వడ్డీ వ్యాపార సంస్కృతి వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మౌలానా ఖైరొద్దీన్ సూఫీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జద్ ఉల్లాఖాన్, నగర ముస్లిం మతపెద్ద మౌలానా జాఫర్ పాషా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు 54 టెండర్లు

రేపు ఫైనాన్షియల్ బిడ్లు తెరిచిన తర్వాత అర్హుల ఎంపిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లుల్లో మూలుగుతున్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంచి స్పందన లభించింది. తొలి విడతగా 25 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని విక్రయించాలని భావించిన పౌరసరఫరాల సంస్థ ఈ మేరకు గత నెలలో టెండర్లను ఆహ్వానించింది. 25 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని 25 లాట్లుగా విభజించి , ప్రతి ఎల్‌ఎంటీ ఒక లాట్‌గా ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించింది. గురువారంతో గడువు ముగియగా, సాయంత్రం 5 గంటలకు అధికారులు టెక్నికల్ బిడ్లు తెరిచారు. 25 లాట్ల కోసం మొత్తం 54 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో 8 లాట్లకు సంబంధించి కేవలం ఒక్కో బిడ్ మాత్రమే దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా 17 లాట్ల కోసం 46 సంస్థలు పోటీ పడ్డాయి.

యాసంగిలో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గత యాసంగి (2022-23)లో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని సేకరించారు. ఈ మొత్తం ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేయగా, అందులో కొంత భాగం అకాల వర్షాల కారణంగా తడిచిపోయింది. తడిసిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని కూడా ముడి బియ్యంగా మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు నిరాకరించారు. బాయిల్డ్ రైస్‌గా మాత్రమే ఇస్తామని చెప్పినా, కేంద్రం నిబంధనలతో అది సాధ్యం కాలేదు. దీంతో మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఏక మొత్తంగా విక్రయించాలని ప్రభుత్వం భావించింది. పౌరసరఫరాల సంస్థ సీఎండీ అనిల్‌కుమార్ ఈ మేరకు నివేదిక రూపొందించగా, తొలి విడత 25 ఎల్‌ఎంటీలు విక్రయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు గత నెలలో ప్రక్రియ ప్రారంభం అయింది. గురువారం గడువు ముగిసే సమయానికి 54 టెక్నికల్ బిడ్లను ధ్రువీకరించారు. ఈ సంస్థల పూర్వాపరాలు పరిశీలించి, అర్హత పొందిన వాటిని ఫైనాన్షియల్ బిడ్లకు ఎంపిక చేస్తారు. ఈనెల 16న ఫైనాన్షియల్ బిడ్లను తెరిచిన అనంతరం ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు నేతృత్వంలోని కమిటీ అర్హులైన సంస్థలను ఎంపిక చేయనుంది.

తప్పుడు ప్రచారం చేస్తే రుణాలు ఆపేస్తాం

- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె. సింగ్
- తెలంగాణ సీఎం విద్యుత్‌రంగంపై విష ప్రచారం చేస్తున్నారు
- వ్యవసాయానికి తప్ప అన్నింటికీ మీటర్లు పెట్టాల్సిందే
- విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వంపై విద్యుత్ రంగానికి సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేస్తే.. రుణాలు, సబ్సిడీలు ఆపేస్తామని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ హెచ్చరించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల ఏర్పాటు, విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తారంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ విషప్రచారం చేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు మినహా అన్నింటికి మీటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం స్పష్టం చేసిందని చెప్పారు. విద్యుత్ సంస్థల ఆడిట్ నివేదికలు, ఎనర్జీ ఆడిట్ ఎప్పటికప్పుడు చేయించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ సంస్థలు రుణాలు చెల్లించే స్థితిలో లేవని తమకు సమాచారం అందిందని మంత్రి తెలిపారు. గురువారం ఇక్కడ మంత్రి ఆర్.కె. సింగ్, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, విద్యుత్ శాఖ సహాయ మంత్రి క్రిషన్‌పాల్ గుర్జర్‌లు 'విద్యుత్ శాఖ'పై ఏర్పాటైన పార్లమెంట్ సభ్యుల కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆర్.కె. సింగ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వానికి గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) రూ.1.57 లక్షల కోట్ల రుణం మంజూరు చేస్తే అందులో ఇప్పటికే రూ. 1.38 లక్షల కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు. అలాగే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.1.10 లక్షల కోట్లు మంజూరు అయితే.. రూ.91 వేల కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు.


మాట్లాడుతున్న ఆర్.కె.సింగ్. చిత్రంలో కిషన్‌రెడ్డి

ఎన్టీపీసీ 4 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు నిర్మిస్తుంది..: రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో ఎన్టీపీసీ 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లను నిర్మిస్తుందని కేంద్ర మంత్రి ఆర్.కె. సింగ్ తెల్పి చెప్పారు. ఇప్పటికే ఒక్కొక్కటి 800 మెగావాట్ల రెండు యూనిట్లు సిద్ధమయ్యాయని, ఈనెల 26న ఒక యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తుందని, మరొకటి డిసెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తుందని ఆయన వెల్లడించారు. వీటిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. మిగిలిన 2,400 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలని ఎన్టీపీసీ కోరినా స్పందించడం లేదన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోయినా ఎన్టీపీసీ ఒక్కొక్కటీ 800 మెగావాట్లుగల మూడు యూనిట్లను నిర్మిస్తుందని తెల్పి చెప్పారు. కాగా, దేశం మొత్తాన్ని ఒకే గ్రేడ్ కిందకు తీసుకువచ్చి 1.97 లక్షల కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్‌లు వేసినట్లు చెప్పారు. తద్వారా దేశంలో ఏకకాలంలో 1.20 లక్షల మెగావాట్ల విద్యుత్‌ను ఎక్కడి నుంచి ఎక్కడికైనా సరఫరా చేసే సామర్థ్యం ఏర్పడిందని మంత్రి వివరించారు.

ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మృతి

- వారికి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉండటం వల్లేనంటున్న అధికారులు
- సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష
- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మరణించారని ఆ జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వైద్యాధికారులు డెంగీ మరణాలపై మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు.

జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు...

రాష్ట్రంలో అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పిల్లల జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్న అంశాలను మంత్రి వివరించారు. డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదన్నారు. జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని, ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్ వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల్లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. మీడియా సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఊరి పేరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని ప్రేమ్‌నగర్. ఈ గ్రామ జనాభా 300 మంది కాగా, వీరిలో 50 మందికిపైగా జ్వరాలతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం ఇక్కడ 30 మంది జ్వరాల బారిన పడగా, గ్రామానికి చెందిన యువకుడు అవినాష్ రెండు రోజుల క్రితం చనిపోయాడు. ఇదే గ్రామంలో తీవ్ర జ్వరంబారిన పడిన ఒకే కుటుంబానికి చెందిన రాంసింగ్, ఓంసింగ్, శారన్‌భాయ్‌లను కుటుంబ సభ్యులు బుధవారం మెరుగైన వైద్యానికి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇప్పుడా గ్రామం జ్వరాలతో విలవిల్లాడుతోంది.

ఏజెన్సీకి ఫీవర్

గోదావరి పరీవాహక ప్రాంతంలో విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాలు

వర్షాలు, వరదలతో నిన్నమొన్నటి వరకు అవస్థలు • తిరిగి అవే ప్రాంతాల్లో మంచం పట్టిన జనం

సాక్షిప్రతినిధి, వరంగల్: జూలై ,ఆగస్టు మాసాల్లో కురిసిన ఎడతెరపి లేని వర్షాలు గోదావరి పరీవాహక ఏజెన్సీ పల్లెలను కుదిపేశాయి. ఇప్పుడా ప్రాంతాలను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు అనేక గ్రామాలు డెంగీ, మలేరియాల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి పూర్వ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆయా జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే ఎనిమిదిమంది వృద్ధులు, మహిళలు, బాలురు మృత్యువాత పడగా, 15 నుంచి 25 రోజులైనా తగ్గని జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా జ్వరపీడితులే...

- వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు.. ఇప్పుడు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో విలవిలలాడుతున్నాయి. మహా ముత్తారం, గణపురం, తాడిచర్ల, రేగొండ, కాటారం, మొగుళ్లపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 250 మంది ఔట్‌పేషెంట్లుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.
- ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని పల్లెలు మంచం పట్టాయి. జిల్లాలో గత జనవరి నుంచి 51 మలేరియా, 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం తదితర మండలాల్లోని 39 గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు జనాలను జడిపిస్తున్నాయి. ముత్తారం మండలంలో బేగంపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందగా... డెంగీ బాధితుల సంఖ్య 89కి చేరినట్టు అధికారులు ప్రకటించారు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు, దంతాలపల్లి, మరిపెడ, కొత్తగూడ, గంగారం, కేసముద్రం, గార్ల తదితర మండలాల్లో డెంగీ, విషజ్వరాలు జడలు విప్పాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విషజ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 162, డెంగీ 273, విషజ్వరాలు 2,35,835 కేసులు నమోదయ్యాయి.



ఈ ఫొటోలో ఉన్న బాబు పేరు వర్షిత్‌కుమార్. ములుగు జిల్లా మంగపేట. రెండు రోజుల నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటున్నాడు. మలేరియా పాజిటివ్ వచ్చింది. రక్తం చాలా తక్కువ ఉందని వైద్యులు ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. తల్లి రమ్య పక్కనే ఉంటూ సపర్యలు చేస్తోంది.

వారం రోజులుగా జ్వరం తగ్గడం లేదు



మాది ములుగు జిల్లా మంగపేట మండలం రమణక్కపేట. నేను మూడు నెలల గర్భవతిని. వారం రోజుల నుంచి జ్వరం వస్తోంది. తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చా. చాలా నీరసంగా ఉంటోంది.

– సరిత, రమణక్కపేట, ములుగు జిల్లా

ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు

ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి


రజని (ఫైల్) మనీష (ఫైల్) మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని (35), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో నివాసి మనీష (30) విషజ్వరంతో మృతిచెందారు. వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప కూడా డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.







విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్టన్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్



ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మన దైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పాట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.

షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్టర్న్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసి పోతారు.

చెక్స్ శారీస్..



సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.



మనవైన హ్యాండ్లూమ్స్

ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.



వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో
ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు...
వైవిధ్యభరితమైన
మరెన్నో స్వీట్లను తినిపించి
ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పాఠోలి

కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాతోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలుపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాతోలీ రెడీ.



పతి శప్త

కావలసినవి: మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.



కేసి మిథోయ్

కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.

తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.



బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.



సేమియా లడ్డు

కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.



స్వీట్ సందేశ్

కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతుల తోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేశ్ రెడీ.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో'
అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు.
పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది.
ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు.
తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది.
కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో
మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు.
కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పితే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్లు చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వాలేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీమణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.


తల్లి మీనాతో విత్య, నిత్య

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్



స్వీట్ మూన్

అమ్మమ్మ నోటి నుంచి భక్తి భావనతో వినిపించే కీర్తనలు, గురుద్వారాలో విన్న కీర్తనలు బనత్ నోటి నుంచి తీయగా వినిపించేవి. బనత్ కౌర్ బగ్గాకు చిన్నప్పటి నుంచే సంగీతంతో చక్కని స్నేహం ఉంది. స్కూల్ ఫంక్షన్‌లలో, ఫ్యామిలీ ఫంక్షన్‌లలో తన పాట తప్పకుండా ఉండాల్సిందే.

అయిదు సంవత్సరాల వయసులోనే హార్మోనియం వాయించి శ్రోతలను అబ్బురపరిచింది. లా స్టూడెంట్‌గా ఉన్నప్పుడు డెబ్యూ సింగిల్ 'మూన్' వచ్చింది. పంజాబీ నేపథ్యం ఉన్న బనత్ హిందీ, పంజాబీ పాటలకు తనదైన మెరుపు ఇస్తుంది. సింగర్-సాంగ్ రైటర్‌గా పేరు తెచ్చుకున్న బనత్ కౌర్ బగ్గా పాప్ అండ్ రాక్, నియో క్లాసికల్ అండ్ ఫోక్‌లో మంచి పేరు తెచ్చుకుంది. తీరికవేళల్లో చక్కటి కవిత్వాన్ని ఆస్వాదించడం తనకు ఇష్టం. కొన్నిసార్లు మ్యూజిక్ కంటే కవిత్వ పంక్తులు రాసుకోవడం అంటేనే ఇష్టం. పిల్లల కోసం ముంబైలో 'క్లాస్‌రూమ్' పేరుతో మ్యూజిక్ స్కూల్ స్టార్ట్ చేసింది బనత్ కౌర్ బగ్గా.

● అవును... ఇది నిజమే!



- 'ది క్విక్ బ్రౌన్ ఫాక్స్ జంప్స్ వోవర్ ది లేజీ డాగ్' అనే వాక్యంలో ఆంగ్ల వర్ణమాలలోని అన్ని అక్షరాలు కనిపిస్తాయి.
- సంతోషంగా ఉండడం ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు? అయితే కొందరు మాత్రం సంతోషంగా ఉండడానికి భయపడతారు. దీనికి కారణం సంతోషంగా కనిపిస్తే కీడు జరుగుతుందనే మూఢ నమ్మకం. సంతోషంగా ఉండడానికి భయపడే లక్షణాన్ని చెరోఫోబియా అంటారు.
- ఒక దురలవాటు దూరం కావాలంటే గట్టిగా 21 రోజులు దాని జోలికి వెళ్లకుండా ఉంటే సరిపోతుందట.
- 'వోవర్ మారో' అంటే ఏమిటో కాదు ది డే ఆఫ్టర్ టుమారో(ఎల్లుండి) అని.

● టెక్.. టాక్



శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్9 ఆల్ట్రా

డిస్‌ప్లే: 14.60 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 1848x2960 పిక్సెల్స్
కనెక్టివిటీ: 5జీ బ్యాటరీ: 11200 ఎంఏహెచ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్, 512జీబి 12జీబి ర్యామ్



హానర్ 90 5జీ

డిస్‌ప్లే: 6.70 అంగుళాలు బరువు: 183 గ్రా.
రిజల్యూషన్: 1200x2664 పిక్సెల్స్ వోఎస్: ఆండ్రాయిడ్ 13 ;
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 256జీబి 16జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ



స్క్రీన్ షాట్స్ కోసం...

మ్యాక్‌వోఎస్‌ను ఉపయోగించి ల్యాప్‌టాప్‌లో స్క్రీన్‌షాట్ తీసుకోవడానికి... 1) క్యాప్చర్ చేయాలనుకున్న యాప్ లేదా వెబ్‌సైట్‌ను ఓపెను చేయాలి. 2) ఎంటైర్ స్క్రీన్‌ను క్యాప్చర్ చేయడానికి... షిఫ్ట్+కమాండ్+3 ప్రెస్. 3) స్క్రీన్‌లో మీకు కావాల్సిన భాగాన్ని కాప్చర్ చేయడానికి: షిఫ్ట్+కమాండ్+4 డ్రాగ్ అండ్ సెలెక్ట్



ఇన్‌స్టాలో స్టోరీ హైలైట్స్ యాడ్ చేయడానికి...

1) ప్రొఫైల్‌లోకి వెళ్లాలి. 2) స్టోరీలో హైలైట్ ట్యాబ్ 'న్యూ'ను ట్యాప్ చేయాలి. 3) మీరు యాడ్ చేయాలనుకున్న స్టోరీలను ఎంపిక చేసుకోవాలి. 4) టాప్ రైట్ కార్నర్‌లో 'నెక్ట్స్' ట్యాప్ చేయాలి. 5) కవర్ ఫోటోను పిక్ చేసుకోవాలి.

● గేమింగ్



ఆ గ్రహంలో ఆగ్రహంతో కదిలాడు

యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ స్టార్‌ఫీల్డ్ ఇటీవల విడుదలైంది. ఒక నగరం నుంచి మరో నగరానికి వెళ్లినంత సులభంగా ఈ గేమ్‌లో ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి వెళ్లవచ్చు. ప్లేయర్ అన్వేషణలో నాన్‌ప్లేబుల్ క్యారెక్టర్స్(ఎన్‌పీసీ) ఎదురవుతుంటాయి. వాటిలో కొన్ని ప్లేయర్ సైన్యంలో చేరవచ్చు. ప్లేయర్ ఎంపికపై తమ నిర్ణయాన్ని ప్రకటించవచ్చు. ప్రతి క్యారెక్టర్‌కు తమవైన శక్తిసామర్థ్యాలు ఉంటాయి. స్పేస్-థీమ్‌డ్ సెట్టింగ్స్‌లో జరిగే గేమ్ ఇది. ఫస్ట్-పర్సన్, థర్డ్-పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడవచ్చు. వెయ్యికి పైగా ప్లానెట్స్‌లో ప్లేయర్ ల్యాండ్ కావచ్చు. న్యూ అట్లాంటిస్ అనేది ఈ గేమ్‌లో అతి పెద్ద నగరం.

ఇంజిన్: క్రియేషన్ ఇంజిన్ 2 ప్లాట్‌ఫామ్స్: విండోస్ ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ మోడ్స్: సింగిల్-ప్లేయర్



ఏకే - ఫ్లేవర్ కాదు ఫైర్-బోల్ట్

టెక్నాలజీ, ఫిట్‌నెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్పోర్ట్స్...అనేవి అర్నవ్ కిశోర్(ఏకే) కలల ప్రపంచం. వాటిని మిళితం చేసి 'ఫైర్-బోల్ట్' స్టార్టప్ సృష్టించాడు. ఇది మన దేశంలోనే అతి పెద్ద వేరబుల్ టెక్ బ్రాండ్‌గా అవతరించింది. అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతుంది. 'మంచి టైమ్ సెట్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది' అంటాడు ఏకే...

● సక్సెస్ స్టోరీ

అర్నవ్ కిశోర్‌కు ఆటలు అంటే ప్రాణం. స్పోర్ట్స్‌మెన్, ఫిట్‌నెస్ ప్రేమికులకు ఉపయోగపడే గాడ్జెట్‌లను సృష్టించాలనేది తన భవిష్యత్ లక్ష్యంగా ఉండేది. వేరబుల్ టెక్ కంపెనీ 'ఫైర్-బోల్ట్'తో తన కలను నిజం చేసుకున్నాడు కిశోర్. స్మార్ట్ వేరబుల్ మార్కెట్‌ను తగిన అధ్యయనం చేసిన తరువాత మార్కెట్ వ్యూహాలు రచించుకున్నాడు.

అప్పటికే చైనాలోని దిగ్గజ టెక్ కంపెనీలు మన మార్కెట్‌లోకి వచ్చాయి. వాటితో పోటీ పడడం అంత సులభం ఏమీ కాదు. మంచి టైమ్ రావాలంటే ఆ టైమ్ ఎప్పుడు వస్తుందో ఓపిగ్గా ఎదురుచూడాలి. అర్నవ్ కిశోర్ అదే చేశాడు. సరియైన సమయం చూసి మార్కెట్‌లోకి దిగి విజయం సాధించాడు.

తొలి సంవత్సరం....'మన టైమ్ వచ్చేసింది' అనుకున్నాడు.

రెండో సంవత్సరం....'ఈ ఫైర్ ఇలాగే కొనసాగాలి' అనుకున్నాడు.

గత సంవత్సరం ఫైర్-బోల్ట్ నాయిస్ మన దేశంలోనే అతి పెద్ద స్మార్ట్ వాచ్ బ్రాండ్‌గా అవతరించింది.

ఆన్‌లైన్‌లోనే కాదు ఆఫ్‌లైన్ లోనూ సరసమైన ధరల్లో అందుబాటులో ఉండేలా చేయడమే కాదు, ఇన్నోవేటివ్, మార్కెట్-ఫస్ట్ ఫీచర్స్ కూడా కంపెనీ ఉత్పత్తులు విజయం సాధించడానికి ప్రధాన కారణం.

కంపెనీ ప్రాడక్ట్ లైన్‌లోనికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటి) డివైజ్‌లు, వైర్‌లెస్ ఇయర్ ఫోన్‌లు...మొదలైనవి వచ్చి చేరాయి.

ఇండియన్ మార్కెట్‌లో విజయం సాధించిన అర్నవ్ అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు.

వ్యాపారవేత్త అయిన తండ్రి నుంచి కిశోర్ నేర్చుకున్న పాఠం...

'నిరాశతో ప్రయాణాన్ని ఆపవద్దు. పరుగెత్తక పోయినా సరే, నడిస్తే చాలు. ప్రయాణంలోనే ఎన్నో విషయాలను నేర్చుకుంటాం. మంచి,చెడులను తెలుసుకుంటాం'

నిజానికి ప్రయాణ ప్రారంభంలోనే అర్నవ్ కిశోర్‌కి కోవిడ్ హాయ్ చెప్పి భయపెట్టింది. సంక్షోభ సమయంలో వ్యాపారవేత్త డీలా పడకూడదు. కిశోర్ ఆ సమయంలోనూ అధైర్య పడలేదు. వెనకడుగు వేయలేదు.

'ట్రెండ్స్ ఆఫ్ బ్యాండ్' ఏమిటి?

'పాపులారిటీ కోల్పోయిన బ్యాండ్స్ ఏమిటి?' అనే అంశంపై అవగాహన ఉన్న కిశోర్ 2021లో కొత్త స్ట్రాటజీతో ముందుకు వచ్చాడు. టింప్లింగ్ ట్యాగ్‌తో నింజా సిరీస్ స్మార్ట్ వాచ్‌లను తీసుకువచ్చి విజయం సాధించాడు.

'రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్ అండ్ డీ), డిజైన్ మార్కెట్‌లో మాకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగించాయి' అంటాడు కిశోర్.

యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు అందుకున్నాడు అర్నవ్ కిశోర్.

సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా అర్నవ్ కిశోర్ ఇప్పుడు చేయాల్సింది....ఎప్పటిలాగే ఆట తెలివిగా ఆడటం. అతి ఆత్మవిశ్వాసం ఉంటే ఆట తారు మారు అవుతుంది. ఇలాంటి విషయాలు అర్నవ్ కిశోర్‌కు తెలియనివేమీ కాదు. ఎందుకంటే ఈ యువ వ్యాపారవేత్త తండ్రి నుంచి ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నాడు.



యాన్ అప్‌హిల్ బ్యాటిల్/స్ట్రగుల్

ఈ పని చేయడం ఎంతో కష్టం. ఆట లేదా మరేదైనా విషయంలో విజయం సాధించడం అసాధ్యం అనుకునే సందర్భంలో ఉపయోగించే మాట యాన్ అప్‌హిల్ బ్యాటిల్/స్ట్రగుల్/టాస్క్

ఉదా: అన్‌లెస్ యూ హ్యావ్ ఏ గోల్ యువర్ లెర్నింగ్ విల్ బీ యాన్ అప్‌హిల్ స్ట్రగుల్


నిప్ ఇట్ ఇన్ ది బడ్

నిప్ ఇట్ ఇన్ ది బడ్ అనేది మొగ్గలోనే తుంచివేయడంలాంటి మాట. ఏ చెడు అలవాటుగానీ, ప్రమాదకరమైన పరిస్థితి తలెత్తకుండా ముందుగా జాగ్రత్త పడడం.

ఉదా: మెనీ సీరియస్ ఇల్‌నెసెస్ కెన్ బీ నిప్పుడ్ ఇన్ ది బడ్ ఇఫ్ దే ఆర్ డిటెక్టెడ్ ఎర్లీ ఎనఫ్.

సినిమా

డబ్బింగ్ షురూ


● కార్తీ

కార్తీ హీరోగా నటించిన అడ్వెంచరస్ థ్రిల్లర్ మూవీ 'జపాన్'. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సునీల్, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ కీలక పాత్రల్లో నటించారు. 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ చిత్రం దీపావళికి విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ పనులు ప్రారంభమయ్యాయని వెల్లడిస్తూ, ఇందుకు సంబంధించిన ఓ వీడియోను చిత్ర యూనిట్ షేర్ చేసింది. ''కార్తీ పుట్టినరోజు (మే 25) సందర్భంగా విడుదల చేసిన 'జపాన్' గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ చిత్రంలో కార్తీ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా 'జపాన్' చిత్రంలో గోల్డ్ స్మగ్లింగ్ చేసే వ్యక్తి పాత్రలో కార్తీ కనిపిస్తారని కోలీవుడ్ టాక్.

సింగిల్‌గా ఉండు మామా..

'హే సింగిల్‌గా ఉండు మామా.. గాళ్‌ఫ్రెండ్ ఎందుకు?..హైదరాబాద్.. సికింద్రాబాద్..పొరెంట బడితే నువ్వు బరాబాత్' అంటూ మొదలవుతుంది 'మ్యాడ్' చిత్రంలోని 'ప్రొడ్సే బోలో ఐయామ్ సింగిల్' పాట. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సునీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో ఎస్. హారిక, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ప్రొడ్సే బోలో ఐ యామ్ సింగిల్..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సారథ్యంలో రఘురామ్ సాహిత్యం అందించారు. నకాష్ అజీజ్‌తో కలిసి భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించారు.


● 'మ్యాడ్' పోస్టర్

మాయే చేసే...


● కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్

'బింబిసార' వంటి హిట్ మూవీ తర్వాత కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'డెవిల్'. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 24న విడుదల కానుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మాయే చేసే..' అనే పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. సత్య ఆర్‌వీ సాహిత్యం అందించిన ఈ పాటను, సిధ్ శ్రీరాం పాడారు. అభిషేక్ నామా మాట్లాడుతూ– ''పీరియాడిక్ స్పై థ్రిల్లర్ మూవీ 'డెవిల్'. నటుడిగా కల్యాణ్ రామ్‌లోని ఓ కొత్త కోణాన్ని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూస్తారు. సినిమా కథ, కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి'' అన్నారు. ఈ చిత్రానికి సీఈఓ: వాసు పోతిని, కెమెరా: సౌందర్ రాజన్ ఎస్.

భయపెట్టే తంతిరం

భార్యాభర్తల మధ్యలో ఓ ఆత్మ ప్రవేశించడం వల్ల వారి దాంపత్య జీవితం ఎలా ప్రభావితమైంది? అనే కథాంశంతో రూపొందిన హారర్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ 'తంతిరం'. శ్రీకాంత్ గుర్రం, ప్రియాంక శర్మ జంటగా నటించారు. ముత్యాల మెహర్ దీపక్ దర్శకత్వంలో శ్రీకాంత్ కంద్రగుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఆడియన్స్‌కు గుర్తుండిపోయే చిత్రం ఇది'' అన్నారు శ్రీకాంత్ గుర్రం. ''ఈ సినిమా చూసి ఆడియన్స్ థ్రిల్ అవుతారు'' అన్నారు మెహర్ దీపక్. ''బడ్జెట్ ఎక్కువ అవుతున్నా రాజీ పడకుండా నిర్మించాం. ప్రేక్షకులు ఈ సినిమాను హిట్ చేయాలి'' అన్నారు శ్రీకాంత్ కంద్రగుల.


● ప్రియాంక, శ్రీకాంత్

బాలీవుడ్ భులాయా?


● సాయి పల్లవి

దక్షిణాదిలోని అగ్రకథానాయికల్లో ఒకరిగా ప్రేక్షకుల్లో పేరు సంపాదించుకున్నారు సాయిపల్లవి. ఈ బ్యూటీ బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటికప్పుడు కొత్త వార్తలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. ఈ కోవలోనే తాజాగా మరోసారి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ బీ టౌన్‌లో చర్చనీయాంశమైంది. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ ఇటీవల ఓ ప్రేమకథకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, ఈ చిత్రంలోనే సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనున్నారనే టాక్ హిందీ పరిశ్రమలో ప్రచారంలోకి వచ్చింది. ఆమిర్ సన్నిహితుల్లో ఒకరైన సునీల్ పాండే దర్శకత్వం వహిస్తారని, ఈ ఏడాది చివర్లోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని భోగట్టా. ఇక ఈ చిత్రంలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తే, హిందీలో ఆమెకు తొలి చిత్రం అవుతుంది. మరి.. సాయిపల్లవిని బాలీవుడ్ భులాయా (పిలిచిందా?) లేదా అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

దుల్కర్‌కు జోడీగా..?

తెలుగు పరిశ్రమలో కథానాయికగా మీనాక్షీ చౌదరికి అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే మహేశ్‌బాబు 'గుంటూరు కారం', వరుణ్‌తేజ్ 'మట్కా', విశ్వక్ సేన్ సినిమాల్లో హీరోయిన్‌గా చేస్తున్నారీ బ్యూటీ. తాజాగా దుల్కర్ సల్మాన్ హీరోగా రూపొందనున్న 'లక్కీ భాస్కర్' చిత్రంలోని హీరోయిన్ చాన్స్ కూడా మీనాక్షీకే లభించిందని టాలీవుడ్ లేటెస్ట్ సమాచారం. పాన్ ఇండియా ఫిల్మ్‌గా ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నారు. నవంబరులో షూటింగ్ ప్రారంభం కానుందట.


● మీనాక్షీ చౌదరి

అక్టోబరులో 800


● మధుర్ మిట్టల్

శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం '800'. మురళీధరన్ పాత్రలో 'స్లమ్‌డాగ్ మిలియనీర్' ఫేమ్ మధుర్ మిట్టల్ నటించగా, ఆయన భార్య మదిమలర్ పాత్రలో మహిమా నంబియార్ కనిపిస్తారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో వివేక్ రంగాచారి ఈ బయోపిక్‌ను నిర్మించారు. ఈ సినిమా దేశవ్యాప్త థియేట్రికల్ రిలీజ్ హక్కులను నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సొంతం చేసుకున్నారు. ఈ సినిమాను అక్టోబరు 6న విడుదల చేస్తున్నట్లుగా గురువారం చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''తమిళ, తెలుగు, హిందీ భాషల్లో '800' సినిమాను వచ్చే నెల 6న విడుదల చేస్తున్నాం. ముత్తయ్య మురళీధరన్ జీవితంలోని క్రికెట్ అంశాలను గురించి మాత్రమే కాదు.. ఆయన బాల్యంలో జరిగిన ఘటనలను కూడా ఈ చిత్రంలో చూపిస్తాం. కేవలం క్రికెట్ ప్రేమికులనే కాదు.. ప్రేక్షకులందరినీ ఆకట్టుకునే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు. ''ఈ సినిమా పట్ల శ్రీపతి అంకిత భావం, పట్టుదల చూసి ఈ సినిమాకు ఓకే చెప్పాను. ప్రజలంతా ఈ సినిమా చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు ముత్తయ్య మురళీధరన్. ఈ చిత్రానికి సంగీతం: జీబ్రాన్.

ఆ నలుగురికీ రెడ్ కార్డ్?


● ధనుష్


● విశాల్

తమిళ చలన చిత్ర నిర్మాతల మండలి సంచలన నిర్ణయం తీసుకుందని సమాచారం. నిర్మాతలకు సహకరించడం లేదనే ఆరోపణలతో హీరోలు ధనుష్, శింబు, అథర్వలకు, నిర్మాతల మండలికి చెందిన నిధుల అవకతవకల ఆరోపణలపై విశాల్‌కు రెడ్ కార్డ్ (ప్రవర్తన సరిగ్గా లేనప్పుడు జారీ చేయడం) జారీ చేయాలని నిర్ణయించిందట. చెన్నై అన్నాశాలైలోని నిర్మాతల మండలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నిర్మాతల మండలి ఈ నిర్ణయం తీసుకుందని కోలీవుడ్ టాక్. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా హీరోలు ధనుష్, విశాల్, శింబు, అథర్వలపై రెడ్ కార్డ్ విధించాలని తీర్మానం చేశారట. ఇకపై వీరు ఏ సినిమాల్లోనూ నటించకుండా రెడ్ కార్డ్ ఇవ్వనున్నారని భోగట్టా. ఈ నిర్ణయం తమిళ చిత్ర పరిశ్రమనే కాదు.. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఇంతకీ ధనుష్, విశాల్, శింబు, అథర్వలకు రెడ్ కార్డ్ ఎందుకు జారీ చేయనున్నారనే విషయాలపై కొన్ని సంగతులు ప్రచారంలోకొచ్చాయి. ఆ వివరాల్లోకి వెళితే...

- తేనాండాళ్ ఫిలిమ్స్ సంస్థలో ధనుష్ ఓ చిత్రం అంగీకరించి, 80 శాతం షూటింగ్ పూర్తి చేశారట. మిగిలిన 20 శాతం చిత్రీకరణ విషయంలో ధనుష్ సహకరించడం లేదట. ఈ కారణంగా నష్టాలు వచ్చాయంటూ నిర్మాత మదియళగన్ ఫిర్యాదు చేశారని సమాచారం. ఈ ఫిర్యాదుని పరిశీలించాక ధనుష్‌పై చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు నిర్మాతల మండలి పేర్కొందని టాక్.
- తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌కు విశాల్ అధ్యక్షుడిగా పని చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అసోసియేషన్‌కు సంబంధించిన నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై విశాల్‌కు రెడ్ కార్డ్ ఇవ్వనున్నారట.
- నిర్మాత మైఖేల్ రాయప్పన్‌తో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో శింబుకు రెడ్ కార్డ్ జారీ చేయనుందట నిర్మాతల మండలి. ఈ వివాదంపై ఇప్పటికే పలుమార్లు శింబుతో చర్చలు జరిపినా ఫలితం రాలేదట. దీంతో మైఖేల్ రాయప్పన్ ఫిర్యాదు చేయడంతో శింబుకి రెడ్ కార్డ్ జారీ చేయాలనే నిర్ణయం తీసుకున్నారట.
- మదియళగ అనే నిర్మాణ సంస్థలో ఓ సినిమా చేసేందుకు అథర్వ ఒప్పందం కుదుర్చుకున్నారట. అయితే షూటింగ్ విషయంలో ఆయన దర్శక-నిర్మాతలకు ఏమాత్రం సహకరించడం లేదట. ఈ ఆరోపణలతో అథర్వకి రెడ్ కార్డ్ ఇవ్వనున్నారని టాక్.


● శింబు


● అథర్వ

సాక్షి బిజినెస్
శుక్రవారం
15-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	52	67,519
నిఫ్టీ ▲	33	20,103

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శాని రెండు రాత్రి 11.30కి ముగింపు)		
నాస్‌డాక్	13,944	▲ 131
డోజోన్స్	34,923	▲ 348
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,673	▲ 147
డాక్స్	15,805	▲ 151
షాంఘై	3,123	▲ 3
నికాయ్	33,168	▲ 462

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,267
బంగారం (22 క్యారెట్)	55,452
వెండి (కేజీ)	77,112

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	82.18	83.85
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	101.97	105.34
€	యూరో	ఎకటం	87.68	90.79
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	55.49	57.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	52.10	54.43
S$	సింగపూర్ డాలర్	ఎకటం	60.00	61.94
SAR	సౌదీ రియాల్	[illegible]	21.17	22.80
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.70	23.49
¥	చైనా యువాన్	[illegible]	10.28	12.35

కేంద్రానికి ఎల్‌ఐసీ రూ.1,831 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ) గురువారం రూ. 1,831.09 కోట్ల డివిడెండ్ చెక్కును కేంద్రానికి అందజేసింది. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి ఈ డివిడెండ్ చెక్కును అందజేశారు. ఆర్థిక సేవల శాఖ అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల తదితర అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆగస్టు 22న జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో డివిడెండ్‌ను షేర్‌హోల్డర్లు ఆమోదించినట్లు ఒక ప్రకటనలో ఎల్‌ఐసీ పేర్కొంది. రూ.5 కోట్ల తొలి మూలధన పెట్టుబడితో 1956లో ఎల్‌ఐసీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులకు ద్వారాలు తెరచి రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ, భారత జీవిత బీమా మార్కెట్లో ఎల్‌ఐసీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందని ఎల్‌ఐసీ ప్రకటన పేర్కొంది.

టాటా నెక్సాన్ ఈవీలో కొత్త వెర్షన్

ప్రారంభ ధర రూ. 14.74 లక్షలు



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తాజాగా తమ నెక్సాన్ వాహనానికి సంబంధించి కొత్త వెర్షన్స్ ఆవిష్కరించింది. నెక్సాన్ ఈవీలో కొత్త వెర్షన్ ధర రూ. 14.74–19.94 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా ఉంటుంది. ఇది ఒకసారి చార్జి చేస్తే గరిష్టంగా 465 కిలోమీటర్ల రేంజి ఇస్తుంది. అలాగే, నెక్సాన్‌లో పెట్రోల్, డీజిల్‌కు సంబంధించి కొత్త వెర్షన్లను టాటా మోటార్స్ ప్రవేశపెట్టింది. వీటి రేటు రూ. 8.09 లక్షల (ఎక్స్–షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సంస్థ ఎండీ (ప్యాసింజర్ వెహికల్స్ విభాగం) శైలేష్ చంద్ర తెలిపారు. ప్రస్తుతం టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాహనాల పోర్ట్‌ఫోలియోలో నెక్సాన్, టియాగో, టిగోర్, ఎక్స్‌ప్రెస్–టీ ఈవీ ఉన్నాయి.

గ్రీన్ హైడ్రోజన్‌కు అదానీ జేవీ

జపాన్ కంపెనీతో జట్టు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా జపాన్ దిగ్గజం కోవా గ్రూప్‌తో చేతులు కలిపింది. సమాన వాటా(50:50)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసింది. తద్వారా జపాన్, తైవాన్, హవాయ్ మార్కెట్లలో గ్రీన్ హైడ్రోజన్ విక్రయాలను చేపట్టనుంది. రానున్న దశాబ్ద కాలంలో దేశీయంగా సమీకృత గ్రీన్ హైడ్రోజన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ ప్రణాళికలు ప్రకటించింది. దీనిలో భాగంగా తొలి దశలో మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి తెరతీయనుంది. తదుపరి దశలో సామర్థ్యాన్ని 3 మిలియన్ టన్నులకు పెంచనుంది. ఈ బాటలో తాజాగా సింగపూర్ అనుబంధ సంస్థ ద్వారా కోవా హోల్డింగ్స్ ఏషియా పీటీఈతో జేవీని నెలకొల్పింది. వెరసి గ్రీన్ అమోనియా, గ్రీన్ హైడ్రోజన్, వీటి డెరివేటివ్ అమ్మకాలు, మార్కెటింగ్ చేపట్టనుంది.



శుద్ధ ఇంధన తయారీకి హైడ్రోజన్ ఉపయోగపడనుంది. ప్రధానంగా రిఫైనింగ్, కెమికల్ రంగాలలో వినియోగిస్తారు. అదానీ ఇప్పటికే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన కంపెనీగా ఆవిర్భవించింది. గుజరాత్, ముంద్రా సెజ్‌లోని సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాలను వార్షికంగా 10 గిగావాట్లకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. ఇక్కడ మెటలర్జికల్ గ్రేడ్(ఎంజీ) సిలికాన్, పాలీసిలికాన్, ఇన్‌గాట్స్, వేఫర్స్, సెల్స్ తదితరాలను రూపొందించేందుకు వీలుంది. వీటిని సౌర ఇంధనం ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టే ప్రక్రియలో వినియోగిస్తారు.

మాస్టర్ కార్డ్ ఇండియా చైర్మన్‌గా రజనీష్ కుమార్

న్యూఢిల్లీ: మాస్టర్ కార్డ్ ఇండియా తన నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎస్‌బీఐ మాజీ సీఎండీ రజనీష్ కుమార్‌ను నియమించినట్లు గురువారం ప్రకటించింది. ఈ కీలక బాధ్యతల్లో భాగంగా దక్షిణాసియా అండ్ కంట్రీ కార్పొరేట్ ఆఫీసర్, ఇండియా డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్ అగర్వాల్ నేతృత్వంలోని మాస్టర్‌కార్డ్ సౌత్ ఆసియా ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ బృందానికి కుమార్ మార్గనిర్దేశం చేస్తారని మాస్టర్ కార్డ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. దేశీయ విస్తరణ బాటలో దూసుకుపోవడానికి స్థానిక లీడర్‌షిప్ బృందంతో తన వంతు కీలక చొరవలు చేపడతారని వెల్లడించింది.



టోకు ద్రవ్యోల్బణం అయిదో నెలా 'మైనస్'లోనే..

- ఆగస్టులో మైనస్ 0.52 శాతం
- కూరగాయలు, ఉల్లి, పప్పు దినుసుల ధరలు తీవ్రమే

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం వరుసగా అయిదో నెల కూడా మైనస్‌లోనే కొనసాగింది. ఆగస్టులో మైనస్ 0.52%గా నమోదయ్యింది. సూచీలో పెరుగుదల లేకపోవడాన్ని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. టోకు బాస్కెట్ ధర పెరక్కపోగా.. మైనస్‌లో ఉన్నప్పటికీ, ఇందులో ఒక భాగంగా ఉన్న ఆహార బాస్కెట్ ధర మాత్రం తీవ్రంగా ఉంది.

ఫుడ్ బాస్కెట్ తీరిది...

ఫుడ్ బాస్కెట్ ధరల పెరుగుదల ఆగస్టులో 10.6 శాతంగా (2022 ఆగస్టుతో పోల్చి) ఉంది. జూలైతో (14.25 శాతం) పోల్చితే ధరల స్పీడ్ కొంత తగ్గడం ఊరటనిచ్చే అంశం. ఒక్క కూరగాయల ధరలు చూస్తే, 48.69 శాతం పెరుగుదల నమోదయ్యింది. జూలైలో ఈ పెరుగుదల రేటు ఏకంగా 62.12 శాతంగా ఉంది. పప్పు దినుసుల ధరల



స్పీడ్ 10.45 శాతంకాగా, ఉల్లి ధరల విషయంలో ఈ రేటు 31.42 శాతంగా ఉంది. ధరల స్పీడ్ జూలైతో పోల్చితే తగ్గినప్పటికీ వార్షికంగా చూస్తే, ఇది చాలా ఎక్కువ పెరుగుదలేనని నిపుణులు పేర్కొంటున్నారు.

తయారీ: సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగంలో జూలైలో ప్రతి ద్రవ్యోల్బణం మైనస్ 2.51 శాతం ఉంటే, ఆగస్టులో మైనస్ 2.37 శాతంగా నమోదయ్యింది.

ఇంధనం–విద్యుత్: ఈ రంగంలో జూలైలో ప్రతి ద్రవ్యోల్బణం మైనస్ 12.79 శాతం ఉంటే, ఆగస్టులో మైనస్ 6.03 శాతంగా ఉంది.

సరికొత్త శిఖరంపై నిఫ్టీ

ఇంట్రాడేలో సెన్సెక్స్ కొత్త రికార్డు

ముంబై: చివర్లో ఇంధన, మెటల్, కమొడిటీ షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించడంతో గురువారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గటెక్కాయి. సెన్సెక్స్ 52 పాయింట్లు పెరిగి 67,519 వద్ద స్థిరపడింది. వరుసగా వరుసగా పదో రోజూ లాభాలు కొనసాగించిన ఈ సూచీ ఇంట్రాడేలో 304 పాయింట్లు బలపడి 67,771 వద్ద జీవితకాల రికార్డు నెలకొల్పొంది. నిఫ్టీ 33 పాయింట్లు పెరిగి 20,103 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 98 పాయింట్లు ఎగసి 20,167 స్థాయిని తాకింది. ఇంట్రాడే, ముగింపులు ఈ సూచీకి జీవితకాల గరిష్ట స్థాయి కావడం విశేషం. ఎఫ్‌ఎంసీజీ, మీడియా, వినిమయ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్,



స్మాల్ ఇండెక్సులు 1.15%, 1.02% లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ రెండు పైసలు పెరిగి 83.03 వద్ద స్థిరపడింది. అమెరికా ద్రవ్యోల్బణ డేటా అంచనాలకు మించిన నమోదవడంతో పాటు ఈసీబీ కఠిన ద్రవ్య విధాన వైఖరికి మొగ్గుచూపొచ్చనే ఊహాగానాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- వర్లి ప్రాంతంలో తన 22 ఎకరాల భూమిని జపాన్‌కు చెందిన సుమిటోమోకు రూ.5,200 కోట్లకు విక్రయించనుండటంతో బాంబే డైయింగ్ షేరు 9% లాభపడి రూ.153 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 20% ర్యాలీ చేసి రూ.168.50 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.
- ఆర్‌ఐఎన్‌ఎల్, ఎన్ఎల్‌ఎంసీ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకోవడంతో పాటు రూ.180 కోట్ల ఆర్డర్లను దక్కించుకోవడంతో ఎన్‌బీసీసీ షేరు 8% లాభపడి రూ.60.67 వద్ద ముగిసింది.
- బీఎస్ఈ రియల్టీ సూచీ 1.50%, ఆయిల్ గ్యాస్ 1.40%, మెటల్ 1.39%, కమోడిటీ 1.09%, ఆటో 0.94% ఇంధన 0.92%, యుటిలిటీ 0.82% చొప్పున పెరిగాయి.

కళామందిర్ @ రూ. 210-222

ఈ నెల 20–22 మధ్య ఐపీవో

సంప్రదాయ దుస్తుల రిటైలర్ సాయి సిల్క్స్ (కళామందిర్) పబ్లిక్ ఇష్యూకి రూ. 210–222 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 22న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 2.7 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. వెరసి రూ. 1,201 కోట్లను సమకూర్చుకోనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 67 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 280 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది. కళామందిర్, వరమహాలక్ష్మి సిల్క్స్, మందిర్, కేఎల్ఎం ఫ్యాషన్ మాల్ బ్రాండ్లతో స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ కంపెనీ 2023 మార్చికల్లా రూ. 1,351 కోట్ల టర్నోవర్ సాధించింది. రూ. 98 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023 జులైకల్లా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులలో 54 స్టోర్లను నిర్వహిస్తోంది.

నకిలీ విక్రేతలపై టీటీకే ప్రెస్టీజీ కఠిన చర్యలు

హైదరాబాద్: ప్రెస్టీజీ బ్రాండు పేరుతో నకిలీ ఉపకరణాలు అమ్ముతున్న విక్రేతలపై టీటీకే ప్రెస్టీజీ చట్టపరమైన చర్యలు చేపట్టింది. తెలుగు రాష్ట్రాల్లో బ్రాండ్‌ను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడుతున్న కొందరు విక్రేతలపై ఫిర్యాదు దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో శివసాయి కేంద్రం, తెలంగాణలో బెథల్ ఇండస్ట్రీస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ తక్షణం స్పందించిన పోలీసులు నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. 'టీటీకే బ్రాండ్ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. నకిలీలపై ఏమాత్రం అనుమానం ఉన్నా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి' అని సంస్థ ఒక ప్రకటనలో కోరింది.

బిర్లా 'ఓపస్' పెయింట్స్

- పెయింట్స్ విపణిలోకి గ్రాసిమ్
- రూ.10,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ రంగంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అయిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ఎంట్రీ ఇచ్చింది. ఈ మేరకు 'బిర్లా ఓపస్' బ్రాండ్‌ను గురువారం ఆవిష్కరించింది. డెకోరేటివ్ పెయింట్ల వ్యాపారంలో గ్రాసిమ్ రూ.10,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. 2024 జనవరి–మార్చి కాలంలో బిర్లా ఓపస్ ఉత్పత్తులు మార్కెట్లోకి రానున్నాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ హరియాణా, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో పెయింట్ల తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 133.2 కోట్ల లీటర్లు. అధిక వృద్ధి ఉన్న విపణిలోకి ప్రవేశించడానికి కొత్త విభాగం వీలు కల్పిస్తుందని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా ఈ సందర్భంగా అన్నారు. విజయవంతమైన



వ్యాపారాన్ని ప్రారంభించేందుకు రెండేళ్లుగా బలమైన పునాదిని నిర్మించినట్టు చెప్పారు. రాబోయే సంవత్సరాల్లో రెండవ స్థానంలో నిలిచి లాభదాయక కంపెనీగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. డెకోరేటివ్ పెయింట్స్ పరిశ్రమ భారత్‌లో రెండంకెల వృద్ధితో ఏటా రూ.70,000 కోట్లు నమోదు చేస్తోంది. 2022–23లో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ 23 శాతం వృద్ధితో రూ.1.17 లక్షల కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయాన్ని ఆర్జించింది. కాగా, గ్రాసిమ్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 0.12 శాతం క్షీణించి రూ.1,931.40 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్



రాణించిన ఉనాద్కట్, జయంత్

ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో బరిలోకి దిగిన భారత క్రికెటర్లు జైదేవ్ ఉనాద్కట్, జయంత్ యాదవ్ ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. లెస్టర్‌షైర్ క్లబ్‌తో జరిగిన డివిజన్–2 మ్యాచ్‌లో ససెక్స్ జట్టు తరఫున ఆడిన ఉనాద్కట్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఉనాద్కట్ 23 పరుగులిచ్చి 3 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 94 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ససెక్స్ జట్టు 15 పరుగుల తేడాతో గెలిచింది. లాంకషైర్‌తో జరిగిన డివిజన్–1 మ్యాచ్‌లో మిడిల్‌సెక్స్ జట్టుకు ఆడిన జయంత్ యాదవ్ 131 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్ 'డ్రా' అయింది. తొలిసారి కౌంటీ క్రికెట్‌లో ఆడుతున్న భారత లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహల్ (3/63, 2/43) కెంట్ తరఫున ఐదు వికెట్లు తీసుకున్నాడు.



ముగిసిన భారత్ పోరు



కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ... అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీలు ఓటమి చవిచూశాయి. గాయత్రి–ట్రెసా 8–21, 14–21తో అప్రియాని రహాయు–సితి ఫాదియా (ఇండోనేసియా)ల చేతిలో... అశ్విని–తనీషా 18–21, 7–21తో టాప్ సీడ్ మయు మత్సుమోటో–వకాన నగహారా (జపాన్)ల చేతిలో పరాజయం పాలయ్యారు. గాయత్రి, అశ్విని జోడీలకు 1,575 డాలర్ల (రూ. 1 లక్ష 30 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 3600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మోటార్ స్పోర్ట్ టీమ్ యజమానిగా నాగ చైతన్య

హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ సొంతం

సాక్షి, హైదరాబాద్: మోటార్ స్పోర్ట్ రేసింగ్‌లో తెలుగు హీరో అక్కినేని నాగచైతన్య భాగమయ్యాడు. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్‌ఎల్)లో ఒక జట్టయిన 'హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్'ను అతను కొనుగోలు చేశాడు. ఇండియన్ రేసింగ్ లీగ్ గత సీజన్‌లో నాలుగు రేస్‌లు గెలిచిన ఈ టీమ్ త్వరలో తొలిసారి నిర్వహించనున్న 'ఎఫ్‌ఐఏ ఫార్ములా–4 ఇండియన్ చాంపియన్‌షిప్'లో కూడా పాల్గొనబోతోంది. 2022 సీజన్‌లో బ్లాక్‌బర్డ్స్ జట్టుకే చెందిన అఖిల్ రవీంద్ర డ్రైవర్స్ టైటిల్ విజేతగా నిలిచాడు. టీమ్ చాంపియన్‌షిప్‌లో బ్లాక్ బర్డ్స్‌కు రెండో స్థానం దక్కింది. అఖిల్‌తో పాటు స్విట్జర్లాండ్‌కు చెందిన నీల్ జానీ ఈ టీమ్‌లో మరో డ్రైవర్‌గా ఉన్నాడు. చిన్నప్పటి నుంచి మోటార్ రేసింగ్‌ను ఎంతో ఇష్టపడే తాను ఇప్పుడు టీమ్ యజమానిగా రేసింగ్ బృందంలో భాగం కావడం సంతోషంగా ఉందని నాగచైతన్య వ్యాఖ్యానించాడు.



జోరు కొనసాగించేందుకు...

- 'సూపర్–4' చివరి మ్యాచ్‌లో నేడు బంగ్లాదేశ్‌తో భారత్ 'ఢీ'
- మధ్యాహ్నం గం. 3:00 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కొలంబో: ఆసియా కప్‌లో ఫలితం దృష్ట్యా ప్రాధాన్యత లేని చివరి లీగ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. 'సూపర్–4' దశలో భాగంగా నేడు జరిగే పోరులో భారత్, బంగ్లాదేశ్ తలపడనున్నాయి. భారత్ ఇప్పటికే టోర్నీలో ఫైనల్‌కు చేరగా... బంగ్లాదేశ్ ఫైనల్ రేసు నుంచి ముందే నిష్క్రమించింది. ఇరు జట్లకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆటగాళ్లను పరీక్షించడం లేదా విశ్రాంతి మాత్రమే ఈ మ్యాచ్‌కు సంబంధించి ప్రధానంగా మారాయి. ద్వైపాక్షిక సిరీస్‌లు కాకుండా మూడు అంతకుమించి దేశాలు పాల్గొన్న టోర్నీల్లో బంగ్లాదేశ్ చేతిలో ఏనాడూ ఓడని టీమిండియా ఆడిన ఐదు మ్యాచుల్లోనూ విజయం సాధించింది. పిచ్ నెమ్మదిగా ఉండే అవకాశం కనిపిస్తుండగా మ్యాచ్ రోజు వర్షసూచన లేకపోవడం విశేషం.

అయ్యర్ బరిలోకి...

మ్యాచ్‌కు ప్రాధాన్యత లేకపోయినా భారత్ అనవసరపు మార్పులు చేయకపోవచ్చు. రాబోయే వరల్డ్ కప్ సన్నాహాలను దృష్టిలో ఉంచుకొని చూస్తే పూర్తి స్థాయి రెగ్యులర్ జట్టుతోనే బరిలోకి దిగవచ్చు. టాప్–3 రోహిత్, గిల్, కోహ్లి ఇప్పటికే సిరీస్‌లో తమ సత్తా ప్రదర్శించగా, ఇషాన్ కిషన్ కూడా ఆకట్టుకున్నాడు. కేఎల్ రాహుల్ తన విలువేంటో పాక్‌తో మ్యాచ్‌లో చూపించడం మేనేజ్‌మెంట్‌కు బెంగ తగ్గింది. అయితే మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ పరిస్థితి మాత్రమే కాస్త ఇబ్బందికరంగా ఉంది. గాయంతో అతను రెండు మ్యాచ్‌లు ఆడలేదు. అతడి బ్యాటింగ్‌ను పరీక్షించడం ఇప్పుడు కీలకం. గురువారం నెట్స్‌లో అందరికంటే ఎక్కువగా సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్ చేసిన అతను మ్యాచ్‌కు సిద్ధమైనట్లుగా కనిపిస్తోంది. అయ్యర్‌ను ఆడించాలనుకుంటే కిషన్‌ను పక్కన పెట్టవచ్చు. టోర్నీలో బుమ్రా మరీ ఎక్కువగా ఏమీ బౌలింగ్ చేయలేదు కాబట్టి విశ్రాంతి అనవసరం. అయితే మ్యాచ్ ప్రాక్టీస్ కోసం సిరాజ్ స్థానంలో షమీని ఎంచుకునే అవకాశం ఉంది. ఆపై పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని శార్దుల్, అక్షర్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు.

టోర్నీలో మొత్తంలో అఫ్గానిస్తాన్‌పై ఒక మ్యాచ్ గెలవడం మినహా బంగ్లాదేశ్ ఏ రకంగానూ ఆకట్టుకోలేకపోయింది. గత కొన్నాళ్లుగా వన్డేల్లో ఆ జట్టు ప్రదర్శన చూస్తే టోర్నీలో మంచి పోటీ ఇవ్వగలదని భావించినా అంతా తలకిందులైంది. కెప్టెన్ షకీబ్ సహా ఏ ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేకపోయారు. తొలి రెండు మ్యాచ్‌లలో చెలరేగిన నజ్ముల్ గాయంతో స్వదేశం తిరిగి వెళ్లగా, వికెట్ కీపర్ ముష్ఫికర్ కూడా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడు. ఈ నేపథ్యంలో కొత్త ఆటగాళ్లను ఆ జట్టు పరీక్షించే అవకాశం ఉంది. అయితే ఎవరు ఎలా ఆడినా షకీబ్ ప్రదర్శనపైనే ఆ జట్టు విజయావకాశాలు ప్రధానంగా ఆధారపడి ఉన్నాయనేది వాస్తవం.



రోహిత్ శర్మ



షకీబ్

ఇంగ్లండ్ ఘనవిజయం

లండన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 181 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 369 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన న్యూజిలాండ్ 39 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. గ్లెన్ ఫిలిప్స్ (72; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. లివింగ్‌స్టోన్ (3/16), క్రిస్ వోక్స్ (3/31), రీస్ టాప్లే (2/31) న్యూజిలాండ్‌ను దెబ్బతీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 368 పరుగులకు ఆలౌటైంది. భారీ సెంచరీ చేసిన బెన్ స్టోక్స్‌కు (124 బంతుల్లో 182; 15 ఫోర్లు, 9 సిక్స్‌లు) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం లభించింది. సిరీస్‌లో చివరిదైన నాలుగో వన్డే నేడు లార్డ్స్ మైదానంలో జరుగుతుంది.



ఫైనల్లో శ్రీలంక

పాకిస్తాన్‌పై 2 వికెట్లతో విజయం • ఆదివారం భారత్‌తో టైటిల్ పోరు

కొలంబో: ఆసియా కప్ ఫైనల్ మరోసారి భారత్, శ్రీలంక మధ్య జరగనుంది. గురువారం హోరాహోరీగా సాగిన 'సూపర్–4' మ్యాచ్‌లో లంక 2 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించి ఈ టోర్నీలో 11వ సారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన సమరంలో చివరకు లంకదే పైచేయింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ముందుగా 45 ఓవర్లకు, ఆ తర్వాత 42 ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 42 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (73 బంతుల్లో 86 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (69 బంతుల్లో 52; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇఫ్తికార్ అహ్మద్ (40 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఒకదశలో జట్టు స్కోరు 130/5 కాగా... రిజ్వాన్, ఇఫ్తికార్ ఆరో వికెట్‌కు 108 పరుగులు జోడించి ఆదుకున్నారు. అనంతరం లంక లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ ద్వారా 42 ఓవర్లలో 252 పరుగులుగా నిర్దేశించారు. లంక సరిగ్గా 42 ఓవర్లలో 8 వికెట్లకు 252 పరుగులు సాధించి గెలిచింది. కుశాల్ మెండిస్ (87 బంతుల్లో 91; 8 ఫోర్లు, 1 సిక్స్), సదీరా సమరవిక్రమ (51 బంతుల్లో 48; 4 ఫోర్లు), అసలంక (47 బంతుల్లో 49 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ గెలుపుతో శ్రీలంక నాలుగు పాయింట్లతో 'సూపర్–4' దశలో రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నిష్క్రమించాయి.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) మదుషన్ (బి) పతిరణ 52; ఫఖర్ (బి) మదుషన్ 4; బాబర్ (స్టంప్డ్) మెండిస్ (బి) వెల్లాలగె 29; రిజ్వాన్ (నాటౌట్) 86; హారిస్ (సి అండ్ బి) పతిరణ 3; నవాజ్ (బి) తీక్షణ 12; ఇఫ్తికార్ (సి) షనక (బి) పతిరణ 47; షాదాబ్ (సి) మెండిస్ (బి) మదుషన్ 3; షాహీన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (42 ఓవర్లలో 7 వికెట్లకు) 252. వికెట్ల పతనం:** 1–9, 2–73, 3–100, 4–108, 5–130, 6–238, 7–243. **బౌలింగ్:** మదుషన్ 7–1–58–2, తీక్షణ 9–0–42–1, షనక 3–0–18–0, వెల్లాలగె 9–0–40–1, పతిరణ 8–0–65–3, ధనంజయ 6–0–28–0.


శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి అండ్ బి) షాదాబ్ 29; పెరీరా (రనౌట్) 17; మెండిస్ (సి) హారిస్ (బి) ఇఫ్తికార్ 91; సమరవిక్రమ (స్టంప్డ్) రిజ్వాన్ (బి) ఇఫ్తికార్ 48; అసలంక (నాటౌట్) 49 ; షనక (సి) నవాజ్ (బి) ఇఫ్తికార్ 2; ధనంజయ (సి) వసీమ్ (బి) షాహీన్ 5; వెల్లాలగె (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 0; మదుషన్ (రనౌట్) 1; పతిరణ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (42 ఓవర్లలో 8 వికెట్లకు) 252. వికెట్ల పతనం:** 1–20, 2–77, 3–177, 4–210, 5–222, 6–243, 7–243, 8–246. **బౌలింగ్:** షాహీన్ 9–0–52–2, జమాన్ 6–1–39–0, వసీమ్ 3–0–25–0, నవాజ్ 7–0–26–0, షాదాబ్ 9–0–55–1, ఇఫ్తికార్ 8–0–50–3.



కుశాల్ మెండిస్



రిజ్వాన్



- రూట్ మారుస్తున్న ఐటీ సంస్థలు..
  26 ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కంపెనీలు
- తక్కువ నిర్వహణ వ్యయం, నిపుణుల లభ్యతే కారణం
- ప్రథమ శ్రేణి నగరాలతో పోల్చుకుంటే
  30 శాతం వరకు తక్కువ వేతనాలు
- స్టార్టప్ కంపెనీల చూపూ ఈ నగరాల వైపే..
- 2022లో 39 శాతం టెక్ స్టార్టప్‌లు ఇక్కడే ఏర్పాటు
- డెలాయిట్, నాస్కామ్ సంయుక్త అధ్యయనం వెల్లడి

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఢిల్లీ, ముంబై, పుణే, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఒకప్పుడు ఇవే దేశంలో ప్రధాన ఐటీ హబ్‌లు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారుతోంది. ఐటీ కంపెనీలు రూటు మారుస్తున్నాయి. చండీగఢ్, మంగళూరు, అహ్మదాబాద్, కాన్పూర్, తిరువనంతపురం, భోపాల్, జైపూర్, వరంగల్, విశాఖపట్నం,విజయవాడ లాంటి నగరాలు తెరపైకి వస్తున్నాయి.

➤ కోవిడ్‌కు దేశంలోని కేవలం ఏడు ప్రధాన నగరాలకే పరిమితమైన సమాచార సాంకేతిక రంగం.. కోవిడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బహుళజాతి సంస్థలు నిర్వహణ వ్యయాలను గణనీయంగా తగ్గించుకోవాలని భావిస్తుండటమే ఇందుకు కారణమని ఐటీ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కోవిడ్ తర్వాత కొత్త నగరాలకు

ప్రత్యామ్నాయ హబ్‌లు అత్యంత ఆవశ్యకం

➤ దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు ఏ విధంగా ఐటీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్న అంశంపై డెలాయిట్, నాస్కామ్ సంయుక్తంగా ఓ అధ్యయనం నిర్వహించి నివేదికను తయారు చేశాయి. 'ఎమర్జింగ్ టెక్నాలజీ హబ్స్ ఇన్ ఇండియా' పేరిట ఇది రూపొందింది. ఇప్పటివరకు ప్రధాన నగరాలకే పరిమితమైన ఐటీ రంగం ప్రస్తుతం మరో 26 నగరాలకు విస్తరించిందని ఆ నివేదిక వెల్లడించింది. ఒక్క భారత దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఈ తరహా పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు నాస్కామ్ అధిపతి సుకన్యరాయ్ తెలిపారు. కాగా ఆయా ప్రాంతాల్లో విస్తరించడానికి గల కారణాలను, అక్కడ ఉన్న అవకాశాలను, ఇతర అంశాలను వివరించింది. ఏడు ప్రధాన నగరాల్లో విస్తరించిన ఐటీ రంగంలో దాదాపు 54 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు ఆ నివేదిక స్పష్టం చేసింది. అయితే నైపుణ్యం, నిర్వహణ వ్యయం, కొత్త నైపుణ్యం ఉన్న యువతను గుర్తించి వారు ఉన్నచోటే ఉపాధి కల్పించేలా ఆ ప్రాంతాల్లోనే కార్యకలాపాలను ప్రారంభించడం ద్వారా ఎక్కువ లాభం పొందవచ్చని ఐటీ సంస్థలు భావిస్తున్నాయని నివేదిక చెబుతోంది. కోవిడ్ తరువాత ఈ వికేంద్రీకరణ వేగం పుంజుకుందని తెలిపింది. దేశంలోని ఏడు ప్రధాన నగరాలకు ప్రత్యామ్నాయంగా ఐటీ హబ్‌ల ఏర్పాటు అత్యంత ఆవశ్యకమని తమ అధ్యయనంలో వెల్లడైనట్లు నాస్కామ్, డెలాయిట్ స్పష్టం చేశాయి.

2030 నాటికి నైపుణ్యం మిగులు..

➤ దేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐటీ నిపుణుల కంటే డిమాండ్ ఎక్కువగా ఉందని అంచనా వేశారు. అయితే 2030 నాటికి ఈ పరిస్థితి మారుతుందని, డిమాండ్ కంటే అధికంగా ఐటీ నిపుణులు ఉంటారని సుకన్యరాయ్ చెప్పారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటు వల్ల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు కూడా ఈ రంగం వైపు మళ్లే అవకాశం ఉందని వెల్లడించారు. ఇక పలు రాష్ట్ర ప్రభుత్వాలు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఐటీ రంగం వేళ్లానుకునేలా తగిన మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావడం ఐటీ రంగానికి కలిసివచ్చే అంశమని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. మౌలిక వసతుల కల్పనతో నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని, మరోవైపు భవనాల కోసం చెల్లించే అద్దె కానీ, సొంత భవనాల నిర్మాణ వ్యయం కానీ ప్రధాన నగరాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఎమర్జింగ్ సిటీస్ (కొత్త నగరాలు)లో 25 నుంచి 30 శాతం వరకు తక్కువ వేతనాలకే నిపుణులు లభిస్తుండటం, 50 శాతం వరకు తక్కువకు అద్దెకు భవనాలు లభించడం వంటి అనుకూల పరిణామాలు ఐటీ రంగం వికేంద్రీకరణకు దోహదపడుతున్నాయని నివేదిక వివరించింది.

ఈ నగరాల్లోనే 11-15% నైపుణ్యం ఉన్న యువత

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే 11–15 శాతం సాంకేతిక నైపుణ్యం ఉన్న యువత ఉన్నట్లు ఐటీ కంపెనీలు గుర్తించాయి. దాదాపు 60 శాతం పట్టభద్రులు ఈ పట్టణాల నుంచే ఉత్తీర్ణులు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా ఉత్తీర్ణులయ్యే వారిలో 30 శాతం మేరకు ఉద్యోగాల కోసం ప్రథమ శ్రేణి నగరాలకు తరలి రావాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కంపెనీలు ద్వితీయ శ్రేణి నగరాల వైపు దృష్టి సారిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

స్టార్టప్‌లు ఎక్కువగా ఇక్కడే..


2022లో దాదాపు 7 వేల (39%) స్టార్టప్‌లు ఈ కొత్త నగరాల నుంచే ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఈ ఏడాదిలో 13 శాతం స్టార్టప్ కంపెనీల ఫండింగ్ ఈ ద్వితీయ శ్రేణి నగరాలకే వెళ్లినట్లు తెలిపింది. పెట్టుబడిదారులు కూడా ప్రథమ శ్రేణి నగరాల్లోని వాటికంటే ఈ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని సంస్థల్లో పెట్టుబడులు పెట్టడానికే ముందుకు వస్తున్నట్లుగా అధ్యయనంలో తేలినట్లు నివేదిక పేర్కొంది.

కొత్త హబ్‌లు ఎక్కడెక్కడ?

దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలైనటువంటి చండీగఢ్, నాగ్‌పూర్, అహ్మదాబాద్, మంగళూరు, కాన్పూర్, తిరువనంతపుర, లఖ్‌నవూ, గౌహతి, రాంచీ, భోపాల్, జైపూర్, ఇండోర్, నాసిక్, భువనేశ్వర్, రాయ్‌పూర్, వరంగల్, కరీంనగర్, విశాఖపట్నం, హుబ్బళి, విజయవాడ, తిరుపతి, మైసూరు, వెల్లూరు, మధురై, తిరుచిరాపల్లి, కొచ్చి నగరాలపై ఐటీ సంస్థలు దృష్టి కేంద్రీకరిస్తున్నాయి.

తెలంగాణలోని పలు నగరాల్లో హబ్‌లు


➤ ఐటీ రంగాన్ని తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు తీసుకెళ్లాలని 2015–16 నుంచే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో ఐటీ హబ్‌లు నిర్మించారు. కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, సిద్దిపేట, వరంగల్‌లలో ఐటీ సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. త్వరలోనే నల్లగొండ, రామగుండంలోనూ ఐటీ హబ్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. మొత్తం మీద 2026 నాటికి 20 వేల మందికి నేరుగా ఈ పట్టణాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



వికేంద్రీకరణతో సానుకూల మార్పులు



➤ ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. కేవలం ప్రధాన నగరాలు, పట్టణాలకు పరిమితం కాకుండా రెండో, మూడో శ్రేణి నగరాలు, ఇతర ప్రాంతాలకు ఐటీ పరిశ్రమ వికేంద్రీకరణ వల్ల చాలా సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. కోవిడ్ తర్వాత చాలావరకు ఉద్యోగులు ఇళ్ల నుంచే పనిచేస్తున్నా మంచి ఉత్పాదకత వస్తుండటంతో కంపెనీల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. నిర్వహణ వ్యయం మరింత తగ్గించుకోవడంపై దృష్టి పెడుతున్నాయి మరోవైపు వికేంద్రీకరణ కారణంగా ఉద్యోగులకు కూడా ఇళ్ల అద్దెలు, ప్రయాణ ఖర్చులు, ఇతరత్రా ఖర్చులు తగ్గుతాయి. రాబోయే రోజుల్లో వికేంద్రీకరణ మరింత జరిగి శాటిలైట్ సెంటర్ల ద్వారా చిన్న చిన్న హబ్‌లు కూడా ఏర్పడబోతున్నాయి. ఇంటర్నెట్ స్పీడ్, నిరంతర కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించగలిగితే గ్రామస్థాయి వరకు కూడా తీసుకెళ్లే అవకాశాలుంటాయి. – వెంకారెడ్డి, వైస్ ప్రెసిడెంట్, సీనియర్ హెచ్ఆర్ లీడర్, కో ఫోర్జ్




(ఐటీ సర్వీసెస్‌లో ప్రధాన నైపుణ్యం (కోర్ స్కిల్), డిజిటల్ నైపుణ్యం (డిజిటల్ స్కిల్))

నేడు 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రారంభం

- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా కార్యక్రమం
- వచ్చే ఏడాది మరో 8 కొత్త వైద్య కళాశాలలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడాది నుంచే కొత్తగా తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తున్నాయి. శుక్రవారం సీఎం కేసీఆర్ ఈ కాలేజీలను ప్రారంభించనున్నారు. ఇందులో కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. రాష్ట్ర సొంత నిధులతో ఇలా పెద్ద సంఖ్యలో మెడికల్ కాలేజీలను ప్రారంభించడం దేశంలో ఇదే ప్రథమమని వైద్యారోగ్యశాఖ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా.. సీఎం కేసీఆర్ గత తొమ్మిదేళ్లలోనే కొత్త 21 కాలేజీలను ఏర్పాటు చేశారని అంటున్నాయి. వచ్చే ఏడాది మరో 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించనున్నారని.. వాటితో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు లక్ష్యం పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు.

నాగదేవతాలయంలో నాగుపాము



హవేళి ఘనపూర్(మెదక్): మెదక్ మండలం పేరూర్ సమీపంలోని స్వయంభు సప్తముఖ నాగ దేవతాలయంలో నాగుపాము భక్తులకు దర్శమిచ్చింది. గురువారం శ్రావణ బహుళ అమావాస్య పూజలు చేసేందుకు వచ్చిన భక్తులకు అది కనిపించడంతో తమకు స్వామివారి దర్శన భాగ్యం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. దేవాలయంలో నాగుపాము కొద్దిసేపు ఉండి వెళ్లిపోయింది.

మారుమూల పల్లెలకు నాణ్యతా ప్రమాణాలు

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు: బీఐఎస్

సాక్షి, హైదరాబాద్: మారుమూల పల్లెలకు నాణ్యతా ప్రమాణాలను చేరవేసేందుకు, వస్తువుల నాణ్యతపై అవగాహన కల్పించేందుకు గ్రామ పంచాయతీలను కూడా భాగస్వాములను చేస్తున్నట్టు భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) వెల్లడించింది. ఇందులో భాగంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా దాదాపు 2.4 లక్షల గ్రామపంచాయతీలను అప్రమత్తం చేసినట్లు హైదరాబాద్ శాఖాధిపతి సీనియర్ డైరెక్టర్ కేవీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 12వేలకు పైగా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. త్వరలోనే జిల్లా అధికారుల సమక్షంలో అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులకు శిక్షణ కార్య క్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 20న నల్లగొండ జిల్లాలో తొలివిడత కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ బీఐఎస్ కేర్ యాప్ ద్వారా స్వీయసాధికారత సాధించవచ్చన్నారు.


18న హైకోర్టుకు సెలవు

19న యథావిధిగా కార్యకలాపాలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి సందర్భంగా ఈ నెల 18న హైకోర్టుకు సెలవు ప్రకటిస్తూ రిజిస్ట్రార్(విజిలెన్స్) గురువారం ఓ ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత సెప్టెంబర్ 19న వినాయక చవితిగా అధికారిక క్యాలెండర్‌లో పేర్కొనగా, ప్రభుత్వం 18నే సెలవును ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 19న యథావిధిగా కోర్టు కార్యకలాపాలు సాగిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీకి ఇదే సెలవు వర్తిస్తుందని తెలిపారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.